# మనసులోని మర్మము

(తెరయెత్తేప్పటికి రజని అనే విద్యార్థి 'మనసులోని మర్మమును తెలుసుకో' అని పాడుతూ తాళం వేస్తూ కనిపిస్తాడు. యెదురుగా గురువు నాగభూషణం కుర్చీలో కూచుని వుంటాడు)

రజని:- (తాళం లయ కుదరకుండా వేస్తూ పాడతాడు) మనసులోని మర్మమును తెలుసుకో మానరక్షణ మరకతాంగనా.

నాగభూషణం:- (మొహం చిట్లిస్తాడు)

రజని:- (గురువు మొహం చూసి భయపడి ఆపేస్తాడు)

నాగ:- మెదడులో బంకమట్టి వున్నదా నాయనా (అభినయిస్తాడు వెక్కిరింతగా) వేలుకొలుపులాగా గుర్తు చేయాలా? మూడక్షరాలు వదిలి పాడేది విలంబితలయ, రెండక్షరాలు వదిలిపాడుతూ లయ పాడుచేస్తున్నావు. లయబద్ధంగా పాడటం, తాళం వేయలేకపోతున్నానని తెలుసుకోవా? లయగమనిస్తూ తాళం వేస్తూ మళ్ళా పాడు.

రజని:- (బెదురుతూ పాడతాడు) మనసులోని మర్మమును తెలుసుకో మానరక్షకా మరకతాంఘనా (తలెత్తి గురువును చూస్తాడు. ఠక్కున నోరు మూతపడుతుంది).

నాగ:- (చిరునవ్వుతో చూస్తాడు) బావుంది. లయబావున్నదని సంతోషిస్తుండగా వాచికం పాడైంది. నీవంటివాడే మరో ఘనుడు 'గుడాకేశే - నభారత' అనేవాడుట. ఏదీ 'మరగతాంఘనా' అంటే అర్థం వివరించు. విని సంతోషిస్తాను. మొన్ననేగా సంస్కృతం ఎంట్రన్సు ఫస్టుక్లాసులో పాసైనానని యీ గురువుతో అన్నావు.

రజని:- (మెచ్చుతాడని ఆశిస్తూ) ఘనమైన మరకత మణిమాణిక్యాలు కలవాడా!

నాగ:- భేష్! సంస్కృతం బాగా వచ్చని చెప్పావు. అమరకోశం కంఠస్థం చేసిన ఓ ఆసామీ దాని సారం మూడుముక్కల్లో 'ఇత్యపులు కూయంగ, కోనంగుడేయంగ, అప్వేకదంతుండు ఆడదొడగె' అని చెప్పి తన పాండిత్యం

వెల్లడించాడు. తామూ అమరం పూర్తి చేశారా? దొరగారూ?''

రజని:- (అమాయకంగా చూస్తూ నవ్వు మొహంతో అంటాడు) లేదండీ. రెండోసర్గ చదువుతున్నాను. మీరు చెప్పండి మీరు చెప్పిన సారం తెలుసుకుంటాను.

నాగ:- 'మనసులోని మర్మమును తెలుసుకో మానరక్షకా మరక తాంగనా మనసులో మర్మమును' మరకత, అంగ, నా అంటే మరకతమణి వంటి శరీరచ్ఛాయ గలవాడా? నా మనసులోని మర్మమును.

రజని:- (కదులుతాడు. కుతూహలమూ నవ్వు) అదికాదండీ నేనడిగిందీ, అమరసారమన్నారే అది సరిగా చెప్పమన్నా.

నాగ:- హరికథ విసుగెత్తినప్పుడు, పిట్ట కథ చెప్పి సభికులను రంజింపచేసినట్టు, దొరవారికి సంగీత పాఠం మధ్యలో వినోదం కలిగించాలి. వారాలు చేసుకునే వెధవకు వాచికం, తాళం చూసుకోవాలని ఆసక్తి లేదుగానీ, పాఠం తప్పించటంలో వున్నది. రేపటినించీ పాఠానికి తెల్లవారుజామున యేడు.

రజని:- (నొచ్చుకోడు) చిత్తం (తలవంచి వినయంగా అంటాడు) నేను వారాలు చేసుకోటం లేదు గదండీ. (పాడబోతాడు) మరకతాంగనా మనసులోని మర్మము.

నాగ:- (వెటకారంగా) ఓహో! ఆత్మాభిమానం దెబ్బతిన్నదా తమరికీ. ఇప్పుడు నాగరకత హెచ్చింది గదూ. పోనీ, ఒక్కోపూట ఒక్కో సజ్జనుడు హోటలు బిల్లు చెల్లిస్తున్నాడు గనక పూటలు చేసుకునే అనేదా? సరిపోయిందా?

రజని:- (నవ్వుతాడు. తాళం వేస్తూ కీర్తన పాడతాడు).

(వాకిలి చప్పుడౌతుంది. ఇద్దరూ అటుచూస్తారు. తలుపు ఓరగా తీసి శర్మ లోపలికి వస్తాడు. ప్రయాణం బడలిక కనబడుతుంది)

శర్మ:- యేరా? బావా? పాఠం డిస్టర్బ్ చేశానా యేం? (చనవుగా అడుగుతాడు) అత్తయ్యా నువ్వూ క్షేమమా? (చేతిలోని పెట్టె గోడవారగా వుంచుతాడు. చాపమీద బుద్ధిమంతునిలాగా కూచుంటాడు).

(నాగభూషణం విసుగ్గా, టైమ్ వేస్ట్ అవుతున్నట్టు చూస్తాడు. నిగ్రహించుకుని

క్రమంగా నవ్వు మొహం పెడతాడు).

నాగ:- రోజురోజుకీ ఆయువు క్షీణిస్తూ మృత్యువు దగ్గరపడుతుంటే, 'క్షేమమా?' అని అర్థంలేని ప్రశ్న వేస్తారన్నాడు మహాకవి. రాయల్లే వున్నాను. పాఠం చెపుతున్నాను. కనబడటం లేదూ? మీ అత్తయ్య సంగతా? నిత్యనైమిత్తికాలతోనూ చచ్చే చాదస్తంతోనూ కాలాన్ని నెట్టుకొస్తున్నది. చూస్తే కాలమే ఆమెను నెట్టేసేట్టున్నది.

రజని:- పాఠం ముగిసిందండీ. వెళ్లమంటారా.

నాగ:- యెవరన్నా ఆపద్బాంధవుడల్లే వచ్చి పాఠానికడ్డుపడకపోతాడా అని చూస్తూ వుంటావల్లే వున్నది. మరో కీర్తన మొన్ననే పూర్తి అయింది, అది కానీయ్.

రజని:- (నిదానంగా తాళం తప్పకుండా పాడుతాడు. మామ వ రఘురామా. మరకతమణి శ్యామా).

నాగ:- (చెయ్యి వూపుతాడు) వెళ్ళచ్చు.

(రజని యిద్దరికీ నమస్కారం చేసి వెళ్లిపోతాడు)

శర్మ:- (శిష్యుడు వెళ్లిన వేపు చూసి, నాగభూషణం వంక నవ్వుతూ చూస్తాడు). నీ దగ్గర పాఠం చెప్పుకోటానికి విద్యార్థులెట్లా పోగుపడతారా అని నా కెప్పుడూ సంశయమే బావా. 'బ్రహ్మచారీ శత మర్కటః అని సూక్తి. పెళ్లి చేసుకోరా' అని నేనూ మీ అమ్మా యెంత దేవులాడినా వినిపించుకోవుగదా. వంశం నిలబెట్టవా? పెళ్లి చేసుకో నా మాట విని. కాస్త దూర్వాసత్త్వం, కర్కశత్త్వం తగ్గుతుంది. కాస్త మృదువుగా మాట్లాడటం అలవడుతుంది. యెండనబడి వస్తిని గదా. రమ్మనీ, కూచోమనీ, దాహం కావాలా అనీ ఫార్మల్‌గా నన్నా అడగవు (నవ్వుతాడు).

నాగ:- (టైమ్ చూసుకుంటాడు. వాకిలి వంక చూస్తాడు). లోపలికి రావటానిక్కదూ నువ్వొచ్చిందీ? పోవటానికా? పో. శీఘ్రంగా. నీ పెళ్లిళ్ల సొద వినటానికి నాకు టైమ్ లేదు. నువ్వు యెన్నే ఒక్క పెళ్లికూతురుకీ సంగీత సాహిత్యాల్లో అభిరుచి వుండదు. ఆ నడక చూసే చెప్పచ్చు పెళ్లి కుమార్తె

అభిరుచులేమిటో. నువ్వుతెచ్చే మనువులు అమ్మకి నచ్చుతున్నాయి గనక ఆమెకే యిచ్చి పెళ్లి చేయి. ( ఇద్దరూ నవ్వుతారు).

శర్మ:- తీరా నీ అభిరుచులకి తగిన పిల్ల వచ్చినా నీ మాట తీరు చూసి, నీ భాష వినీ, నీ తరహా చూసీ, బెదిరి పారిపోతుంది. నీ ఖర్మ. నేనేం జేయనూ?

నాగ:- (నిరసనగా చెయ్యి తిప్పుతాడు) పోతుందీ పోనీ. నానెత్తి నెక్కాలని అదీ, దాని నెత్తినెక్కాలని నేనూ కుయుక్తులు పన్నుతూ మనస్సంతా కలుషితం చేసుకునే బదులు యిట్లా వుండటమే హాయి. అసలు నీకు పుట్టిన తెగులే అది 'వీడాడదాని చేతికి చిక్కలేదే' అని చింత. యౌవనం, బుద్ధి సూక్ష్మత అనేవి, ఒక శాస్త్రాన్ని తరిచి తరిచి స్వాధీనం చేసుకోటానికి వుపయోగించాలి. ఆడదాని కుటిలత్త్వం స్వార్థం చూసి ఆనందించటానికి వుపయోగించటం వ్యర్థం.

శర్మ:- మగవాడి సంగతి తేల్చావు. ఆడదేం చేయాలి? గొడ్రాలల్లే వుండిపోవాలా? దాని జన్మకి ఆనందమనే దక్కర్లేదంటావా?

నాగ:- మేరీ క్యూరీకి దక్కిన బ్రహ్మానందం యెంతమంది స్త్రీలకి దక్కిందీ? ఆవిడ గొడ్రాలా? మనవాళ్ల కెంతసేపటికీ చీరలూ, నగలూ, అత్తవార్ని ద్వేషించటం, అల్లుణ్ణి దూషించటం, కోడల్ని అణిచిపెట్టటం, యిటువంటి వాటిల్లోనే వాళ్లకాసక్తి హెచ్చుతుంది. మొగుడెప్పుడు టపాకట్టేస్తాడా అని చూస్తూ వుంటారు. పెళ్లి పెళ్లి అని చిన్నతనం నించే అదేదో ఘనకార్యమైనట్టు అలవాటు చేస్తారు.

శర్మ:- నీకాచింతఖ్కర్లే. ఇప్పుడాడపిల్లలకి పెళ్లిళ్లు కావటం గగనమై పోతున్నది. చదువులో దూరినా, సైన్సు అందరికీ అర్థమై చావదూ? చదువబ్బదూ? గణితం గొంతు పట్టుకుంటుంది (అభినయిస్తాడు).

నాగ:- (శాంతంగా) సంగీతం నేర్చుకోవచ్చుగా?

శర్మ:- చెప్పే పీనుగేడీ?

నాగ:- నీ రాజమండ్రి భాష యిక్కడ వాడకు.

శర్మ:- (యీసడింపును లెక్కజేయడు. వెటకారంగా అంటాడు). ఓ పీనుగు

సరళీలు అర్నెల్లు చెపితే, మరో దగుల్బాజీ డబ్బు ముందే పుచ్చీసుకుంటూ జంట స్వరాల వరకూ బండిలాగుతాడు. మరింకడకుక్క. అదే సంగీత వ్యాప్తి.

నాగ:- (చెవులో వేళ్లుంచుకుని లేచిపోబోవును).

శర్మ:- (నవ్వుతూ దణ్ణం బెడతాడు) కూచోరా బావా. గుంటూరు జిల్లా భాష బావుండేట్టయితే అదే వాడతాను. మరొక త్యాగబ్రహ్మ శిష్యపరంపరలోనివాడు, శిష్యురాలి మొహంలో మొహంపెట్టి పేడిమూతి కదిలిస్తూ, ఉమ్మి తుంపరలు రాలుస్తూ, సోది చెపుతాడేగాని సంగీతం చెప్పడు. ఒక్కొక్క కీర్తన పూర్తి చేయటానికి నాలుగూ లేక ఆరునెలలలు పడుతుంది. పిల్ల తండ్రినడిగి ముందే వెయ్యి తీసుకున్నాడు. అడ్వాన్సుగా, అలా యెడ్వాన్సు యీయకపోతే, కూలీ యిచ్చినట్టు జీతం పారేస్తారుట మొహాన. పిల్లచేత రేడియోలో ప్రోగ్రామిప్పిస్తానని ఆశపెట్టాడుట ఆ కంట్రాక్టరు. యెంతసేపూ దాన్ని స్వాధీనం చేసుకోవాలనే తాపత్రయం తప్పితే, దానికి సంగీతం స్వాధీనమయేట్టు చూడడు. యెంతలేసి ఆశగలవారైనా వున్నారు. పృష్ఠభాగం అరిగిపోతుందేమోనన్నట్టు అరగంటకే లేచినుంచుని, అరచేతుల్తో రాచి చూచుకుంటాడా సంగీత బ్రహ్మ.

నాగ:- (కన్నార్పకుండా బావను చూస్తాడు). బందరులో నీకు చాలామంది పరిచయస్థులున్నట్టున్నారే! (లేవబోతాడు).

శర్మ:- (కూచోమంటాడు). అపరాధీనపరాధీనయ్యాయో నాగభూషా (రాగం తీస్తాడు. నాగ భూషణం నవ్వుతాడు). క్షమించాలి. పోనీ నువ్వు న్యాయం చెప్పు. నిజాయతీగా సంగీతం చెప్పేవాడెవడన్నా కనీసం మన విశాలాంధ్రలో వున్నాడంటావా? పక్షపాతం లేకుండా చెప్పు.

నాగ:- ( ఆలోచిస్తున్నట్టు చూస్తాడు ) అదీ నిజమే. కాని నేనూ కాస్త ప్రపంచం చూసినవాడినే. చెప్పుకునే వాళ్లలో, పోనీ చెప్పించేవారిలో లోపాలేమీ లేవంటావా? పెళ్లికి ముందు సంగీతం చెప్పించే వారొకరూ, మాష్టరు సరిగా రాకపోతే జీతం విరగ్గోసేవారు మరొకరూ, తీరా వస్తే మా అమ్మాయికి జరమొచ్చింది, యివాళ పాఠం వద్దనే వారింకొకరూ, యెదురు వాయిద్యం

సమకూర్చకుండానే తంత్రీవాయిద్యం నేర్పమనే ఘనులూ, ''అదెట్లా సాధ్యం?'' అని మేష్టరు అన్నాడనుకో ''నీ తంత్రీ వాయద్యం నువే తెచ్చి నేర్పు. నీ కోసం మేం కొనం'' అనే వారున్నారు. వీణా వాయిద్యం, దాని మెళుకువలూ గమకాలూ నేర్పుతుంటే, అదే జీతానికి గాత్రం గూడా కానిచ్చేయమనటం. వీణ అందచందాలు వింటారో లేక గాత్రంలోని ఒదుగులు గమనిస్తారో వాళ్లకే తెలియాలి. లేదా అదే డబ్బుకి మరి కొంత సమర్థత లాగాలనేమో ఆలోచన. అంతటితో అయిపోలేదు. సంగీత పాఠం జరిగినంత సేపూ అమ్మాయికి మూడువేపులా కాపలా, కొద్ది దూరంలో పహారా.

శర్మ:- అదో పెద్ద తప్పేమిటీ? శిష్యుడి చేత అడ్డమైన చాకిరీ చేయించి, వంటలో గూడా సాయపడమనే ప్రబుద్ధుడైన గురువు లేడంటావా? నా దగ్గర చెప్పకు.

నాగ:- అందుకే, చెప్పించుకునే వాళ్లలోనూ, చెప్పేవాళ్లలోనూ గూడా లోపాలున్నాయంటున్నాను. నేర్చుకునేవాడు. ఆసక్తితో పాటు సూక్ష్మగ్రాహి అయితే, నేర్పేవాడు నిజాయితీగలవాడైతే, సంగీతం మూడేళ్లలో స్వాధీనమౌతుంది. తర్వాతంతా, మెరుగులు దిద్దుకుంటూ, ప్రతిభను వృద్ధిజేసుకోటమే మిగులుతుంది. లోకజ్ఞానం సంపాయించి, దాన్ని తోడుగా వాడుకోవాలి.

శర్మ:- ( ఆశ్చర్యంతో కళ్లు పెద్దవి జేస్తాడు. అరచెయ్యిజూపి నాగభూషణం వేపు పెడతాడు) మూడేళ్లా! నువ్వు గుణాఢ్యుడిని మించిపోయావురా బావా. మూడేళ్లలో స్వర కల్పన, రాగం తానం పల్లవీ, ఆవృత స్వరాలు అన్నీ నూరిపొయ్యటానికీ ఔషధాలా అంట? స్వరజ్ఞానం కలిగితే గొప్పే. నాగాలెక్కువ గదా.

నాగ:- నువ్వు పొరబడుతున్నావు. గురుశిష్యులిద్దరికీ, సంగీతమందు గౌరవముంటే వస్తుంది. చెప్పే పద్ధతులున్నాయి. కాలం మారింది. ఇది యంత్ర యుగం. అనేక యంత్రాలున్నాయి. ముఖ్యంగా రేడియో, టేప్ రికార్డర్, తాళం వేసే యంత్రం, శృతి చెప్పే యంత్రం పాడేప్పుడెలా వుండాలీ, టివి మీద చూడచ్చు.

పెద్దలిచ్చే ప్రోగ్రాములు వినచ్చు. ఫింగరింగ్ టెక్నిక్ చూడచ్చు.

శర్మ:- నువ్వెన్ని అయినా చెప్పు. కనీసం యెనిమిదేళ్లయినా పడుతుంది. అదీ ఒకే గురువు వద్ద యేడిస్తేనూ. పల్లెల్లో పట్నాల్లో గురువు, పిల్ల పెళ్లయిపోయి పిల్లల్ని కంటున్నా పిల్లారి గీతాలు చెపుతూ వుంటాడు. 'మానేయ్యవయ్యా' అంటే యెందుకు లెండి చెప్పనీయండి. మీ ఖర్చులలో యిదే పాటి అయిపోవచ్చిందిగా' అని పిడిరాయల్లే కూచుంటాడు.

నాగ:- (చిరునవ్వు నవ్వుతాడు) నువ్వు మరీ యెద్దేవా చేస్తున్నావు. విద్యార్థిని పిల్లల్ని గనంగానే, తన పిల్లనగ్రోవి పిల్లలకి ఆడుకోటానికిచ్చే శిష్యురాల్ని చూశాన్నేను. యెంత కష్టపడి, ధనం, కాలం వెచ్చించి నేర్చిన విద్య గుంటబెట్టి గంట వాయించటం లేదు?

(తలుపు చప్పుడై విడిబడుతుంది. సుశీల వస్తుంది. పాతికేళ్లుంటై. అణుకువగా, మర్యాదగా కనిపిస్తుంది. విలువైన చీరా నగలు కాసినీ) (శర్మ చూస్తాడు).

శర్మ:- రా సుశీలా. ఇట్లా వచ్చి కూచో. సమయానికి వచ్చి నన్ను రక్షించావు. యేదీ కాస్త నీ గురువుగారి ప్రతాపం, నీమేనమామకి వినిపించు (కుర్చీ చూపించును).

సుశీల:- (లోపలికి దారి తీస్తుంది) లోపలికెళ్తాను బాబూ. మామయ్యకి కోపమొస్తుంది. నేను అమ్మమ్మను చూసిపోదామని వచ్చాను. (మేనమామను చూస్తుంది).

నాగ:- కుర్చీలో కూచో సుశీలా. ఫరవాలేదులే. ఈయన గారొచ్చింది దేనికీ? కాలం వ్యర్థం చేయటానికి. అన్నిటికన్నా చౌకైనదేదీ? కాలం. మీ ఆయనేమంటున్నాడూ? నిన్నింకా అనుమానిస్తున్నాడా? వాడికే గనక చీమ తలకాయంత ఇంగిత జ్ఞానముంటే, నీవీ పాటికి రేడియో ఆర్టిస్టువి అయివుండేదానివి.

సుశీల:- ఊరుకో మామయ్యా. నీకాయనంటే గౌరవమే. నన్నేడిపించటానికలా నిందిస్తావంతే. (బల్లమీది కొత్త పుస్తకం '' ఆంధ్ర వాగ్గేయకారక చరిత్ర''

అందుకుని చాపమీద కూచుని పేజీలు తిరగేస్తూ చదువుతూ వుంటుంది)

శర్మ:- సరే. మీ శ్రీవారిని మన్నించేశాం. (బతిమాలుతున్నట్టు చేతులు దొన్నెల్లే పెడతాడు) ఓన్లీ టెన్ మినిట్స్, ఎంటర్‌టెయిన్‌మెంట్. గురుకలాపం వినిపించు. ఇవాళ మనసంతా చికాగ్గా వున్నదెందుకనో. బావెందుకో మరీ గంభీరముద్ర పట్టాడివాళ. కాసేపు వినిపిస్తివా, యిటునించిటే వెళ్ళిపోతా, లేకపోతే బావ మెడపట్టి గెంటేట్టున్నాడు. వాడి చూపువేడికి భస్మమౌతానేమో. కానీ మరి. (నవ్వుతాడు. నాగభూషణం నవ్వు మొహం పెడతాడు. సుశీల మాత్రం విచారంగా చూస్తుంది. అప్రయత్నంగా కళ్లు తడి అయితే నలుపుకుంటుంది).

2 వ దృశ్యం

(పన్నెండేళ్లసుశీల వీణ వాయిస్తూ వుంటుంది యెదురుగా గురువు. ఆయనెదుట వీణ. పొద్దున యెనిమిది గంటలౌతుంది).

గురువు:- సుశీ! వర్ణం బాగానే వాయిస్తున్నావుగానీ, మీ డ్రైవరున్నాడా?

సుశీల:- నా పేరు సుశీల. మూడక్షరాలు పలకలేకండా వున్నారే? డ్రైవరివాళ రాలేదు.

గురువు:- మీ నాన్న ఆఫీసుకెలా వెళ్తాడు మరి?

సుశీల:- ఆయనే డ్రైవ్ చేసుకుంటారు.

గురువు:- మరి డ్రైవరెందుకు?

సుశీల:- ఆయిల్, గాలీ, చూడటానికీ, కారు శుభ్రంగా కడిగివుంచటానికీ. కారు బజార్లో వదిలి, కొట్లో కెళ్తే, కాపలా కాయటానికీ.

గురువు:- ఓహో! (వాకిట్లోకి తొంగి చూస్తాడు) ఎవరో వచ్చారు చూడు.

సుశీల:- పక్కింటి వాళ్ల నౌకరు.

నౌకరు:- బుల్లెమ్మగోరూ మా అమ్మగారు కూంత కరివేపాకట్టుకు రమ్మన్నారు.

గురువు:- పోయిచ్చిరా. వర్ణం ముగిసింది. (సుశీల వీణ వదిలి వెళ్తుంది)

గురువు:- (బిగ్గరగా) సుశీ! నాకూ్కడా కావాలి. మరికొంచెం పత్రా. ఇవాళ మరదలికి పసుపుకుంకమిస్తారు. కాస్త పులిహోరా, చలిమిడీ గట్రా చేసుకోవాలి.

(సుశీల వచ్చింది. నౌకరుకి కొంత అందించింది. మిగిలినది గురువుకెదురుగా కింద వుంచుతుంది. వీణ ముందు కూచుని వర్ణంలోని ఉత్తరార్థం పూర్తి చేస్తూ వుంటుంది. పొరుగింటి పిన్నిగారు వస్తుంది.)

పిన్నిగారు:– ఔనే సుశీలా! ఇవాళ నల్లఫోర్సుగా వదిలాడా? మాటాంకులోకి నీళ్లు ఎక్కలేదు. దోబీ ఇస్త్రీ గుడ్డలు తెచ్చాడా? మీరు నూటికిస్తారా? మూడు వుతుకులకిస్తారా జీతం? సంగీతం నేర్చుకుంటున్నట్టున్నావే? నేను వచ్చి డిస్టర్బు చేశానాయేం? వీణ వాయించుకో. నే లోపలకి పోతున్నా (లోనికి వెళ్తుంది).

గురువు:– అన్నట్టు, నేను డ్రైవర్నడిగిందందుకే. సుశీ! మా మరదలూ, తమ్ముడూ పురిటికొచ్చారని చెప్పలేదూ నీతో? వాళ్ల పిల్లలు నలుగురూ, నా పిల్లలు నలుగురూ, వెరసి యెనమండుగురు పిల్లలూ గడపమీద కూచుని, 'మంచి నీళ్లే అమ్మా?' అంటే నా కడుపు తరుక్కుపోయింది. చెప్పొద్దూ. ఇవాళ మా వీధి కొళాయి వదల్లేదు. చాకలి సంగతి చెప్పక్కర్లేదింక. నెలకు ఒక వుతుకు తెస్తాడు. ( ఇంటిలోపలికి చూస్తాడు)

గురువు:– ఎవరావిడ? ఆవిడకి సంగీతమంటే యిష్టమల్లే వున్నదే? వాళ్ల పిల్లలకి చెప్పిస్తుందా? నువ్వు వీణ వాయిస్తుంటే అలా నిలబడిపోయి విన్నది. వాళ్ల పిల్లలు సంగీతమంటే చెవికోసుకుంటారుట. బాగా చెప్తానని నువు శిఫారిస్ చేయాలి. (సుశీల తలెత్తకుండా చరణం వాయిస్తుంది. వాకిట్లోకి కూరలొచ్చినై. ఇంట్లోంచి తల్లికేక).

తల్లి:– సుశీలా! మునక్కాడలుంటే ఓ పదితీసుకో. నాకు చెయ్యి ఖాళీగా లేదు. (సుశీల వీణ కింద వుంచి, విసుక్కోకుండా పోయి ములక్కాడలేరుతుంది).

గురువు:– సుశీ! ఎట్లా యిస్తానంటున్నాడు? కాస్త బేరం చేసి నాక్కూడా తీసుకో. జీతంలో కట్టుకుందువుగానివి. (జేబులో చెయ్యిపెట్టి చూసుకుంటాడు)

గురువు:– అన్నట్టు. డబ్బున్నదేవ్. ఇంద బేడకాసు.

(విసిరి సుశీల మీద పడేస్తాడు)

(సుశీల ములక్కాడలింట్లో వుంచి వచ్చింది. కూరల వాడికి డబ్బు యిచ్చింది.

మేష్టరు ముందు ములక్కాడలుంచింది.)

కూచుని వీణ అందుకుని చివరి చరణం పూర్తి చేసింది. వాకిట్లో జీప్ చప్పుడు. జీప్ ఆగుతుంది. సుశీల తండ్రి తాసీల్దారు వస్తాడు లోపలికి. ఆయన వెంట పెద్దమనుషులుంటారు.

(గురువు వారిని చూసి తన ముందు వీణ అందుకుంటాడు)

గురువు:- ఆ. కొత్త పాఠం మొదలుపెడదాం. అటతాళ వర్ణంతోడి రాగం. కనకాంగీ. గుర్తుందా?

సుశీల:- ఉన్నది.

గురువు:- గావూదా వుదనీసా (అని వాయించి వినిపించును. సుశీల అనుకరించును).

తాసీల్దారు:- యేమండీ మేష్టరుగారూ! మా అమ్మాయి సంగీతమెట్లా వున్నది? (తనతో వచ్చిన వారిని కూచోమని చెపుతాడు)

గురువు:- మీ అమ్మాయి సంగతేనా? కాదుగానీ సుశీది మా గొప్ప బుర్రండీ. అటువంటి స్వరజ్ఞానం గల పిల్లను నేనింతవరకు చూడలేదు. ఇట్లా చూపితే అట్లా అల్లుకుపోతుంది. యే రోజూ పాఠం రాలేదు అనదు. యేదీ? బడి వకటి. టైము చాలదు. లేకపోతే నా యీ పాటికి తానం వాయించగలిగేది.

తండ్రి:- అమ్మా సుశీలా! నీ పని అయిందా? ఇవాళ నువ్వు జీపులో వెళ్లాల్సిందే బడికి. మన కారు రిపేరు పూర్తి కాలేదు. సాయంకాలానికల్లా వచ్చేస్తుంది. పాఠమైందా?

(తలెత్తివోసారి విచారంగా తండ్రి వంక చూస్తుంది)

సుశీల:- జీపు పంపేయండి నాన్నగారూ. పాఠమైందిగానీ, నా పనికాలేదు. పొద్దున, తమ్ముళ్లనూ, చెల్లినీ బడికి పంపటంతో సరిపోయింది. నా జడా స్నానం కాలేదు. ఇంకా అన్నంతినాలి. పుస్తకాలు చూసుకోవాలి (వీణ తీసుకుపోయి, యింట్లో వుంచి వస్తుంది. తండ్రి లోపలికి వెళ్తాడు).

గురువు:- తెల్లవారు జామున లేవకపోయావా? ఇవాళ పాఠమే కాలేదసలు.

ఇట్లా అయితే యెట్లా? నేను తెల్లవారు జామున వచ్చి చెప్తానంటే వినిపించుకోవు.

సుశీల:- మీకెందుకు లెండా శ్రమ. నాకు ప్రాప్తముంటే వస్తుంది లేకపోతే లేదు. తెల్లవారుజామున అనగానే, మీ సౌకర్యాలు చూడవద్దా? మా అమ్మ చెయ్యలేదు (జడతిప్పుకుంటూ లోపలికి వెళ్లిపోతుంది).

తాసీల్దారు వస్తాడు.

తండ్రి:- (వచ్చి మేష్టర్ని చూస్తాడు)

గురువు:- నాకేం కావాలి? కాలకృత్యాలకి వేణ్ణీళ్లూ. కొంచెం వేడి వుప్మా, పొగలు కక్కే కాఫీ ఓ కప్పూ చాలు. నాకు యిడ్లీ పడదు. ఉప్మా నేతితోనే చేయాలి. లేకపోతే నూనె పడక కళ్లంటుకుంటాయి.

తండ్రి:-(చిరునవ్వు) దాంతో మీకెందుకులెండి. యేదో చిన్నతనం. వాళ్లమ్మ పనిచేస్తుంటే చూడలేదు.

(లోపలికి పోతూ కేకవేస్తాడు).

తండ్రి:- తల్లీ! సుశీలా! నీ పని అయేదాకా డ్రైవరుంటాడు. నడిచి వెళ్లలేవు.

(గురువు లేచి అక్కడున్నవారితో, త్రిభాషా సూత్రం యెలా ఫెయిలైందీ చర్చిస్తూ వుంటాడు. వాళ్లు మర్యాదగా ఆఫీస్‌రూమ్‌లోకి పోయి తలుపేశారు)

(గురువుపోయి జీపులో కూచుంటాడు)

గురువు:- పోనీవోయ్! నా కింటిదగ్గర పనున్నది. మా ఆవిడ వాకటున్నది. వంటా అదీ చూసుకుని, పూజా గీజా కానిచ్చేప్పటికి, పిల్లలు ఆకలై, అన్నమని గోలెడతారు. ఇంటికిపోయి త్వరగా వడ్డించుకోవాలి.

(డ్రైవరు గురువుగార్నెగాదిగా చూస్తాడు)

డ్రైవరు:- బాటరీ డౌనైంది సార్. ఇక్కడ నించి అరమైలు దొబ్బాల జీపును.

(ప్రైవేట్ కారు వచ్చును. అందోలోనుండి యిద్దరు స్త్రీలు దిగి వచ్చి లోపలికి వెళ్తారు).

(గురువుగారు జీపుదిగిపోయి కారు తలుపుతీసి వెనక సీటులో కూచుంటాడు)

(డ్రైవర్లిద్దరూ ఒకళ్ల మొహం ఒకళ్లు చూసుకుంటారు. కారు డ్రైవరు

సిగరెట్ ముట్టించి వెళ్లిపోతాడు).

(గురువుకి విసుగెత్తి దిగి వచ్చి మొదటి డ్రైవరుని అడుగుతాడు)

గురువు:- నువ్వు నన్ను దింపి వద్దువుగానిరా.

డ్రైవరు:- నాకు కారు నడపటం రాదు సార్. అయినా ఇగ్నీషన్ కీ యేదీ? అమ్మగారు పీక్కెళ్లారు.

(గురువులోపలికెళ్తాడు. లోపల్నించి నవ్వులు వినిపిస్తాయి)

గురువు:- సుశీ! నీకు బడికి వేళగాలేదూ? రావేం?

సుశీల తల్లి:- సుశీల అన్నం దింటున్నదండీ. అదసలే ముక్కునా నోటా కొట్టుకుంటూ తింటుంటే, మీరింకా తొందర పెట్టండి. పిల్ల చిక్కి సగమైంది. యేం సంగీతం నా బొంద సంగీతం. లేతవేళ్లు గీతలు పడి తెగిపోతున్నై.

గురువు:- మరీ యెక్కువగా సాధన చేస్తున్నది. అంతగా చెయ్యక్కర్లేదు.

(వాకిలి వేపు చెయ్యి విసిరి చూపుతాడు. ముక్కులో వేలుపెట్టి నలుపుకుంటాడు).

గురువు:- ఆ కారు డ్రైవరెక్కడికో వెళ్లాడు. నేను త్వరగా యింటికెళ్లాలి. మా ఆవిడ మూల కూచున్నది. నా సైకిలు రిపేరు కెళ్లింది. నీరసంగా వున్నది.

(కుర్చీలో కూచుని కాళ్లు యడంగా వుంచి తలవేలాడేస్తాడు)

(లోపలికెళ్లినావెం వస్తుంది. నోటిమీద కర్చీఫ్ పెట్టుకుంటుంది. నవ్వాపుకుంటుంది. సుశీల తల్లితో అంటుంది.)

1వ ఆమె:- మేం వెళతాం విశాలా. ఇంకా చాలా యిళ్లు పిలుచుకోవాలి. నీకు వీలుకాకపోతే, సుశీలనీ పిల్లల్నీ పంపు మా కారొస్తుంది. (కనుగీటి నవ్వింది. 2వ స్త్రీ వచ్చింది. ఇద్దరూ వెళ్లి కారులో కూచున్నారు. కారు స్టార్టవుతుంది).

(మేష్టరు వీధులోకి తొంగి చూస్తాడు)

(కారు వెళ్తూ వుంటుంది)

శాంత:- అదేమిటే సరోజా డ్రైవరేమయినాడూ?

సరోజ:- వాడి కెవర్నన్నా డ్రాప్ చేయటం యిష్టం లేకపోతే, అట్లా మాయమౌతాడు. ఇక్కడే యెక్కడో మలుపులో వుంటాడు.

( ఇంట్లో విశాల గురువుతో అంటుంది)

విశాల:- కాసిని పాలు తీసుకుంటారా?

గురువు:- ఛీ. ఛీ. నాకు సయించవు. నాకు చిన్నప్పటినించే కాఫీ అలవాటు. నేను భోజనం మానేసి ఒక పుష్కరకాలం కాఫీ మీదే బతికాను. పంచకావ్యాలు చదివాను.

విశాల:- (నోటిమీద  చెయ్యి పెట్టుకుని నవ్వుతుంది) యేమిటీ? కాఫీ మీదే! (లోపలకి వెళ్లిపోతుంది)

(తాసీల్దారూ పెద్ద మనుషులూ వస్తారు. అందరూ వీధిలోకి వెళ్తారు. జట్కా వకటి వచ్చి, యింటి ముందాగుతుంది. ఇద్దరు వ్యక్తులు దిగివచ్చి నమస్కారం చేస్తారు).

గురువు:- నేను వెళ్లాలండీ.

పెద్దమనిషి:- డ్రైవర్!

డ్రైవర్:- సార్! బాటరీ కొత్తది తీసుకోవాలని గుర్తుచేశాను (తల గోక్కుంటూ నవ్వుతాడు).

(పెద్దమనిషి వాడి వంక చూస్తాడు)

(జట్కాలోంచి దిగినవాళ్లు జట్కా మనిషికి డబ్బిస్తారు)

పెద్దమనిషి:- ఈ జట్కాలో వెళ్లండి గురువుగారూ. ఆ జట్కావాలాకి మీ యిల్లు తెలుసు.

(గురువుగారు ఒక్క వుదుటున జట్కాలో కూచుంటాడు. బండీ పట్టుకుని తాసీల్దారును చూస్తూ అంటాడు).

గురువు:- ఇవాళ సుశీని సాయంత్రం ఆరింటికి మా యింటికి పంపండి. మా బాబు పుట్టినరోజు. మా ఆవిడ కళ్లనీళ్లు పెట్టుకుని మరీ మరీ అడిగింది. 'సుశీ మనింటికి ఒక్కసారన్నా రాలేదు'. మా బాబు ముద్దొస్తూ చాలా బావుంటాడు. సుశీవాడినెత్తుకుని కింద దింపదు. హెల్తాఫీసరుగారమ్మాయినీ, పిల్లలందర్నీ సరదాగా పోగుజేసి సుశీ వెంటకారులో పంపండి. డ్రైవర్ని నమ్మి గురువు:-

ఆడపిల్లనొక్కతెనూ పంపరాదు.

(జట్కావాలా గుఱ్ఱాన్ని కొరడాతో కొడతాడు. అది బండిని వెనక్కు నడిపిస్తుంది. వాడు బాదుతాడు. చూడలేక ముగ్గురు బండిని ముందుకు నెట్టుతారు. గుఱ్ఱం గభీమని దౌడుతీస్తుంది. అందరూ యింట్లోకి వస్తారు)

(సుశీల పుస్తకాలు పట్టుకుని యెదురుగా వస్తుంది).

తండ్రి:- అమ్మా! జీపులో వెళ్లు. ఎండగా వున్నది.

(కారాగుతుంది. సరోజ నవ్వుతూ దిగుతుంది)

సరోజ:- కమాన్ సుశీలా. నేదింపుతారా. నీ కోసమే వచ్చాను. నీ బడిమీదిగా వెళ్తాన్నేను.

(సుశీల ఫ్రంట్ సీట్‌లో కూచుంటుంది. సరోజ స్టార్ట్ చేస్తుంది)

(జీపులో వచ్చిన వాళ్ళు తాసీల్దారు గారికి నమస్కారం చేసి జీపు యెక్కుతారు. జీపు వెళ్లిపోతుంది.

జట్కాలో వచ్చినాయన:- ఈ పంతులెక్కడందాడు మీకూ? (నవ్వుతాడు)

తాసీల్దారు:- యేదో పాపం పిల్లలుగలవాడు. చెప్పేదేదో బాగానే చెపుతాడు. నా మిత్రుడు రికమెండ్ చేస్తే పెట్టాను. రండి యింట్లోకి పోదాం.

3వ దృశ్యం

గురువుగారు:- ఇప్పుడు నువ్వు పియుసి చదవక పోతేనేం? సంగీతం పూర్తి చేసుకోరాదూ? ఇంకొక్క యాడాది చెప్పానంటే ఆడిషన్‌కి కూచోగలవు.

సుశీల:- నేబతికుండగా చదువెట్లాగన్నా పూర్తి అయే అవకాశమున్నదేమోగాని సంగీతం పూర్తయేమాట కల్ల ఇవాళ పాఠం లేదనుకుంటా. వీణ అవతలుంచేయనా? కారూ డ్రైవరూ వున్నారు.

గురువు:- (వినబడనట్టు, లెక్కజేయనట్టూ చూస్తాడు) ఉండు. మీ నాన్నతోనే చెపుతాగా. కట్నమెట్లాగో పొయ్యాలి, చదువు ఖర్చుగూడా యెందుకు ఆపేయాలి అని. ఆ వచ్చిన చదువు చాలు. సంబంధాలు చూస్తున్నారా?

సుశీల:- యేమో నాకు తెలియదు.

సరే పాఠం కానీ (వీణ అందుకుని వాయిస్తూ చూపును) నెనరుంచినానూ. అన్నిటికి నీ దాసుడని నేనూ. నీదు పైనెన రుంచినానూ.

సుశీల:- (అనుకరిస్తూ సంగతులు వేయును)

గురువు:- కాఫీ లేదా యివాళ?

సుశీల:- మీ పక్కనే ఫ్లాస్కులో వున్నది. అక్కడే గ్లాసున్నది.

గురువు:- పోసివ్వు

సుశీల:- మీరు పోసుకుని తాగండి. మా అమ్మ మాటిమాటికీ లేవద్దన్నది.

గురువు:- (వీణ వుంచేస్తాడు) నేను కాఫీ తాగుతూ వుంటా. నువ్వు వాయిస్తూ వుండు. (కాఫీ తాగి గ్లాసులోనే వుమ్మి వేయును).

సుశీల:- అనాఘజీ మూతా సుఖజలధి గంభీర నీ పాదములపై నెనరుంచినానూ.

గురువు:- అన్నిసార్లు వాయించావెందుకూ?

సుశీల:- తాళం తప్పితే మళ్లా వాయించా. సరిగా పడింది.

గురువు:- తాళం తప్పితే నే చెప్పనూ. వందమంది వాయిస్తున్నా, అందులో ఒక్కరు తప్పు వాయించినా నేను పట్టుకోగలను.

సుశీల:- ఇక్కడ వందమందిలేరే. ఒక్కళ్లే వాయిస్తుంటేపట్టుకోలేరేమో (కవిలో మాటలు నేర్చుకుని కాంతలను తనయుల బ్రోచుటకై. సంగతులు వేయును).

గురువు:- ఇక్కడికి ట్రాన్స్ఫరయి రాక ముందు, ఆ వూళ్లో మేష్టరెట్లా చెప్పేవాడేం? (కాపీ ఫ్లాస్కు సుశీల దగ్గరగా వుంచి గ్లాసు వుంచును) తీసికెళ్లి కడిగి అల్మరలో పెట్టుకో. పగిలిపోతై మళ్లా. చాలా వెలగలదేమో. ఇవాళ కాఫీ నీళ్లగా వున్నదేం? జడ్జీగారింట్లో కాఫీ చాలా బావుంటుంది. ఆవిడ, అంటే జడ్జీగారి భార్య, నన్నెదురుగా కూచోబెట్టి అప్పటికప్పుడు కాఫీ చేసి యిస్తుంది.

సుశీల:- ( ఆపకుండా మళ్లా కీర్తన మొదటినించీ చివరివరకూ వాయిస్తూ వుంటుంది) ఇదివరకు వూళ్లో మేష్టరుగారు అరగంట గాత్రం అరగంట వీణా నేర్పేవారు. పాలు నీళ్లగా వున్నై. అందుకని కాఫీ నీళ్లగా వున్నది. కాఫీ యెక్కడ బావుంటే అక్కడే తాగండి.

గురువు:- (సుశీలను యెగాదిగా చూచును) మనం అట్లాగే నేర్పుతాం. శిలాత్ముడై పలుకనేరనురశ్రీ (వీణ అందుకుని వాయించి చూపును) గేదెను కొనిమేపుకుంటే పాలు చిక్కగా వుంటై.

సుశీల:- (యెదుటి వీణను అనుకరిస్తూ) మా అమ్మ చెయ్యలేదు.

గురువు:- మీ అమ్మ చెయ్యటమెందుకూ? నౌకర్లు చేస్తారు. త్యాగరాజాప్త నీ యెడ నెనరుంచినానూ (వీణ మీద వాయించును) ఆ వూళ్లో గురువు చెప్పినవన్నీ తప్పులే. నిన్న నువ్వు వాయిస్తుంటే, మీ పక్క యింట్లో నించి నా ఫ్రెండు విన్నాడు. ఛీ. ఛీ. అన్నీ తప్పులే. గమకం లేకుండా, వుపస్వరం లేకుండా. హార్మణీ వాయిద్యమల్లే వుందన్నాడు. నేను చెప్పిన కృతులు తర్వాత పాడుకున్నావుట. అవి బావున్నాయన్నాడు.

సుశీల:- (మాట్లాడకుండా పాత కీర్తన వాయించి చూసుకుంటూ వుంటుంది).

గురువు:- పాతవి బాగానే వాయిస్తున్నావుగాని, అర్జంటుగా నాకో వంద రూపాయలు కావాలి. నీ పాకెట్ మనీలో దివ్వు. మీ వాళ్లతో చెప్పకు.

సుశీల:- (వీణ వుంచేస్తుంది) నాకు పాకెట్ మనీ అంటూ లేదండీ. మా నాన్నగారి నడగండి. ఇస్తారు.

గురువు:- యేమైనా అనుకుంటారేమో.

సుశీల:- యేమనుకోరు. అవసరముండి అడిగారనుకుంటారు.

గురువు:- నాకు సిగ్గేస్తుందడగటానికి (లేచి నుంచుని గోడవేపు తిరిగి, చేతులలో మొహం దాచుకొనును. చలి వేస్తున్నట్టు, గూళ్లు పైకిపెట్టి చేతులు వెనక్కిపెట్టి కలుపును. మళ్లా సుశీల వేపు తిరుగును) నువ్వు అడిగి తీసుకుని వుంచు. మళ్లా తీర్చేస్తానని చెప్పు. ప్రిన్సిపాల్‌గారు ఇవ్వాలి అన్నట్టు నీతో చెప్పలేదు. నేనందుకే నాగా పెడుతున్నది. ప్రిన్సిపాల్, ప్రొఫెసరూ, కలెక్టరూ నా దగ్గర సంగీతం మొదలెట్టారు. వీణలు సృతి పెట్టాలి. నా బాణీయే వాళ్లకు నచ్చిందిట. ఇంతకు ముందు చెపుతున్న చచ్చు వెధవని తీసేశారు. గడపలో కాళ్లు పెడితే విరక్కొడతామన్నారుట. వాడు నమ్మబలికి వీణలు కొనిపించి అంతా దగా

చేశాడుట. నేను బాగా చెపుతానని మీ నాన్న చెపితే కారు పంపించి నన్ను పిలిపించుకున్నారు. ఎక్కడికెళ్లాలన్నా ఫోన్ చెయ్యమన్నారు. వెంటడితే కారు పంపిస్తారు.

సుశీల:- మంచిదే, యింక మా కారుకోసం, డ్రైవరు కోసం యెదురు చూడక్కర్లేదు.

గురువు:- మీ డ్రైవరుకి మర్యాదే తెలియదు. విద్వాంసుడనీ లేదు గురువనీ లేదు. చక్రంలో గాలిపోయింది. దిగి గాలికొట్టమన్నాడు. బంక్ దగ్గర గాలికొడతారంటే వినడు. ఇల్లింకా అరమైలుందనగానే కారాపేసి, పెట్రోలు అయిపోయింది. కారు నడవదు. దిగి ఫో' అంటాడు. వాణ్ణి డిస్మిస్ చేయమని మీ నాన్నతో చెప్పు. (ముక్కులో వేలుదూర్చి తిప్పుకొంటాడు).

సుశీల:- (లేస్తుంది) మానాన్న గారితో మీరే చెప్పండి. మీ రెట్లా చెపితే అట్లా వింటారని వూరంతా కోడై కూస్తున్నది. డ్రైవరు నోట్లో మట్టి కొట్టటం నా చేతగాదు.

గురువు:- (సుశీలను మిర్రి మిర్రి చూస్తాడు. కూచుని వీణ అందుకొంటాడు) కూచో.

సుశీల:- అంత పెద్ద విషయాలలలో జోక్యం చేసుకోవద్దని కూకలేస్తారు.

గురువు:- తానం చెపుతున్నాను.

సుశీల:- (కూచుని వీణ అందుకొంటుంది)

గురువు:- (అనంతా అనంతా, తానం తానం తానం అని పాడుతూ వాయిస్తాడు)

సుశీల:- (శక్తిమేరకు అనుకరించి చూపిస్తుంది)

గురువు:- ఇదివరకు వచ్చాయేం?

సుశీల:- (రాదని తల అడ్డంగా వూపుతుంది)

గురువు:- మరెట్లా వాయించ గలుగుతున్నావు?

సుశీల:- అనుకరించాలని ప్రయత్నిస్తున్నాను.

గురువు:- త్వరగా నేర్చుకోవాలి మరి. ఆలస్యమౌతున్నది. ఆడిషన్‌కి అప్లై సుశీల:-

చేయద్దూ? మళ్లా మీ నాన్న నింద నా మీద వేస్తాడు. జీతం ముద్రశుద్ధిగా తీసుకుంటూ దగా చేస్తున్నానంటాడు (మళ్లా రాగం అందుకొంటాడు. సుశీల అనుకరించుతుంది).

గురువు:– ఇదే రాగం?

సుశీల:– ఖరహరప్రియ

గురువు:– ఇందులో నీకేమేమి వచ్చు?

సుశీల:– రామ నీ సమానమెవరు. చక్కని రాజా మార్గము, పక్కల నిలబడి కొలిచే ముచ్చట. రఘువీర.

గురువు:– దీనికి మిత్రరాగాలేవి?

సుశీల:– షణ్ముఖప్రియ, రుద్రప్రియ, కోకిలప్రియ.

గురువు:– ఇది జనకరాగమా? జన్య రాగమా?

సుశీల:– జనకరాగం.

గురువు:– ఎన్నవమేళకర్త?

సుశీల:– ఇరవై రెండవ మేళకర్త.

గురువు:– ఎట్లా తెలుసుకున్నావు?

సుశీల:– కాదినవ, టాదిపంచ, యాద్యష్ట అనే సూత్రం మీద.

గురువు:–తానంలో రకాలు తెలుసా?

సుశీల:– గజతానం, అశ్వతానం, మండూకతానం.

గురువు:– ఇవన్నీ పాతమేష్టరు చెప్పాడా?

సుశీల:– పుస్తకం చదివాను.

గురువు:– ఎక్కడిది పుస్తకం? యెవరిచ్చారు?

సుశీల:– నాన్నగారు కొనిచ్చారు.

గురువు:– యేది కొనాలో ఆయనకెట్లా తెలుసు?

సుశీల:– మా నాన్న గారి మిత్రులొకరు సంగీత విద్వాంసులు.

గురువు:– ఆయన పేరేమిటి? అడ్రసేమిటి?

నాన్నగారి పేరా (తండ్రిపేరు చెప్పి అడ్రసు చెప్పును. ( ఇద్దరూ లేస్తారు. గురువు ఫ్రెండు గౌరీపతి వచ్చును. ఇద్దరూ మాట్లాడుకుంటూ వాకిట్లోకి వెళ్లుదురు. గౌరీపతి నవ్వుతూ ''మరీ త్వరగా వచ్చేట్టు నేర్పుతున్నావేమిరా'' ఇద్దరూ నవ్వుకుంటూ గడియారాలు చూచుకుంటూ వెళ్లిపోతారు. సుశీల వీణలు తీసి పెట్టెలలో సద్ది వెళ్లిపోతుంది).

4వ దృశ్యం

(సుశీల లేచి తలవంచుకుని కళ్లు తుడుచుకుంటూ వంట యింటివేపు వెళ్లును. శర్మ, నాగభూషణం సుశీలవేపే చూస్తారు).

నాగ:- అట్లా మేష్టర్లతో వేగుతూ ఓరిమి చూపుతూ రాగం, తానం, పూర్తి చేసింది. పల్లవీ నేరుస్తున్నది. యెప్పుడు సాధన చేసుకునేదో దైవానికెరుక. చెప్పానుగా సూక్ష్మగ్రాహి అయి, ఆసక్తి వుంటే త్వరగా అలవడుతుందని. దానికి త్వరగా అలవడుతున్నదని తెలియగానే గురువు బండి వెనక్కి లాగుతాడు. మా అక్కా బావకి దాని తెలివితేటలు తెలియవు. ఉద్యోగాలు చేయాలా వూళ్లేలాలా అని దాని గొంతుకోశారు.

శర్మ:- (సుశీల వెళ్లిన వేసే చూస్తూ) దాని గొంతు బాగానే వున్నదే శంఖమల్లే.

నాగ:- (బావ వంక చూసి నవ్వుతాడు) అంటే పెళ్లి చేశారని నా తాత్పర్యం. ఆ పెళ్లికి హాజరైనప్పుడే నేను దాని గోడు విన్నది.

శర్మ:-నిక్షేపమంటి సంబంధం చూసి చేస్తే, నువ్వు వాడినపదం యేం బావుందీ?

నాగ:- ఔనౌను. డబ్బుంటే సరి. సర్వే గుణః కాంచనమాశ్రయంతే. వాడికిహ సద్గుణాలున్నట్టే. వాడి పై పై మెరుగులు చూసీ, వాడి ఆస్తీ చూసీ వీళ్లకి మతిపోయింది. పైగా ఆ వుద్యోగమొకపెద్ద ఆకర్షణ (నవ్వుతాడు).

శర్మ:- విషయం సవిస్తరంగా చెప్పు. నేను గూడా నవ్వుతాను.

నాగ:- ( ఇంకా నవ్వుతాడు) పెళ్లికొడుక్కి రెండే గుణాలు. తనకు తెలియదు. ఒకళ్లు చేపితే వినడు. వాడి తత్త్వం తెలియక, దాని ఆరాటం చూడలేక, దాని సంగీతం ఒడ్డు పట్టిద్దామనుకున్నా. ప్రపంచంలో యిలాంటి వాడు గూడా

వుంటాడా అని విస్మయం కలిగింది.

శర్మ:- (సద్దుకుని స్థిరంగా కూచుని బావవంకే చూస్తూ) యేం చేశాడేం?

నాగ:- ఇంకా యేం చేయాలీ? దాని మీద చెయ్యి చేసుకున్నాడు. సంగీతమనే మిషపెట్టి రోజూ దానికోసం వెళ్తున్నానుట. వీణ తీగలు తెంపేశాడు. యేదో సామెత వున్నదే. మోటు సామెత. మోటు మనిషికి మొగలి పూవిస్తే అని . అట్లాటివాడు.

శర్మ:- ( ఆశ్చర్యంతో ముక్కుమీద వేలువేసుకొనును) నువ్వు సద్దిచెప్పలా?

నాగ:- చెప్పబోయేప్పటికి మరింత విషమించింది జెలసీ అనే రోగం. నా దగ్గర బైటపడలేదు. చాలా మర్యాదగా పెద్దమనిషిలాగా ఒడుపుగా మాట్లాడాడు. మళ్లా వెళ్తే సుశీలే చెప్పింది. అది రేడియో ప్రోగ్రామివ్వరాదుట. కచేరీలు చేయరాదుట. కట్టుకుపోయేంత ఆస్తి వున్నది. అనుభవించరాదా అన్నాడుట. మొగుడినీ పిల్లలనీ నిర్లక్ష్యం చేసి, పనివాళ్లకొదిలేసి, యిల్లు పట్టకుండా వూళ్ల వెంబడి తిరగాలని చూస్తున్నదిట. ఇంకా యెంత సొంపైన పదాలు వాడాడో ఆస్తిపరుడూ, వుద్యోగీ, చెప్పలేక దాని గొంతు బొంగురుపోయి, కళ్లు యెఱ్ఱబడినై.

శర్మ:- స్ప్లిట్ పర్సనాలిటీ యేమోరా బావా. పోనీ యింట్లోనే వాయించుకుంటాననే షరతు మీద చెప్పించుకోక పోయిందీ? (జాలిగా వంటింటి వేపు చూస్తాడు).

నాగ:- అదీ అయింది. వాడు ఫారిన్ వెళ్లినప్పుడు చెప్పించుకున్నది. తొమ్మిది నెలల్లో చక్కగా రాగం తానం పల్లవీ వాయించగలిగింది. అట్లానేర్వగలిగిన విద్యార్థికి చెప్పే అవకాశం రావటం గూడా ఒక సుకృతమే. యేం లాభం? వాడు రానూ వచ్చాడు. బంధుకోటి వుంటుంది గదూ. వాడిలో వున్న బలహీనత. తెలుసుకుని దాని మీద దెబ్బ తీశారు. జెలసీ పెరిగిపోయింది. సుశీల నా పేరెత్తితేనే వాడి ఒంటిమీద తేళ్లూ జెర్రులూ పాకసాగినై. సుశీల నేచెప్పే విధానం చెపుతూ తన్మయత్త్వం చెందుతుంది. అది నన్ను వ్యక్తిగతంగా ఆరాధిస్తున్నదని అర్థమైంది వాడికి. రాగా రాగా ఒథెల్లోలాగా తయారైనాడు. మా అక్కే నన్ను పిలిచి వార్నింగిచ్చింది. రేపు సుశీల కాపరం గడ్డలైతే ఆ గడ్డలకు నేనే కారకుడ నని

చెప్పచ్చుట. దాని మొగుడు దాన్ని వదిలేస్తే నేను దాన్ని తెచ్చుకోవాల్సి వుంటుందిట. సుశీలకు చెప్పిందట ''మొగుడెదుట పరపురుషుడైన మామయ్యను తలుచుకోరాదు''

శర్మ:- పోనీ తెచ్చేసుకోక పోయినావురా బావా? అట్లాగైనా ఓ యింటివాడివయే వాడివి. నా కళ్లు చల్లగా, మీ అమ్మ కడుపు చల్లగా పిల్లా మేకా కలిగివుండేవాడివి (నవ్వుతాడు)

నాగ:- నీదంతా హాస్యం రా బావా. జీవితం భ్రష్టు అయాక సుశీలకి సంగీతం ఆనందమిస్తుందా? నా కంటికి సుశీల ఆర్టిస్టులాగా కనపడుతుంది. గాని భార్యగా కనబడదు. దానికన్నీ కొనిబెడుతూ ముద్దు చేసుకోవాలని వుండదు. మరో ముఖ్య విషయం విను. సుశీల భర్త, సుశీల వీణ మూల పెట్టేశాక, పాట మానేశాక, దాన్ని నొప్పించకుండా, దాని సంతోషం కోసం పాటుపడుతున్నాడుట. చూశావుగా 'అమ్మమ్మను చూసిరా' అని కారులో పంపాడు. మేమిప్పుడు నిరవల్ చేయం. కచేరీలకి పోము 'బావున్నావా సుశీలా?' అంటే బావున్నావా? మామయ్యా' అంటుంది (పెద్దగా నవ్వుతాడు)

(వాకిట్లో కేక. కరేపాక్. కరేపాక్. అమ్మగోరూ యియాల కరేపాకొద్దా? కరివేపాకు అమ్మే పిల్ల సత్తి చంకలో బుట్టతో లోపలికొచ్చి వీళ్లిద్దర్నీ చూసి తలొంచుకుని తిరిగిపోయి, పక్కదోవగుండా దొడ్డివేపు వెళ్తుంది).

(మరొక విద్యార్థి శేఖరం వస్తాడు. నాగభూషణం కూచోమన్నట్టు తలూపుతాడు. శేఖరం యిద్దరికీ నమస్కారం చేసి తివాసీ మీద కూచుంటాడు).

శర్మ:- పాఠం చెప్పుకోరా బావా. నేను లోపలకి పోతా (లేవబోవును).

నాగ:- ఫరవాలేదు కూచో. (శేఖరంతో) యేమోయ్! శేఖరం! నాగాలెక్కువ చేస్తున్నావు? ఇష్టం లేకపోతే మానేయరాదూ? రెడ్డొచ్చె మొదలాడమని, నువ్వు మరిచిపోయిన కీర్తనలు తప్పులు దిద్దుతూ కూచుంటే పుణ్యం కాలం కాస్తా దాటిపోయి వయసు మీరి, ఆడిషన్‌కి పనికి రావంటారు. దేవరవారు పదిరోజులెక్కడికి విజయం చేశారు?

శేఖరం:- (సిగ్గుపడి తలవంచుకుంటాడు. చేతులు చూసుకుంటూ దీర్ఘం తీస్తాడు) పెళ్లిచూపులు కానియ్యమంటే వూరికి వెళ్లివచ్చా.

నాగ:- (నవ్వుతూ) నీ మొహం చూస్తే పెళ్లి నిశ్చయించారని తెలుస్తున్నది. వివాహో విద్య నాశాయ సర్వం నాశాయ శోభనం. శ్రీవారివాళెట్లా వచ్చారూ మరి?

శేఖరం:- (నవ్వుతూ తలవంచుకుని ఓ సారి కళ్లు పైకెత్తి చూస్తాడు. మళ్లా చేతులు చూసుకుంటాడు).

నాగ:- సరే కానియ్యి నీకు గుర్తు రాలేదు. వసంత భైరవి కీర్తన చరణంలో కొచ్చాం. తాళం వేసి పాడు.

నాగ:- (నవ్వుతూ శిష్యుని చూసి గ్రహిస్తాడు) మహానుభావుడు మరిచి పోయినాడు. నీ దయరాదా అనే కీర్తన రూపక తాళం వేసి పాడాలి (తాను మొదలెట్టి పాడతాడు. శేఖరం అందుకుంటాడు. కీర్తన పూర్తి అవుతుంది. నాగభూషణం వేరే రాగం అందుకుని పాడతాడు.

నాగ:- యేరాగం పాడాను? స్వరం చెప్పు. ఆరోహణ అవరోహణ చెప్పు.

శేఖరం:- (చెప్పలేక చూస్తూ వుండిపోతాడు).

నాగ:- నీకన్న ఆడపిల్లలు నయం. ఆత్మాభిమానం లేదూ? కుండల్లో గుఱ్ఱాన్ని తోలటానికి సిద్ధం. మీనాన్న ఒకడు నా ప్రాణానికి. పండిత పుత్రుడి వంటి నిన్ను పండితుడిని చేయాలంటాడు.

(పాతకీర్తనలు వరసగా పాడిస్తూ, అందిస్తూ రాగాల పేర్లు అడుగును. శేఖరం తప్పులు చెప్పును. నాగభూషణం విసుగుదాచి విషాదంగా నవ్వును. స్వరములు, నిరవల్ నేర్పును. వెళ్లచ్చునని చెయ్యి వూపును. శేఖరం నమస్కరించి వెళ్లిపోవును).

నాగ:- (శర్మవేపు చూస్తాడు) అదిరా బావా వరస. వాడికాసక్తి లేదు. తండ్రికి తగని ఆసక్తి. చదువులో వీడు చకచకా పైకి రాలేదుట. సంగీతంలోనన్నా తేలుతాడేమోనని ఆశ. ఆయన ఆశ వీడడియాస చేసేట్టున్నాడు. వీడికోసం సులభ పద్ధతులు కనిబెట్టాను. నూరి పోశాను. ఓర్మి వహించాను. ఇంతవరకు పర్ఫెక్ట్ అయిందనుకుంటే వెనకవి మరిచి పోతాడు. ఆంధ్రా మెట్రిక్‌తో కొన్నాళ్లు,

బెనారెస్ మెట్రిక్‌తో కొన్నాళ్లు కుస్తీ పట్టాడు. ఇపుడు సంగీతంతో మల్ల యుద్ధం జరుపుతున్నాడు. వీడికన్న (అని తర్జనితో చూపుతాడు) ఆ కిటికీలోంచి కళ్లు పెట్టుకు చూసే కరివేపాకు పిల్ల నయం. అది, వీడికి చెప్పేప్పుడు విని ఆ కీర్తనలన్నీ పాడుకుంటుంది. సంగతులు వెయ్యలేదు, యాస వున్నదంతే. దాని వ్యాపారం గూడా మానుకుని అట్లా ఆ కిటికీ దగ్గర నిలబడి వింటుంది. వీడికి చెప్పే కన్న, ఆసక్తి వున్నదానికి చెపితే నయమేమోననిపిస్తుంది. యెంత ఆసక్తి లేనిదే, కాళ్లు పీక్కుపోతున్నా లెక్కచెయ్యక నిలబడిపోతుందీ?

(కరివేపాకు పిల్ల ధైర్యం చేసి అటు తిరిగి వచ్చి లోపలి కడుగుంచి నిలబడిపోతుంది)

శర్మ:- సంగీతం రావటానికి కొంత పురాకృత సుకృతముండాలేమో. ఆ పిల్ల వూరికే లల్లాయి పదాలల్లే పాడుతుందేమోగాని, కీర్తనలలో పదాలు పలకగలుగుతుందీ?

నాగ:- ఆ. పలకగలు. చిలకల్లే పలుకుతుంది. తీయని కంఠం. పనిమనిషి యెగేసినప్పుడల్లా ఇదే పనిచేసి పెడ్తూ వుంటుంది. కూనిరాగాలు తీస్తూనే వుంటుంది. ఇల్లు తుడుస్తూ పాడుకుంటుంది. ఉండు వినిపిస్తా. దాని కున్న అభిరుచికి, దానికి చెప్పించే దాతలేడు గానీ (లేచిపోవును. గదిలోనించి టేప్ రికార్డర్ తెచ్చి ఆన్ చేసి వినిపించును. మధ్య మధ్య, గిన్నెలూ, బట్టలుతికిన చప్పుడూ, కేకలూ, చివరికి పరుగెత్తి పోతున్న ధ్వని) (కరివేపాకు పిల్ల మరికొంచెం ముందుకు వచ్చి నించుంటుంది).

(నాగభూషణం మరొకటి పెడతాడు. యాసతో కూడిన కీర్తన వినిపిస్తుంది. తప్పులు దిద్దుకోటం. నవ్వుకోటం. పాట ముగుస్తుంది).

పిల్ల:- నేను నేరుసుకుంటాను. నేరుపుతారా? (శర్మా నాగభూషణం వింతగా ఆ పిల్లను చూస్తారు. ఒకరి ముఖం ఒకరు చూసుకుంటారు)

శర్మ:- జీతమిచ్చుకోవాలి. ఊరికే ఒక్క ముక్క గూడా నేర్పడు మా బావ. (నాగభూషణాన్ని చూస్తాడు)

పిల్ల:- యెంతిచ్చు కోవాలా? పనంత చేసి పెడతాను. బజారు పనిసేస్తాను. లెక్క సూపుతా. దగా సేయను. ఒక్కరోజు గూడా మానను. యెంతిస్తారో అది జీతంగా కట్టుకోండి (తలవంచుకుంటుంది. బుట్టలో ఆకు కట్టలు సద్దుతుంది).

శర్మ:- (నవ్వుతూ) ఎంతిస్తారూ? మహా యిస్తే పదిహేనిస్తుందేమో మా అత్తయ్య. బావా! ఇంటికొచ్చి చెప్పించుకుంటే యెంత తీసుకుంటావూ? దాని తాహతు కది యిస్తాననే జీతం పెద్దదే. పూర్వం బుద్ధ దేవునికి, ధనాఢ్యులందరూ, ధనధాన్యాదులు దండిగా యిస్తుంటే, ఒక బీదపిల్ల తాను తినే పండు అంతా యిచ్చేసిందట. ఆయన చాలా సంతోషించి, ''తల్లీ! నీకున్నదంతా యిచ్చేశావు. వీరంతా తమకు చాలా వుంచుకుని యేదో యింత ముష్టిపెడుతున్నారు. నీకున్న ఔదార్యం అందరికీ వుంటే, దేశంలో తాండవమాడుతున్న దారిద్ర్యం, అజ్ఞానం యేనాడో రూపుమాసిపోయేవి'' అన్నాడట. అట్లాగా యీ పిల్ల శ్రమదానం చేయటమే గాక రొఖ్ఖం గూడా యిస్తుందిట.

నాగ:- (పిల్ల వంక కుతూహలంతో చూచును)

పిల్ల:- (అమాయకంగా చూసి తలవంచుకుంటుంది) పాడిసేయగలను. కూరానారా పండించగలను. పాలూ పెరుగూ వతనగా పోసి రాగలను. పూలమ్మగలను.

నాగ:- నువు అవన్నీ చేయగలవని నేనవన్నీ నీ కోసం ప్రారంభించి వ్యాపారిని కావాలా? నువ్వు తెచ్చే లాభాల మీద బతకాలా?

పిల్ల:- అక్కర్నేదు. నేసేయగలిగినవి సెప్పా. నీ యిట్టం. అంత పనిచేసి సూపినా, రేపిటాల మాపిటాల యింత కూడెయ్యరా? కాపీ యివ్వరా? కాపీలో బెల్లమే యేసి యిచ్చినా నేనేమీ అనను. మా యత్త, రేసన్ మీదనే తెచ్చే పనస్దార యెక్కువ కరీదు కమ్ముతాది. నాకూ మామకూ బెల్లమే యేసి యిస్తాది. మొత్తుకున్నా యినదు. ఆడబ్బేటి సేస్తదో సెప్పనా (నవ్వుతుంది) నువ్వీ పనిసేయమను. నేను నా సేతగాదనను.

నాగ:- (నవ్వుతూ వినోదంగా అంటారు) మరి నీ గుడ్డల సంగతి? నువ్వింటికి

తిరిగి సంగీతమెప్పుడు నేరుస్తావూ! సాధన యెప్పుడు చేస్తావూ? అమ్మకంతో టైమ్ సరిపోతుందా?

శర్మ:- పైగా మా బావ పోస్టుగ్రాడ్యుయేట్ కోర్సు తప్పితే జూనియర్లకు చెప్పడు. నామర్దా (నవ్వును)

పిల్ల:- (యిద్దర్నీ మార్చి మార్చి చూస్తుంది) (బుట్టలోని ముద్దగన్నేరు తీసి జడలో తురుముకుంటూ, ఒక కాలు మీద నిలబడి, రెండో కాలాడిస్తూ కొద్దిగా వూగుతుంది) యేటన్నారో నాకు తెల్దు. గుడ్డలా? పనిచేసి పెడితే ఒక పాత సీరివ్వరా? కారంకొట్టినందుకు, పప్పులూ, బియ్యం బాగుసేసినందుకే యిస్తారే సిరగని సీర. ఇంటింటికెల్లను. మీ పంచనే పడుంటా. మా యత్తకిగూడా తెలిసొస్తది.

నాగ:- సంగీతం నేర్చుకునేమి చేయదలుచుకున్నావూ?

పిల్ల:- (సంతోషంతో ముఖం విప్పారుతుంది) సెప్తారా? చినీమాలో చేరుతా.

నాగ:- (నవ్వుతాడు) సినిమాలో చేరటానికి సంగీతమక్కర్లా. అట్లా ఒంటికాలిమీద నిలబడి వూగుతూ కళ్ళు తిప్పితే చాలు. వేషమిస్తారు.

పిల్ల:- యాసమేయను. సీ. పతీ యెదవనూ కౌగలించుకోవాల. మడుసుల కోసం యెనక పాట పాడుతారూ సూడూ అది సేత్తా ( ఇద్దర్నీ చూస్తుంది)

శర్మ:- కూచో. మంచి అభిమానం, దూరదృష్టీగల పిల్లరా బావా. నీ పేరేమిటి?

పిల్ల:- (కూచుంటుంది) (బుట్ట పక్కనే ఆనించుకుంటుంది) సత్తి.

నాగ:- సత్యవతి కాబోలు. యే కులం? యెన్నేళ్లుంటై?

సత్తి:- ఒయసా? నాకు తెల్దు. మాయత్త నడిగి సెప్తా. కులం దేనికీ? కులం సెపితే యిద్దె సెప్పరు. సూద్దురుడని యేకలవ్యునికి యిద్దె నేర్పలా మీ ఓల్లే.

శర్మ:- (నవ్వుతాడు) అబ్బో నీకు పురాణ గాథలు తెలుసే? ఇంకేం? నువ్వు సత్యవతికి సంగీతం నేర్పాల్సిందేరా బావా. ఇందాకేదో గప్పాలు కొడితివే. మూడేళ్లలో సంగీతం స్వాధీనమౌతుందనీ.

నాగ:- అందులో యేమీ సందేహం లేదు. ఇప్పటికీ అదే అంటా. పందెం వేసి

మొదలు పెట్టచ్చు. కాని అంతానే చెప్పినట్టు నడుచుకోవాలి.

సత్తి:- ( ఆత్రంగా) నువు సెప్పినట్టే యినుకుంటా. నీ పాదాలకాడ పడివుంటా (లేచి నిలబడి బుట్ట అందుకుంటుంది. చంకలో పెట్టుకుంటుంది) మా యత్తతో సెప్పిరానా? యెల్లిరానా?

నాగ:- మీ అత్తగారు ఒప్పుకోదేమో!

సత్తి:- (వెళ్లిపోతూ) అది నాకు కూడూ గుడ్డా యెడుతున్నాదెట్టా? యెవడో యెదవనాయాల్ని, మారు మనువు సేస్కో లేదని కొడ్తది. రాత్తిరేల బయటిగ్గెంటి, లోనగెడెట్టుకుని కులుకుతుంటది. (తలుపు మెల్లిగా మూసి వెళ్లిపోవును)

శర్మ:- ( ఆసక్తిగా అడుగుతాడు) నువన్నట్టే పందెం వేసుకుందామా? ఉషారొస్తుంది. వో వేళ ఆ సత్యవతి నిజంగానే వచ్చేస్తుందేమో. దాని యాస యెట్లా వదిలిస్తావో చూడాలి. దానికి జ్ఞానమూ, వాచికమూ వచ్చేప్పటికి నీ తాళ్లు తెగుతై. నీ తాతలు దిగి రావాలి.

నాగ:- (లెక్కజేయనట్టు చెయ్యి తిప్పుతాడు.) దానికిబుద్ధీ జ్ఞానమూ వుండాలి గాని అదేమంత కష్టమైన పని? దీని తాత లంటివాళ్లకి పర్ఫెక్ట్ చేసి కచేరీలు చేయించాను. సంగీతం నేర్వటంలో సులువు చెపుతుంటే గ్రహించే నేర్పు వుండాలి, పట్టుదల వుండాలి. బాంక్ యేజంట్ విశ్వపతి వుద్యోగంలో చేరాక సంగీతం మొదలుపెట్టాడు. లాయరు రాజారావు లా మొదలుపెడుతూ సంగీతమూ ప్రారంభించాడు. వాళ్లిద్దరూ యిప్పుడు రేడియోలోనూ, టివిలోనూ ప్రోగ్రాములిస్తున్నారు.

శర్మ:- విన్నాను. చూశాను. కాని వాళ్లిద్దరూ మగబిడ్డలు. ఇప్పుడాడపిల్లతో అఘోరించాలి. యెటుపోయి యెటువస్తుందో. పందెమేమిటి?

నాగ.- జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఆడదే. డాక్టరేట్ వచ్చాకనే సంగీతమంటూ వచ్చింది.

శర్మ:- ఆమెకి వయసు మళ్లింది. పందెం చెప్పు.

నాగ:- నీ యిష్టం.

శర్మ:– నే గెలుస్తే నువ్వు పెళ్లి చేసుకోవాలి.

నాగ:– నిన్నేనా?

శర్మ:– (పకపకా నవ్వుతాడు) భలేవాడివిరా బావా, ఇంకా నయం మా అత్తయ్య పేరెత్తలేదు.

నాగ:– తప్పేమిటీ? పెళ్లామొచ్చి చేసేదేమిటీ? మీ అత్తయ్యా నువ్వా నా సుఖశాంతులు కోరుతున్నవాళ్లు గాదా? పరాయి అమ్మాయి వచ్చి యేం చేస్తుందిటా? మనశ్శాంతి లేకుండా చేయటమేగా?

శర్మ:– సరే. యేకీభవించాను. నువ్వు గెలిస్తే పందెం చెప్పుమరీ.

నాగ:– (నిర్లక్ష్యంగా) నేనెట్లాగో గెలుస్తా. నువ్వు పెళ్లిళ్ల పేరయ్య వుద్యోగం మానేయాలి. కమీషన్ వ్యాపారం ఆపేయాలి. నిన్ను నా బావ అని చెప్పుకోటానికి నామోషీగా వున్నది.

శర్మ:– (తలవూపుతూ నవ్వుతాడు) సరే. ఒప్పుకున్నా. అదెల్ల మనమంచికే. నాకూ ఒంట్లో ఓపిక సన్నగిల్లి పోతున్నది. ఇంకా యేమైనా షరతు పెడుతావా?

నాగ:– ఆ సత్యవతి ఖర్చులు నువ్వు భరించాలి.

శర్మ:– అంగీకారమే. దానికేం. ఓ అనాథ బాలికకు బతుకుతెరువుకు తోడ్పడ్డానంటే గొప్పే.

2వ అంకం

(తెల్లవారు జామున 4 గంటలు. సత్యవతీ, శేఖరం సరళీలు, జంటలు, అలంకారాలు పాడుతూ, కాలం మారుస్తూ కానిస్తూ వుంటారు. తర్వాత అకారసాధన చేస్తారు)

(వంటింట్లో నించి, నాగభూషణం తల్లి కామేశ్వరమ్మ కేకవస్తుంది)

కామేశ్వరమ్మ:– సత్యవతీ! పాలొచ్చినట్టున్నాయి. అందుకున్నావా? నాకు చెయ్యి ఖాళీగా లేదు. కాశింబి వారం రోజులదాకా రాదుట. నువ్వోసారి యిటురా.

(సత్యవతి భూషణం వంకచూస్తుంది. విరబోసి వున్న జుట్టు ముడేసుకుంటుంది)

నాగభూషణం చేతి గడియారం వంక చూసుకుని, పొమ్మని చెయ్యి

వూపుతాడు. సత్యవతి వెళ్లిపోతుంది. శేఖరం గురువు వంక, ''పోనా?'' అన్నట్టు చూస్తాడు).

నాగ:- యెప్పుడెళ్లి పోదామా అని ఆత్రంగా వుంటుంది నీకు శేఖరం. చిన్నపిల్లాడివా? చిత్తం శివుని మీదా బుద్ధి చెప్పుల మీదా. అని యెప్పుడు కాఫీ ఫలహారం కానిద్దామా అని చూస్తావు. నీ అకారసాధన సరిగా లేదు. అలుక్కు పోతున్నది. ఒదుగేదీ? అపస్వరం గూడా వినబడుతున్నది. పట్టుదల నీకే కోశానా లేదు. అట్లా వెళ్లి హాల్లో రేడియో దగ్గర కూచుని ఆన్ చేయి. నేనిప్పుడే వస్తున్నా.

(శేఖరం లేచి హాలులోకి వెళ్తాడు. నాగభూషణం వంటింటివేపు వెళ్తాడు)

నాగ:- అమ్మా! వేరే పనిమనిషిని చూడరాదూ? తరచూ రానిదాన్నే పట్టుకు వేలాడతావెందుకూ?

కామేశ్వరమ్మ:- కొత్తదాన్ని పెట్టుకున్నప్పటి నించీ దానికి పనీ, మడీ, మర్యాదా నేర్పుకోటమే సరిపాయె. కాశింబి బాగా అలవాటు. శాన్నాళ్లనించీ చేస్తున్నది. నమ్మకమైన మనిషని చూస్తున్నా. మాన్పించటమెంత సేపు? యేదీ పోదు, యేదీ పగలగొట్టదని చూస్తున్నా. సత్యవతీ బల్ల తుడిచావా? అటుపోయి గిన్నెలు ఆరితే పట్రా. ఇవన్నీ బల్లమీదుంచు.

(సత్యవతి బల్లతుడిచి, గుడ్డ పరిచి, కాఫీ ఫలహారాలు బల్లమీద అమరుస్తుంది. దొడ్లోకి పోతుంది)

(నాగభూషణం, శర్మా ఫలహారం కానిస్తారు)

కామేశ్వరమ్మ:- శర్మా! జపతపాదులైనాయా? భోజనానికుంటావా?

శర్మ:- నేనింకా స్నానమే కానీయలేదత్తయ్యా. నువ్వు వేడివేడిగా తినాలంటే తినేశా.

కామేశ్వరమ్మ:- నీళ్లు పాళాలు చేసి వుంచుతుంది. నువ్వు పోయి స్నానం కానియ్యి. ఈ పట్నంలో నువ్వంటే నువ్వని యెదిరించే వాళ్లే. కాస్తన్నా నమ్రత కలవాళ్లేరీ? అయినా సత్యవతి అన్నీ చేసిపెడతానని ఒప్పుకొనెగా?

నాగ:- యేమో! నీ సొద నాకనవసరం. నేను పాఠం చెపుతున్నా, అది సాధన

చేస్తున్నా, నువ్వు దాన్ని పిలవద్దు (లేచి వెళతాడు).

(శర్మ స్నానం కానిచ్చి వస్తాడు. సత్యవతి గిన్నెలు వంటింట్లో బోర్లించి వస్తుంది. బల్లమీదివి తీసేసి శుభ్రం చేస్తుంది. శర్మకి కావాల్సిన సరంజామా వుంచుతుంది).

శర్మ:- (తన పనికానిచ్చి మంచి బట్టలేసుకుని, మొహం అద్దుకుంటూ అడుగుతాడు). నా పెంపుడు చిలక సంగీతం యెంతవరకు వచ్చిందిరా బావా? సాధన బాగా చేస్తుందా?

నాగ:- సంగీతానికేం? నిక్షేపమల్లే నేరుస్తున్నది. అంతా శాస్త్రీయంగా సాధన చేయిస్తా. నేనేం నిన్ను దగా చేయటం లేదు. మీ అత్తయ్యే దాన్ని నెత్తినెక్కించుకుని చెడగొడుతున్నది.

కామేశ్వరమ్మ:- (చేతులు తిప్పుతూ మీదికొచ్చి అంటుంది). ఇది మరీ బావుంది. నువ్వేమో దానికి మాటా మర్యాదా, శుచీ శుభ్రతా నేర్పమని అప్పజెప్పి, యిప్పుడు సొడ్డు నా మీద వేస్తున్నావా? యేమిటి నీ వుద్దేశం? అది బుద్ధిగా చెప్పినట్టు వింటుంటే ఓ గుడ్డ ముక్క యిస్తే తప్పా?

నాగ:- గుడ్డముక్కతో సరిపెట్టేట్టు లేవు. నీ తరహా బాగా లేదు. నగా నాణెం చూపిస్తున్నావు దానికి. ఆడపిల్లలకేమున్నదీ? చీరలూ నగలూ చూపిస్తే, వాటి మీదే భ్రమ పెట్టుకుంటారు. అదొక వ్యామోహంగా తయారై, అవి అలంకరించుకుని, అద్దంలో చూసుకుంటూ పొద్దు పుచ్చుతారు. తక్కినవాటి మీద శ్రద్ధ తగ్గిపోతుంది.

కామేశ్వరమ్మ:- ఎప్పటివో నా చిన్ననాటివి, జూకాలు, యిక్ష్వాకులనాటి కంటే, ఒకటీ అరా చిన్నవి వుంటే వాటికి మెరుగు పెట్టించి, దాని ఒంటి మీదుంచాను. ఒంటెడు నగలు పెట్టానా? యేడు వారాల నగలూ పెట్టానా? కూతురెటూ వాటిని పెట్టుకోనే లేదు. మనమరాలు సరేసరి, నా నాగరం చూసి, సవర కుప్పె చూసి విరగబడి నవ్వింది. ఆ సత్తి నీ పాఠమేదో నీకు ఒప్పజెపుతుండెగా? బద్ధకించిందా? రాలేదన్నదా? ఆ రెండూ దానికి శాశ్వతంగా యిచ్చానా చచ్చానా (దీర్ఘాలు తీస్తుంది)

శర్మ:- (అత్తయ్యను చూస్తూ నవ్వుతాడు) అత్తయ్య మధ్యలో ఒక వాక్యం మింగేసింది.

నాగ:- (తల్లితో అంటాడు) నువ్వు దానికి వత్తాసున్నావని తెలిస్తే, అది నాకెదురు తిరగటానికి క్షణం పట్టదు. ఇది డబ్బుతో వ్యవహారం. బావ పందెం కాసి, దాని మీద పెట్టుబడి పెడుతున్నాడు.

కామేశ్వరమ్మ:- అటైతే నా కప్పగించిన పని నువ్వే చూసుకో. నా మడీ దడీ నే చూసుకుంటా. దీనికి జడేసి స్నానం చెయ్యలేక చస్తున్నా (వెళ్లిపోవును).

శర్మ:- బావా! మేడమీదికి పోదాం రా. నీ కోసం పెద్ద మనుషులెవరో వచ్చారు. కాస్త కుడీ యడమా వుండాలి. అత్తయ్యను ఆరడి పెట్టకు. పాపం పెద్దది. నువ్వు పైకి పద. నేను అత్తయ్యను రాజీ చేసుకుని వస్తా.

(నాగభూషణం లేచి మేడమీదికి పోవును)

శర్మ:- అత్తయ్యా! యేదో యీ మూర్ఖులనిద్దరినీ యీ ఒక్కసారికీ క్షమించేయి. సత్యవతిని నువు మునుపటి లాగే ముద్దు చేసుకో. ప్రాణికి ప్రేమ గూడా చాలా అవసరం. వాడి శిక్షా విధానం నీకూ తెలుసు నాకూ తెలుసు (శర్మా మేడమీదికి వెళ్తాడు).

(హాలులో శేఖరం రేడియో వింటాడు. ఆపేస్తాడు. పక్కగదిలోకి వెళ్తాడు. టెలివిజన్ చూస్తాడు. వ్యాయామ ప్రదర్శన చూస్తాడు. సత్యవతి పుస్తకాలు సద్ది, వస్తువులు తుడిచి, పెన్నులో సిరా పోసి బిగించి స్టాండులో వుంచుతుంది. పెన్సిల్, మెషీన్ తిప్పి చెక్కి స్టాండులో వుంచుతుంది. కిటికీ అద్దాలు తుడుస్తుంది. కర్టెన్లు దిద్దుతుంది. దినపత్రికలు సద్ది వుంచుతుంది).

శేఖరం:- సత్యవతీ పిల్లారి గీతాలై పోయినై. ఇవాళ పురంధరదాసు జయంతి. గీతాలు పాడారు. నువు వినలేదు. నీకెప్పుడూ పని కల్పిస్తారు. స్వరజతి మొదలెడతారట గురువుగారు. త్వరలోనే నువూ సీనియరు విద్యార్థి వౌతావు. ఈ కుట్టు పూల పరికిణీ, జాకట్టూ, ఓణీ నీ కెంతో అందమిచ్చాయి. ఇవాళ నిన్నెవరన్నా చూస్తే పెద్దింటి పిల్ల అనుకునే అవకాశమున్నది. ఇవాళ కొత్త ఫిల్ము

రిలీజైంది. వెళ్దాం వస్తావా?

సత్యవతి:- (నాగభూషణం, శర్మా వస్తున్నారని సైగజేస్తుంది. వాళ్లిద్దరూ వచ్చి వార్తలు విని మళ్లీ వెళ్లిపోతారు) బాబు చూస్తే కబుర్లాడుతున్నారా అనరూ? నీకు బొత్తిగా భయంలేదు. సినిమాకూ, బజారుకీ, పెద్దబాబు గారితో తప్పితే యెవరితోనూ వెళ్లద్దన్నారు. (అంతలోనే నవ్వి సంతోషంతో కళ్లు తిప్పుతూ అంటుంది). ఇవి కొత్తవిగావు. అమ్మగారి పాత చీరలు చింపి కుట్టారు. నిజంగా బావున్నానా? పెద్దింటి బిడ్డలాగే వున్నానా? (మొహం వెలిగిపోతుంది).

శేఖరం:- బావుండటమేమిటీ, చచ్చు పదం. నా కళ్లకి రంభల్లే వున్నావు. యెంతగా మారిపోయావో నీకు తెలియదు. కట్టూ బొట్టూ, మాటా నడకా ఒకటేమిటి? నువ్వు సూక్ష్మగ్రాహివి. చురుకుదనం వున్నది. అమ్మగారు మరోపని పిల్లను పెట్టుకుంటారు. నువ్వు పనిచేయకు. ఇంకా నాజూకు తేల్తావు.

సత్యవతి:- అంటే?

శేఖరం:- యేం లేదులే. నీ పనికానిచ్చుకో. నే పోతున్నా. గురువుగారు వూరికెళ్తే నాకు ఫోన్ చెయ్యి. సినిమాకి తీసికెళ్తా. నా నంబరు తెలుసుగా?

సత్యవతి:- (తెలియదని తల అడ్డంగా తిప్పుతుంది)

శేఖరం:- ఇదుగో నంబరు రాశాను. ఇదేమో గురువుగారు కృతికి స్వరం వ్రాయమన్నారు. వ్రాశాను. ఇవి నేను నేర్చిన రాగాల పేర్లు. గురువుగారడిగితే చూపు (వెళ్లిపోతాడు).

(సత్యవతి కళ్లు పెద్దవి చేసి వాటివంక చూస్తుంది).

(మేడమీద గదిలో కుర్చీల్లో యిద్దరు పెద్ద మనుషులు కూచుని వుంటారు. యెదురుగా కుర్చీల్లో శర్మా, నాగభూషణం. మధ్య బల్ల. దాని మీద అద్దం. వాటి మీద పత్రికలు.

1వ పెద్ద మనిషి:- మీకప్పుడు వేరే ప్రోగ్రాముంటుందేమోనని ముందే మనవి చేసుకుంటున్నాను. మా అమ్మాయి పెళ్లిలో, మీ కచేరీ పెట్టాలని అభిలాష. తమకు వీలౌతుందీ అంటే, ఆనాటికి మేము అన్ని యేర్పాట్లూ చేసుకుంటాము. ఒక

మాసము వ్యవధానమున్నది.

నాగ:- అట్లాగే. వస్తాను. కచేరీ యెంతసేపు చేయాలి? నా కిష్టమైనవి పాడచ్చా? మీరు ఎన్నిక చేస్తారా?

1వ మనిషి:- యెంతమాట సెలవిచ్చారు! అంతా తమ యిష్టమే. సభికులెవరన్నా ఒకటీ అరా కీర్తన పేరు చెప్పి పాడమంటే అభ్యంతరమా తమకి?

నాగ:- ఎంత మాత్రం లేదు. మీకు మరొక విషయం తెలియదేమోనని చెపుతున్నా. కొంతమంది, కచేరీ చేసేవాడు గొప్పవాడైతే చాలునని వూహిస్తారు. పక్క వాయిద్యగాళ్లు కూడా సమర్థులై వుండాలని తెలియదు. నేను చెప్పిన వారినే పక్క వాయిద్యానికి పిలిపించాలి.

1వ ఆయన:- చిత్తం. ఒక వారం ముందుగా చెపితే, వారి దర్శనం గూడా చేసుకుంటాను. లేదా యివాళే కలుసుకుని మీరు వెళ్లమన్నారని చెపుతాను.

నాగ:- అంత శ్రమ అక్కర్లేదు. మీ చిరునామా యిచ్చి వెళ్లండీ. వారికి నే ఫోన్ చేస్తా.

1వ ఆయన:- మంచిది (జేబులోని విజిటింగ్ కార్డు యిస్తాడు)

నాగ:- (రిస్టువాచీ చూసుకుంటాడు. మీ సంగతేమిటన్నట్టు 2వ పెద్దమనిషి వంక ప్రశ్నార్థకంగా చూస్తాడు.)

2వ ఆయన:- మా అమ్మాయిని ఆడిషన్‌కి పంపాలని కోర్కె. ఇప్పుడు రూల్సు మారినై. వయఃపరిమితి పెట్టారు. అది చాలక రికార్డింగ్ జరుగుతుంది. వీణ చెప్పించాము. తమరు విని తగినంత స్టాండర్డ్ వున్నదా లేదా చెపితే మాకు ధైర్యంగా వుంటుంది. తమరు శ్రమ అనుకోక (చేతులు నలుపుకుంటాడు).

నాగ:- ఇందులో శ్రమ యేమీలేదు. ఎన్నేళ్లనించీ చెప్పిస్తున్నారు? గురువెవరు? అమ్మాయి వయస్సెంత వుంటుందీ?

2వ ఆయన:- గురువు తమ శిష్యుడే. ఎనిమిదేళ్ల నించీ చెప్పిస్తున్నాం. అమ్మాయికి పదహారో యేడు.

నాగ:- నేను విని తగినంత స్టాండర్డ్ లేదంటే నొచ్చుకోరుగా? మరో రెండేళ్ల

చెప్పించాలంటే, సంగీతం మాన్పించరుగా? అట్లా అయితేనే వచ్చి వింటాను. లేకపోతే దండగ, యెందుకు చెప్పానంటే, నా శిష్యుడు నేర్పినా, గురువు నేర్పినా నాకొకటే.

2వ ఆయన:- యెంత మాటా! మీ మాట వేదవాక్కుగా భావిస్తాను. ఇదుగో మా అడ్రసు. మీ బావగారికి నేను తెలుసు. వారిని వెంటపెట్టుకు రండి.

నాగ:- (నవ్వుతాడు) యేకక్రియా ద్వ్యర్థకరీ. మనువు గూడా చూస్తున్నారన్నమాట. వస్తాం. యిద్దరం వస్తాం.

సత్యవతీ! (పిలుస్తాడు)

ఇద్దరు పెద్ద మనుషులు:- సెలవు తీసుకుంటాము (చెరో కవరూ బల్ల మీదుంచి నమస్కారం చేస్తారు)

నాగ:- ఉండండి

(మెట్లమీద అడుగుల చప్పుడు. సత్యవతి ట్రేలో పండ్ల రసం గ్లాసులుంచి తెస్తుంది. ముగ్గురికీ అందించి, ట్రే మధ్య గుండ్రని బల్లమీదుంచుతుంది. తల ఒంచుక వెళ్లి కర్టెన్లు దిద్ది పక్కగదిలో కెళ్లి కిటికీల కర్టెన్లు దిద్దుతుంది)

(పెద్ద మనుషులిద్దరూ ఒకరిమొహం ఒకరు చూసుకుంటారు. రసం చప్పరిస్తారు).

2వ పెద్దమనిషి:- (కుతూహలంతో అడుగుతాడు)

యెవరమ్మాయి?

నాగ:- మా వాళ్లే. మేనగోడలౌతుంది. సంగీతం నేర్చుకోటానికి వాళ్ల వూరునించి వచ్చింది. ఆడిషన్కి పంపాలని చూస్తున్నాను.

(సత్యవతికి వినబడుతుంది. నవ్వుకుంటూ కూనిరాగం తీస్తుంది.)

ఇద్దరూ:- సెలవిప్పించండి (లేస్తారు)

నాగ:- మంచిది. (వాళ్లు వెళ్లిపోతారు. సత్యవతి వచ్చి ట్రేలో గ్లాసులుంచి తీసికెళ్తుంది. కడిగి గదిలో వుంచి చెయ్యి తుడుచుకుంటూ వస్తుంది. తివాసీ మీద కూచుంటుంది.)

నాగ:- తంబురా తీసుకో. శృతిపెట్టటమొచ్చిందా? మీటటమొచ్చిందా? ఇటుతే

శృతి బాగా లేదు. (సత్యవతి లేచి అందిస్తుంది) స్వరసాహిత్యాలు రెండూ పాడు.

సత్యవతి:- (పాడుతుంది) (యాస సరిగా వదలదు)

నాగ:- (నవ్వు దాచుకుంటూ వింటాడు) సత్యవతీ యివాళేం పుట్టింది నీకు? సంగీతాన్ని హత్య చేస్తున్నావు. కరుణాశా గాదు. కరుణసాగర. శృతగాదు. సుత. కరివదన అంటే యేనుగు ముఖము. కరి అంటే కరివేపాకనుకున్నావా? (సత్యవతి తలవంచుకుని నవ్వుతుంది).

నాగ:- నా ముఖం వంక చూడాలి. ఇప్పుడు పెళ్లి పీటల మీదున్నా మా ఓరకన్నులతో చూడటానికి? ఉచ్చారణ పట్టాలి. తల వంచుకుంటావేం అనవసరంగా? లంభోధరగాదు. లంబ ఉదర. పెద్ద పొట్టగలవాడా! అమ్మతో తిరుగుతూ యేం చేస్తున్నట్టూ? బియ్యం చేస్తూ పిచ్చి సోదివింటున్నావా?

సత్యవతి:- (తలెత్తి నిశ్చలంగా చూస్తుంది) నేదు. నేరుస్తున్నాను.

నాగ:- నేదు గాదు. లేదండీ అనాలి.

సత్యవతి:- లేదండీ. సోది వినటం లేదు.

నాగ:- భేష్. అలా వుండాలి. శ.ష.స. లకి తేడా వినాలి. సింధూర. షణ్ముఖ. శశిశేఖర.

సత్యవతి:- (అన్నీ స్పష్టంగా పలుకుతుంది. అంతలో సంతోషం పొంగి అపభ్రంశ పదాలు వాడుతూ పాడుతుంది.)

నాగ:- సత్యవతీ! పరవశత్త్వం పొందావు. వేడణాలు, యెండి లింగం, యిస్తళ్లు, సింతపండు, యెండి షట్రం చేసి నాణేలు చేస్తారు. అదంతా పండితులు, విద్వాంసులు వాడే భాష అనుకుంటున్నావు. బావా!

శర్మ:- వింటున్నా. దాని అభిప్రాయం అది గాదు. సులభ పద్ధతిలో పలుకుతున్నది. తెలిస్తే అలా పలుకుతుందా?

నాగ:- (అన్నీ దిద్దుతాడు. కొత్త పదాలు పలికిస్తాడు) తేడాలు తెలిసినయ్యా? (తెలిసినాయి అని తల వూపుతుంది)

నాగ:- తల వూపితే గాదు. పత్తిత్తులు తింటావా బసవన్నా అంటే

తలవూపుతాడుట. తెలిసినాయండీ అనాలి.

సత్యవతి:– తెలిసినాయండీ.

నాగ:– భేష్. కొత్తది పాడి వినిపించు బావ వింటాడు.

(తాళయుక్తంగా పాడుతుందిగాని కర్కశంగా పాడుతుంది. భూషణం నవ్వుతూ చూస్తాడు)

నాగ:– బావా వింటున్నావా?

శర్మ:– ఇక్కడే వున్నా. వింటూనే వున్నా.

నాగ:– సత్యవతీ నువ్వెళ్లి వేడి టీ సేవించిరా. ముఖం కడుక్కుని రా పో. (సత్యవతి కళ్లు తుడుచుకుంటూ వెళ్లిపోతుంది.

నాగ:– (నవ్వుతూ అంటాడు) ఎట్లాగూరా బావా? బుద్ధి గడ్డి తిని మొదలుపెట్టినట్టున్నానే?

శర్మ:– (నవ్వుతాడు) అప్పుడే నీళ్లుగారిపోతావేం? పందెమేమిటో గుర్తు చేసుకో. పట్టుదల వస్తుంది. దానికి మంచి గుడ్డలూ, మంచి తిండీ అమిరేప్పటికి, అందంగా తయారై ముద్దుగా వున్నది. నీ కళ్లలోకి అదే పనిగా చూడమంటే దాని బుర్ర పనిచేయదు. తలవంచుకోనీ, దాని ఘోష నీకేం తెలుస్తుంది.

(సత్యవతి వస్తుంది. మొహం కంది వుంటుంది)

నాగ:– కూచో. అప్పుడే వచ్చేశావు. యేం తాగలేదూ?

సత్యవతి:– (కూచుంటుంది) లేదండీ. పాఠం అయాక, అన్నం తింటాను.

నాగ:– (సంతోషిస్తాడు) భేష్ అట్లా వుండాలి పట్టుదల.

(మళ్లా స్వరసాహిత్యాలతో సహా అంతా నేర్పుతాడు)

ఇవాళ్టికి చాలు. తాళం బాగానే వేస్తున్నావు. సాయంకాలం చక్కగా వప్పజెప్పాలి. లేకపోతే, రిబ్బన్లు లేవు, కాటుకలేదు, అన్నం లేదు. నిద్ర లేదు. గాజులు లేవు. పూవులు లేవు. తెలిసిందా?

సత్యవతి:–తెలిసిందండీ. ఒప్పజెప్పుతా.

(కింద గలాభా వినిపిస్తుంది. తల్లి పిలుపు. శర్మ లేచి కిందికి వెళ్లి వస్తాడు)

శర్మ:– సత్యవతి కోసం నీ కోసం ఒక ఆడమనిషి వచ్చిందిట. చూడాలి. మాట్లాడాలి అంటున్నదిట. అత్తయ్య చెప్పింది. అది గొడవ లేవదీయాలని చూస్తున్నదిట.
సత్య:– (గాభరాగా) మా అత్త సచ్చింది కూడి కొచ్చిందా? (భయపడుతుంది)
నాగ:– గాభరా పడతావెందుకూ? భయందేనికీ? దాని సంగతేదో తేల్చుదాం పద.
సత్యవతి:–అది సిగ్గిడిచేసిన ముండ (నాలిక్కరుచుకుని నోరు మూసుకుంటుంది. సిగ్గుపడి వూరుకుంటుంది)
నాగ:– 'అది సిగ్గు విడిచేసిన మనిషి' అను.
సత్యవతి:– (అంటుంది) (శర్మ నవ్వుతాడు. ముగ్గురూ కిందికి వెళతారు)
(హాలు వాకిలి దగ్గర పైడమ్మ నుంచుని వుంటుంది. మాసిన చింపిరి తల, చిరిగిన గుడ్డలు. చేతులు తిప్పుతూ హంగామా చేస్తుంది. తల గోక్కుంటూ వుంటుంది.)
పైడమ్మ:– (సత్తి కంటబడగానే మీది కొస్తుంది). ఏటే దొంగసన్నాసీ? ఈఁరింటో చేరి కులుకుతుండావా? మక్క విరగదన్నేను. రాయింటికిప్పుడే. నేనూల్లో లేకుండా సూసి, వుడాయిస్తివా? ఓరే నీకు దిక్కు? ఓరితో సెప్పి సచ్చా వీడికి? ఇల్లేమైపోతాదనుకుండావ్! ఎంత ధైర్నం?
శర్మ:– (శాంతగా నచ్చ చెప్ప చూస్తాడు) యెందుకరుస్తావిక్కడెవరికీ చెముడు లేదు. మెల్లిగా అడుగు చెపుతుంది. సంగీతం నేర్చుకుందామని వచ్చింది. అందులో తప్పేమీ లేదు.
పైడమ్మ:– (శర్మవేపు తిరిగి చేయి తిప్పుతుంది) యేటి బాబూ తవురు గూడా దాని పచ్చం మాటాడుతుండారు? ఓరు సెప్పారని దీన్ని సేరదీసి కూడూ గుడ్డా యిచ్చారంట? తరిపి దూడను మేపినట్టు మేపితిని. బలిసిపోనాది. సెప్పకుండ వచ్చేస్తదా?
సత్తి:– నువ్వింట్లో లేవు. యాడికి పోనావో తెల్దు. నువ్వు నాకు కూడూ గుడ్డా యిచ్చావా? సుక్క పొడవంగానే నెగిసి పన్లో కెల్తే, సీకటడేదాకా పన్జేసి,

చంపాయించిదంతా నీ చేతులో పోయాల. లేకపోతే యీ పుసదునే. అదేనా కూడెట్టటం? నా కాయకట్టం బెట్టి నువూ మావా తెగ తాగి ఒల్లు తెలీకండా పడి వుంటే, నేనుడకేయాలా? గుడ్డా? కొత్తగుడ్డ లిస్తివా? నీ సినిగిన పాతవి యిస్తివి. అంతేనా? యెల్లెల్లు (చెయ్యి తిప్పుతుంది)

పైడమ్మ:- నీ నోరు బడా. కూత్తుండావే? పోలీసోళ్లని దెచ్చి లాక్కెళతా. యేటనుకుంటుండావో. ఈరిమీద గూడా కేసెట్టిస్తాను. నా బిడ్డ నెత్తుకొస్తారా? నాగ్గాకుండా సేస్తారా? నన్ను దాన్నీ యిడదీస్తారా?

సత్యవతి:- ( ఆశ్చర్యం వెల్లడిస్తుంది) నేను నీ బిడ్డనా? నా నాయనెవరు? అసలు నువు సెప్పే మావెవడు? నన్నెవురికిచ్చి పెల్లి చేసినావు? అయన్నీ గూడా పోలీసుల్తో సెప్పుకో. నా కేమీ భయము నేదు.

పైడమ్మ:- (సత్యవతి వంక వురిమి చూస్తుంది. శర్మ, నాగభూషణం మీదికి వస్తుంది). ఏంటి బాబూ? డబ్బాశ సూపి, నా కోడల్నెత్తుకొత్తారా? మీకిది మరేదా? మా కులపెద్దల్ని పోగుసేసి తెచ్చి, మిమ్మల్ని అల్లరి సేయగల్ను. ఏటనుకుంటుండారో?

నాగ:- ఏమనుకుంటున్నామంటే, దిక్కులేని పిల్ల నెత్తుకొచ్చి నానాహింసలూ పెట్టటమే గాక, దానికి వ్యభిచారము, దొంగతనమూ, అబద్ధాలాడటం నేర్పి, డబ్బు లాగాలని యిక్కడ దింపి వెళ్లావనుకుంటాము. లేకపోతే దానికి మా యిల్లెట్లా తెలుసూ? నిన్ను జైల్లో పెట్టించటం చాలా తేలిక. ఇప్పుడేగా కూతురన్నావూ? అంతలోనే కోడలైందీ? నీ కొడుకేడీ? యేవుద్యోగంలో వున్నాడు? నువు పోలీసుల్ని తీసుకురాక్కర్లేదు. నేనే ఫోన్ చేసి పిలిపిస్తా. నీ కాయాసముండదు. ఇదేదో యిప్పుడే తేలిపోవాలి. భాగ్యవంతుల్ని బ్లాక్‌మెయిల్ చెయ్యాలని చూస్తున్నావా? అనాథల్ని పీడించాలని చూస్తున్నావా? (ఫోన్ అందుకుని డయల్ చేస్తాడు) హలో!

పైడమ్మ:- (కింద కూలబడుతుంది) ఉండండి బాబూ పిలవకండి. తప్పునాదే. అది నా అన్న కూతురు.

సత్య:- మా అమ్మా నాయనా యెవురో యిప్పుడైనా సెప్పు.

పైడమ్మ:- నువుండే. దొంగ సచ్చిందానా. మీరి పోనావు. పోలీసుల్ని పిలవకండి బాబు. నామాటినండి. యేదో పేదముండను. ముసిలిముండను. నా మొగాన మీకు తోచింది పారేయండి. నోరు మూసుకునెల్తాను. మారాజులు. ఓ వంద పారేయలేరా? మీకున్నదాంట్లో అదే పాటి? మీ పట్టుపంచె కరీదు సేయదు. మల్లిటు కేసొస్తే, సెప్పుచ్చు కొట్టండి. పెద్దోరు. దిక్కులేని పచ్చిని.

నాగ:- (ఫోన్ పెట్టేస్తాడు) యేమంటావురా బావా?

పైడమ్మ:- (శర్మతో అంటుంది) బాబ్బాబు తవురైనా సెప్పండి. దిక్కులేని పచ్చుని సూడండి. మీ కాలిసెప్పులు కరీదు సేయదు.

సత్య:- వద్దు యివ్వద్దు. కర్సు సేసేసి మల్లా వస్తది. మల్లా అడుగుతది. మల్లా యియ్యాల.

నాగ:- (నవ్వుతూ విచిత్రం చూస్తాడు)

పైడమ్మ:- నువ్వేటే మద్దెని? తప్పుడు ముండా. నీ చొమ్మా? బాబు చేతి కడ్డమొత్తుండావే? బాబూ యిది మీరు సెప్పినట్టినుకోకపోతే పారక తిరిగేసి యీపుసదును సేయండి. సచ్చినట్టింటది.

శర్మ:- దాని శిక్షణ సంగతి మేం చూసుకుంటాంగాని నువ్వు మల్లా మల్లా వచ్చి గొడవచేయవని భరోసా యేమిటి? పిల్లనెత్తుకొచ్చి, కాసేపు కూతురనీ కాసేపు కోడలనీ ప్లేట్లు ఫిరాయించేదానివేమైనా చేయగలవు.

పైడమ్మ:- (చెంపలేసుకుని దణ్ణం బెడుతుంది) మల్లీ రాను బాబూ రాను. కాగితం రాపించుకోండి. యేలి ముద్దరేస్తా. మీ కాలికి మొక్కనా? ఓ వంద నా మొగాన పారేయండి. ముసిలి పచ్చికి, వో పాతకోక యిప్పించరా? (దోసిలి పడుతుంది).

శర్మ:- (యేమి చేయమన్నా వన్నట్టు నాగభూషణం వంక చూస్తాడు. నాగభూషణం యివ్వమన్నట్టు తలా చెయ్యీ వూపుతాడు. శర్మ తన లాల్చీ జేబులోంచి వో వంద కాగితం తీసి పైడమ్మకిస్తాడు. నాగభూషణం సత్యవతి వంక చూస్తాడు. సత్యవతి లోపలికి పోయి ఓ పాతచీర తెచ్చి పైడమ్మకిస్తుంది)

పైడమ్మ:- (దణ్ణాలు పెడుతుంది) నా బాబు దరమాత్ముడు. కలకాలం సల్లగుండాల. (మొక్కి వెళ్లిపోతుంది).

3 వ అంకం

(పుష్యమాసం. తెల్లవారు జామున నాల్గుగంటలు వుండంటి చలి. మేడమీద వరండాలో నాగభూషణం చాపమీద కూచుని వుండును. లాల్చీ, ధోవతీ.)

నాగ:- సత్యవతీ! యేం చేస్తున్నావ్! తెల్లవారుతున్నది.

(కాలిగజ్జెలు చప్పుడు. సత్యవతి వచ్చి చిరిచాప పరిచి దానిమీద కూచుంటుంది. యెదురుగా చన్నీళ్ల కుండ. దాని చుట్టూ చేతులుంచి, అకారసాధన చేస్తుంది)

శర్మ:- (బద్ధకంగా నిద్ర లేచి, కాశ్మీర్ శాలువ నిండా కప్పుకుని, సాక్సు యెక్కించి వచ్చి కుర్చీలో కూచుని కాళ్ళు ముడుచుకుంటాడు. కిందనించి, సన్నగా, కామేశ్వరమ్మ మేలుకొలుపు పాట, వినపడీ వినబడకుండా, గాలి వాటానికి వినపడుతూ వుంటుంది) చలికి నీలుక్కి పోయి చస్తుందేమో రా బావా? స్త్రీ హత్యా పాతకానికి వెరవవా? ఆరు బయటే యెందుకు? మంచుకురుస్తున్నది.

నాగ:- నీకు తెలియదు. నాయుడుగారు శీతాకాలంలో లేచి, త్రిస్థాయిలూ, త్రికాలాలూ నాలుగ్గంటలు, సరళలూ జంటలూ సాధన చేస్తే రెక్కలు పడిపోయేవట. వళ్ళు చెమట పట్టేదిట. వాయులీనం వెచ్చబడేదిట. కూచున్నంత మేర వేడెక్కేదిట. శీతాకాలంలో సాధన చేస్తే తక్కిన ఋతువులలో సాధన చేయక్కర్లేదని శాస్త్రం చెపుతున్నది. కష్టపడందే సరస్వతీ సాక్షాత్కారమౌతుందా? సత్యవతికి శిశిర ఋతువులో పొద్దున్నే పొగమంచులో అమ్మకానికి వెళ్లే అలవాటున్నది.

శర్మ:- కనీసం పాత చీరన్నా ముసుగుగా వేసుకుని వెళ్లేదేమో.

(కామేశ్వరమ్మ వేడి వేడి కాఫీ ఫ్లాస్కుతో తెస్తుంది)

కామేశ్వరమ్మ:- దాన్ని చంపుతావాయేం? కాఫీ గొంతులో పోసుకోవే. నీ దుంపతెగ. చచ్చిపోతావ్.

(గ్లాసులు కింద వుంచుతుంది)

నాగ:– అబ్బ! మీరిద్దరు దయాళువులూ కలిసి. దాన్ని పాడుచేసేట్టున్నారు. నేను లేనిక్కడా? నాకన్న గొప్పదేమిటిదీ? అదట్లా గుక్కపట్టి వేణువులాగా తారస్థాయి వరకు పోతే కంఠంలోని అందం వినిపిస్తుంటే వినలేరూ?

(సత్యవతి ఆపకుండా పాడుతుంది)

నాగ:– దాన్ని నిరుత్సాహపరుస్తున్నారిద్దరూ.

కుండ కౌగలించుకోకుండానే, నేను రవ వినిపిస్తా. వినిపట్టుకో సత్యవతీ.

(సత్యవతి కుండమీది చేతులు తీసేస్తుంది. నాగభూషణం శ్రీరాగం మూర్ఛనా ప్రస్తారం వినిపిస్తాడు. కీర్తనలలోని భాగాలు కొన్ని అందంగా వినిపిస్తాడు.)

కామేశ్వరమ్మ:– నే పోతున్నా. నా కెందుకు. ఇదుగో వేడి వుప్మా.

(కిందికి వెళ్లిపోతుంది)

నాగ:– గదిలోకెళ్దాం. అవి కానిచ్చి, తానం వినాలి. (ముగ్గురూ లేస్తారు. శర్మ ముందుకెళతాడు. కిటికీల కర్టెన్లు మూసి రగ్గు ముసుగు పెట్టుకు పడుకుంటాడు. సత్యవతి కాఫీ ఫలహారం అమరుస్తుంది.)

నాగ:– (నవ్వుతూ) బావా? లే. వేణ్ణీళ్లు కావాలా? కాఫీ ఫలహారం తీసుకో. కుర్చీలో కూచుంటే కాళ్ళు పట్టుకు పోయాయేమో. పట్టమన్నావా?

శర్మ:– (ముసుగు తీస్తాడు) అక్కర్లేదు. అక్కర్లేదు. మీరిద్దరూ కానీయండి. నేను స్నానాలగదిలో కెళ్లివస్తా. (లేస్తాడు. సత్యవతి కాఫీ ఫలహారం కానిచ్చి, కడిగి బోర్లించి, చేతులు తుడుచుకుని వచ్చి కూచుంటుంది. దేవీ మీనాక్షి ముదం దేహి అని తాళం వేసి పాడుతుంది. తొమ్మిది నిమిషాలు రాగాలాపన. అయిదు నిమిషాలు స్వరకల్పన. తాళం వేస్తుంది. ఆపేస్తుంది)

నాగ:– (నవ్వు మొహంతో) బావుంది. తాళం బాగా వేశావు. కాని యెట్లా పాడావో నీ పాటనువే వినాలి (టేప్ రికార్డర్ పెడతాడు. శాంగీత రసోల్లాదిని. శదనే. చహోదరి చంకరి. చంకరి అని వినిపిస్తుంది. సత్యవతి నవ్వుతుంది. నాగభూషణం అందంగా పాడతాడు. విని తలొంచుకుంటుంది).

నాగ:– నవ్వితే గాదు సత్యవతీ! నీ తప్పులు నీకు తెలియాలి. తప్పులు లేకుండా

యింపుగా పాడాలి. తాళజ్ఞానం స్వరజ్ఞానం అలవడ్డాయి. ఇవాళ రాత్రికి ప్రసిద్ధి కెక్కిన విద్వాంసురాలు గంటన్నర ప్రోగ్రామిస్తుంది. శ్రద్ధగా విను. యేడున్నరనించి తొమ్మిది వరకు. నేను కచేరీ చేయటానికి వెళ్లాలి. నీకు పాఠం లేదు. పాతకీర్తనలు పాడుకుని చూసుకోవాలి. శేఖరమొస్తే, వాడి సరసం పెడచెవిని బెట్టి, యిద్దరూ కలిసి సాధన చేయాలి. మనకు పెళ్లికి హాజరుకమ్మని ఆహ్వానం వచ్చింది. నీ పాఠానికంతరాయం. ఆ తర్వాత నాకు ప్రయాణమున్నది. నీకు కీర్తన చెప్పిపోతాను. నే వచ్చేప్పటికి వప్పచెప్పాలి. పదాలు గుర్తురాకపోతే అమ్మనడుగు. చెపుతుంది. ( ఓర జూపు జూచేది న్యాయమా అనే కీర్తన పూర్తిగా నేర్పుతాడు. మొత్తమంతా పాడిస్తాడు. శర్మ వస్తాడు. కూచుని వింటూ కాఫీ ఫలహారంకానిస్తూ, వాళ్లిద్దర్నీ చూస్తూ వుంటాడు. పాఠం ముగుస్తుంది. సూర్యుని లేత కిరణాలు కిటికీలోంచి గదిలోకి పడతాయి. కిందనించి కామేశ్వరమ్మ పిలుపు వినిపిస్తుంది. నాగభూషణం పొమ్మని సైగ చేస్తాడు. సత్యవతి ఒక్క వుదుటున లేచి కిందకి వెళ్లిపోతుంది).

శర్మ:- బావా! సత్యవతినీ ఛాతీ వంక కన్నార్పకుండా చూస్తున్నది. జాగర్త. ''తామరస నేత్రలిండ్ల బందాలు కారే'' (నవ్వుతాడు).

నాగ:- యేడ్చింది. తప్పుడు ముండ (లేస్తాడు)

శర్మ:- నువ్వు నీ యిష్టమొచ్చిన భాష, సభ్యత లేకుండా వాడచ్చేం? మమ్మల్ని తప్పు పట్టి దిద్దుతూ వుంటావు. నీ భాషా, స్వభావం దానికీ వచ్చేస్తున్నాయి. భ్రమర కీటక న్యాయం. నువ్వూ దానిని ముద్దు చేస్తున్నావ్. నీ సంగతి నీకు తెలియటం లేదు. నువ్వు లేనప్పుడది అత్తయ్యను ''అమ్మమ్మగోరూ!'' అని నోరారా పిలుస్తున్నది అంటే నువేమౌతావో! (నవ్వుతాడు).

నాగ:- నేనేమీకాను. అమ్మేదానికలా నేర్పి అలా సంభోదించమంటుంది. ఆమె ప్రేమ యెక్కడా పారబోయదు. ఓహో! శ్రీవారు వేంచేశారే! యేమిటివాళ విశేషం? (శేఖరం నమస్కారం చేసి కూచుంటాడు. పాఠం జరుగుతుంది).

3వ దృశ్యం

శర్మ:– సత్యవతీ! ఇవాళ మంచి సినిమా విడుదలైంది. శేఖరం గూడా వస్తానన్నాడు. తయారుగా వుండాలి. బజారుపని వున్నదన్నావు. నేను ఊళ్లో కెళ్లొచ్చే లోపల, అత్తయ్య కోసం బజారునుండి యేమేం కావాలో కనుక్కో. (వెళ్లిపోతాడు చేతికర్ర వూపుతూ)

కామేశ్వరమ్మ:– సత్తెమ్మాయ్! యేమేం కావాలన్నానో గుర్తున్నాయా? కంఠస్థం చేశావా? (జాబితా యేకరువు పెడుతుంది. సత్యవతి మళ్లా వరసగా అన్నీ చెపుతుంది) శనగపప్పు యెండబెట్టి కొలిచి వుంచాను. గిన్నె తీసికెళ్లి కార్లో పెట్టుకో. ఇందమిల్లుకి చిల్లర (దొడ్డివేపు వెళ్తుంది)

(సత్యవతి పప్పువున్న గిన్నె తీసుకుని షెడ్‌లోకి వెళ్తుంది. తలుపులు బార్లా తీస్తుంది. గిన్నె కార్లో వుంచుతుంది. మెత్తని నాప్‌కిన్ అందుకుని కారు పైభాగం దులుపుతూ వుంటుంది. శేఖరం విప్పారిన మొహంతో, చంకలు కొట్టుకుంటూ వస్తాడు)

శేఖరం:– సత్యవతీ! ఇవాళ నేను గూడా నీతో వస్తున్నా సినిమాకి. నీకు తెలుసా?

సత్యవతి:– తెలుసులెండి. మీ వాళ్లతో చెప్పొచ్చా రాలేదా? మీ పెళ్లాం గూడా రాదా?

శేఖరం:– యేమివాళ మర్యాదా వాచకం వాడుతున్నావు? నా భార్యా యింకా అత్తవారింటికి రాందే? నాతో వస్తుందా? ఇదుగో పర్సు. నీ దగ్గరుండనీ (జేబులోంచి పూలదండ తీసి సంతోషంతో అందిస్తాడు) ఇదిగో పూలదండ. నీకిష్టమని కొనితెచ్చా.

సత్యవతి:– యెందుకొన్నారు? మన దొడ్లో వున్నాయిగా? కొత్తగుడ్డ లేసుకొచ్చారే? (పూలదండ అందుకుని తలలో పెట్టుకుంటుంది)

శేఖరం:– (నవ్వుతాడు) మన యేమిటి? నీదీ నాదీ నా దొడ్డి? దొడ్లో పూయని పూలే తెచ్చాను చూడు.

సత్యవతి:– కారుచక్రాలు కడగాలి. కారు నెట్టాలి.

( ఇద్దరూ కారునెట్టి బయటికి తెస్తారు).

కథా నిలయం 5580 శ్రీకాకుళం

4వ దృశ్యం

(పెళ్లి పందిరి. సందడి. రకరకాల మనుషులు. వివిధ రాష్ట్రాల అలంకారాలు దుస్తులూ. శేఖరం, శర్మా, నాగభూషణం కామేశ్వరమ్మా పెళ్లికి వచ్చారు. సత్యవతి పట్టుబడకుండా హెచ్చరిస్తూ, కనిబెట్టి వుంటారు. వాళ్లను తెలిసిన వాళ్ళు పలకరిస్తూ తీసికెళ్తారు. సత్యవతి ఒక్కతే అవుతుంది. సత్యవతి యీడు వాళ్ల ఆడపిల్లలు పలకరిస్తూ దగ్గరౌతారు. చుట్టూ చేరుతారు. మాట్లాడిస్తూ దూరానికి తీసికెళ్తారు. దీపాల తోరణాలూ, పూలచెట్లు, క్రోటన్సు చెట్లూ మధ్య వలయంగా కుర్చీలూ, లాన్సూ, పులవాసనలూ)

కమల:– నీ జడ స్వంత జడే? కాదా? పెద్ద జడే? యెన్ని సవరాలు పెట్టావు? నైలాన్‌వి గూడా కలిపావా? నాలుగన్నా వుండాలి.

సత్యవతి:– సవరాల్లేవు. యిప్పి సూపించనా?

సరోజ:– యాసగా మాట్లాడుతుందేమే కమలా? వాళ్లమ్మాయేనని విన్నాను.

సరిత:– చిన్నప్పటినించీ పనివాళ్ల చేతుల్లోనే పెరిగితే వాళ్లమాటలే పట్టుబడతై. అవివో పట్టాన వదలవు. మా వదిన 'యెల్లకండెల్లకండి' అంటూ వుంటుంది. మేం నవ్వుతాం (సత్యవతితో అంటుంది) నీకు బాగా సంగీతమొచ్చని తెలిసింది. ఆడిషన్కి అప్పియర్ కాబోతున్నావన్నారు. ఓ కీర్తన పాడతావా?

సత్యవతి:– (అందరివంకా చూసి కళ్లు వాల్చి నవ్వుకుంటుంది) పనివాళ్లచేతుల్లో పెరిగానా? యే కీర్తన పాడమన్నారు?

శారద:– పరిదానమిచ్చితే వచ్చా?

సత్యవతి:– వచ్చు. బిలహరి రాగం.

సుందరి:– నీ వల్ల గుణదోషమేమి పాడు. వచ్చా?

సత్యవతి:– వచ్చు. కాఫీ రాగం. ఝంపతాళం.

శ్యామల:– పిలచిన బిగువటరా. ఔరారావచ్చా అది మల్లీశ్వరిలో భానుమతి పాడింది.

సత్యవతి:– వచ్చు (తనవారి కోసం చూస్తుంది. కొద్ది దూరంలో దీపం పడి,

శర్మ, నాగభూషణం కంటబడతారు. సత్యవతి వంకే చూస్తూ వుంటారు. పాడనా అన్నట్టు చూస్తుంది. నాగభూషణం తలూపుతాడు)

సుజాత:- శ్రీవరలక్ష్మి పాడండి. నేనడిగింది ముందు పాడాలి.

సుందరి:- శ్రీ సరస్వతీ పాడండి.

కమల:- అందరం అడిగినవీ పాడుతుంది. మాట్లాడకుండా కూచుందాం.

(సత్యవతి ఒక్కొక్క కీర్తనే పాడుతుంది. చప్పట్లు కొడతారు.)

కమల:- మీ కంఠంలో మంచి ఒదుగున్నది. తీయని గొంతు. కోకిలలాగా తారస్థాయి వరకూ అలాగ్గా వెళ్లగలరు. తాళం గూడా కరెక్టుగా వేశారు. యెన్నేళ్లనించీ నేరుస్తున్నారు (పేర్లు పెట్టి పెద్దవాళ్లు పిలుస్తారు. పిల్లలు యిప్పుడే వస్తామని వెళ్లిపోతారు. పనిపిల్లలు కొంతమంది సత్యవతి చుట్టూ చేరుతారు.)

రత్తి:- మీకు చినిమా పాటలొచ్చా?

లక్ష్మి:- జావళీ ఒకటి పాడండి. మా అమ్మగారికి చాలా వచ్చు. నాకు కొన్ని వచ్చు.

పార్వతి:- లలిత సంగీతమొచ్చా? రేడియోలో వింటుంటాను. ఒకటి పాడరూ?

(తన యీడు పిల్లల్ని పనివాళ్లను చూడగానే సత్యవతికి సంతోషం కలుగుతుంది. ఉషారొస్తుంది. వాళ్లడిగినవన్నీ ఒక్కొక్కటే పాడుతుంది. అందరూ చప్పట్లు కొట్టి మెచ్చుకుంటారు. వెళ్లిపోతారు.)

( ఇదంతా దూరం నించి మొదట విన్న అమ్మాయిలు చూస్తారు. వింత కలుగుతుంది వారికి)

1వ:- పనిపిల్లేమో? అట్లాగే అనిపిస్తున్నది. వాళ్ల మధ్య వాళ్లల్లేనే చింకిచాటంత మొహం చేసుకుపాడింది.

2వ:- కావచ్చు. దాచిపెట్టారేమో.

3వ:- మీరుండండే. మళ్లా పెద్దవాళ్లే అడుగుతున్నారు. అష్టపది పాడుతున్నది. తరంగాలు గూడా వచ్చేమో. అరవకండి విందాం.

4వ:- నాగభూషణం గారి శిష్యురాలంటే గొప్పే మరి. ఆయన పట్టిష్టంగా

నేర్పుతారు. ప్లేబాక్ సింగర్‌గా తయారు చేస్తారేమో. ఆయన ఘటికుడు. ఎక్జిక్యూటివ్ కమిటీలో వున్నాడు. శ్రద్ధగా పట్టుదలగా నేర్పుతాడు.

1వ అమ్మాయి:–అబ్బ! విననియ్యవే. అయిపోయింది. మళ్లా పనిపిల్లలు వచ్చారు. ఈమాటేం పాడుతుందో.

(దూరానికి పాట యాక్షను కనిపిస్తూ వినిపిస్తాయి)

అమ్మోలమ్మో కొడతాడంటే గోగుమ్మాడీ
యెందుకురయ్యా కొడతావంటా గోగుమ్మాడీ
సెప్పిన పానీ సెయ్యాదత్తా గోగుమ్మాడీ
సెయ్యకపోతే సేస్కోరాదా గోగుమ్మాడీ

(సత్యవతి మైమరిచి, పిల్లలకోసం పాడుతూ ఆడుతూ వాళ్ల మధ్య తిరుగుతుంది. పిల్లలు వలయంగా తిరుగుతారు. శర్మా, కామేశ్వరమ్మ దూరాన కనబడి రమ్మని చెయ్యివూపుతారు. పాట పూర్తయేవరకూ వెళ్లదు. చప్పట్లు కొడతారు. ఎల్లొస్తా, మళ్లా వస్తానంటూ పరుగెత్తి వెళ్తుంది.)

1వ అమ్మాయి:– వెర్రి బాగుల పిల్లేమో? పాట మాత్రం అద్భుతం.

కమల:– పట్నవాసం అలవాటు కాకపోయినా, పట్నం నాగరకత అబ్బకపోయినా, కాపట్యం లేకపోయినా అట్లాగే కనుపిస్తారు. నాగరకత మరిగితే ఆ పాత నగలు పెట్టుకుంటుందా?

శారద:– లేటెస్టు డిజైనవీ వున్నాయి. నిన్న పెట్టుకున్నది. యేదియేమైనా, ఆడిషన్కి కూచున్నదంటే, తప్పకుండా సెలెక్టు అవుతుంది. అందులో సందేహం లేదు.

5వ దృశ్యం

(భోజనాల గది. శర్మ భోజనం చేస్తూ వుంటాడు. కామేశ్వరమ్మ వడ్డిస్తూ వుంటుంది. టైము పదకొండుగంటలు. మేడమీది నించి సంగీత సాధన వినిపిస్తూ వుంటుంది)

శర్మ:– (చేతి గడియారం చూసుకుని) అత్తయ్యా! యిన్ని చేశావు గదా. రైలు

వేళైంది. ఒక గంట ముందు పెట్టి వున్నట్టయితే యెంత బావుండేది? వీటిల్లో ఒక్కటీ ఒదిలేయలేను. యెంత రుచి? నీ చేతివంట అమృతం.

కామేశ్వరమ్మ:- (నెయ్యి వడ్డిస్తూ) ఇప్పుడు మాత్రం మునిగిపోయిందేమున్నదీ? రైలు లేటు కాగూడదా? రాత్రికి వెళ్లగూడదా?

శర్మ:- (గబగబా తింటూ) అహహ. మాటపోతుంది. పరపతి పడిపోతుంది. పెద్ద మనుషులు కారుతో సహా నా కోసం స్టేషన్కి వస్తారు. నాగన్న నొకసారి కదిలించి చూడు. అవతల పెద్ద మనుషులు నన్ను పదేపదే ప్రాధేయపడుతూ అడుగుతున్నారు. ఈ సంబంధం సెటిలయితే నాకూ నీకూ లాభం. నీకన్నివిధాలా సరితూగే వియ్యాలవారు వస్తారు. కోడలు రేడియో ఆర్టిస్టు. వాళ్లకి నాగన్న మీద గట్టి ఆశ వున్నది. పెరుగు వెయ్యి.

కామేశ్వరమ్మ:- (నించుని అంటుంది) యేమి నాగన్నో! తాబట్టిన కుందేటికి మూడే కాళ్లంటాడు. గట్టిగా అడిగితే, పెళ్లి చేసుకోకపోగా, రొద పెడుతున్నానని, వేరే వుంటాడేమో, యింత యింట్లో బిక్కు బిక్కుమంటూ ఒక్కత్తినే యేడవాల్సి వస్తుందేమోనని పస్తా యిస్తున్నాను. మరి కాస్త పాయసం వేయించుకో. కానీ. దీని గొడవేదో తేలాలిగా. ఇప్పుడసలు మనమాట చెవులో దూరేట్టు లేదు.

(మేడమెట్ల మీద నిలబడి నాగభూషణం కేకవేస్తాడు)

నాగ:- బావా! బావా! పోస్టు వచ్చింది. చూశావా?

(కిందనించి శర్మ జవాబు)

శర్మ:- యేమిటంత హడావుడి? వస్తున్నా. భోజనం అయిపోవచ్చింది (గబగబా పెరుగన్నం కానిచ్చును)

నాగ:- త్వరగారా మరి. మనం పెట్టిన అప్లికేషన్‌కి సమాధానం వచ్చింది. సత్యవతి సెలక్టయింది. చూశావా. నేపెట్టిన గడువింకా చాలా వున్నది.  మనకి చాలా వ్యవధానమిచ్చారు.

(మేడమీది గదివేపు వెళ్లిపోతాడు.)

శర్మ:- (భోజనం అయిపోయింది. లేస్తూ) మొత్తానికి నీ కొడుకు

ఘటికుడత్తయ్యా. నీ చేతివంట తింటేనే, తెలివితేటలొస్తాయి. సత్యవతికి సంగీతం అబ్బటమే గాక, నదురూ బెదురూ లేకండా ఎలక్ట్రికల్ రికార్డింగ్ యిచ్చి సెలెక్ట్ అయింది. మైక్ అంటే బెదరదు. కొత్త మొహాన్ని చూసి జడియదు. శేఖరమే బెదిరిపోతున్నాడు.

కామేశ్వరమ్మ:- నీకూ నాగన్నకూ యేళ్ళుపైబడిన కొద్దీ చిన్నతనం యెక్కువౌతున్నది. దాన్ని నెత్తినెక్కించుకుంటున్నారు. ఆ హడావుడీ యేమీ బాగాలేదు. వేసినవన్నీ వదిలేశావు. ఆవడలు తెస్తున్నా. పాయసం కానిచ్చావా? నాదేమున్నదీ? పిచ్చి సన్నాసికి సత్తెమ్మాయికి నాగన్నంటే గడగడ. యెన్నిగంటలకి నిద్రలెమ్మంటే అన్ని గంటలకి లేచి, నిద్రకు తూగకుండా పాడుతూ వచ్చింది. బద్ధక మెరుగదు. పనంతా నిమిషాలమీద చేసేసి, సాధన చేసుకున్నది. ఈ సత్తెమ్మా యొచ్చాకనే మధ్యాన్నం పూట కాస్త కునుకు తీసేందుకు వీలైంది. నేను వుపవాసమున్నా, లేవలేకపోయినా, వంట గూడా చేసింది నాగన్న కోసం.

శర్మ:- (నవ్వుతాడు. చెయ్యి కడుక్కుని తుడుచుకుంటూ వస్తాడు) నాగన్న మెప్పుకోసం తపించి పోతున్నది. (వంకెకున్న చొక్కా వుత్తరీయం తీసి వేసుకుంటాడు.) ఇదుగో అత్తయ్యా! డబ్బు. వాళ్లెవరితోనో యాత్రకి వెళ్లి రావటానికి ఒప్పుకున్నానన్నావు. యెప్పుడెళ్తావో యేమిటో నాకు తెలియదు. డబ్బు భద్రం చేసుకుని నీకు కావాల్సినవీ, నచ్చినవీ యాత్రాస్థలాల్లో కొనుక్కో. నే పోవాలి. రెండు నెలలవరకు రానేమో. వుత్తరం పడేయించు యింటికి.

కామేశ్వరమ్మ:- తాంబూలం వేసుకుపో. ఇవుగో తమలపాకులూ వక్కపొడీ సున్నం.

శర్మ:- (నోట్లు పీటమీద వుంచి తాంబూలం చేసి వేసుకుంటాడు) (పైకి పోతాడు)

నాగ:- బావా కడుపు నిండా ఆరగించావా లేదా పాపం? కీర్తనల లిస్టు పంపాను. సెలెక్ట్ చేసిన కీర్తనల లిస్టూ టైమూ వేసి పంపారు. రేడియో స్టేషన్నించే వచ్చింది వుత్తరం. (వుత్తరం తీసి చూపుతాడు)

(సత్యవతి తంబురా మూలగా వుంచి గది సద్దుతుంది)

శర్మ:- ఇదుగో డబ్బు ప్రయాణం ఖర్చులకీ. నెగ్గితే హైదరాబాద్ అంతా చూపించి మరీ తీసుకురా. పాపం శ్రద్ధా భక్తితో నేర్వటమేగాక చాలా గురు శుశ్రూషచేసింది. (చేతి కర్ర అందుకుని చెప్పులు యెక్కించుకుంటాడు)

నాగ:- అంటే నే శ్రద్ధ తీసుకోలేదంటావా? యెప్పటికప్పుడు రికార్డు చేసి, దాని పాట దానికి వినిపించి, తప్పులు చూపి అవి దిద్దుతూ నేను పాడి వినిపించి హైరాను పడలేదూ? దీనికోసం తెల్లవారుజామున లేవలేదూ?

శర్మ:- నేననలేదురా బాబూ. నీ మీద నిందవేయుటవేు నేనూ? మీద యీగవాలనీయవని తెలుసు. యేదో చిన్నపిల్ల చూడూ (సత్యవతి వేపు వెళ్లి వీపు తట్టుతాడు). అక్కడ హైదరాబాదులో బజారులో నీకేం గావాలన్నా బావ కొనిపెడతాడు. శేఖరం తోడు వస్తాడు. వీలుంటే నేను మిమ్మల్ని రేడియో స్టేషన్లో కలుస్తా. జాగర్తగా మసులుకోవాలి. బావ కనుసన్నలలో మసలాలి. యేం బావా! వెళ్లిరానా? (సత్యవతి తలవూపి, పెట్టే బెడ్డింగ్ అందుకుని మెట్లవేపు వెళ్తుంది).

నాగ:- నిశ్చింతగా వెళ్లిరా. నీ పెంపుడు చిలక్కేం భయం లేదు. అక్కడంతా పెద్ద మనుషులూ పండితులూనూ. సవ్యంగా జరిగిందీ లేనిది కనుక్కుని మరీ వస్తాము. రికార్డింగ్‌లేని ఆదుర్దా యిప్పుడెందుకూ? మైక్, పక్క వాయిద్యాలూ అన్నీ రిహార్సల్స్ వేశాం. నెగ్గితే అంటావేమిటీ? నావుర్దా. నెగ్గకపోతే చెవికదపాయించుకుంటాను.

శర్మ:- (నవ్వుతూ చెంపలేసుకుంటాడు) అపరాధం సరేనా. (కారు హారన్ వినబడుతుంది. ఇద్దరూ వాచీలు చూసుకుంటూ మెట్లు దిగుతారు).

4వ దృశ్యం

(చార్మినార్ దగ్గర కారు ఆగి వుంటుంది. దానిపక్కన నాగభూషణం నించుని వుంటాడు)

( ఒక పెద్ద మనిషి హడావుడిగా వస్తాడు )

పెద్దమనిషి:- హలో! నాగభూషణం గారూ! నమస్తే. మీరడిగిన సంగతి, ఫోన్ చేసి కనుక్కున్నాను. మీ విద్యార్థులిద్దరూ రేడియో ఆర్టిస్టుగా సెలెక్టయినారు.

ప్రోగ్రాం, టెస్టూ సవ్యంగా జరిగిపోయినై. మీరు తర్ఫీదివ్వటమూ, విద్యార్థులు సెలెక్టు కాకపోవటమూనా? అందులో మీ మేనగోడలనుకుంటా. యేమి శ్రావ్యమైన కంఠస్వరం. కోకిల. భయపడకుండా, శాంతగా. తొణక కుండా పాడింది. యేదీ ఆ అమ్మాయీ?

నాగ:- చాలా సంతోషం కలిగింది. కృతజ్ఞుడిని. శ్రమ అనుకోకపనిచేసుకొచ్చారు. దానికీ చెప్తా. గాజులు కొనుక్కుంటానని శేఖరాన్ని వెంటబెట్టుకుని అలా వెళ్లింది కొట్లవేపు.

పెద్దమనిషి:- అట్లా రెస్తారెంటుకు వెళ్దాం రండి.

నాగ:- ఇదుగో డ్రైవర్ కోసం చూస్తున్నా. కాఫీ కానిచ్చి రమ్మని పంపాను.

పెద్దమనిషి:- (చేతులు నలుపుకుంటూ) మీరేమనుకోకపోతే శేఖరం వివరాలు (నసుగుతాడు)

నాగ:- (నవ్వుతూ) వరాన్వేషణ చేస్తున్నారా? శేఖరం గృహస్థు అయినాడు. మా బావ, శర్మగారిని కలుసుకున్నారంటే మీకే రకం సంబంధం కావాలంటే అది చూపించి స్థిరపరచగలడు. మీరు యింటికి రండి (విజిటింగ్ కార్డు జేబులోంచి తీసి అందిస్తాడు)

పెద్దమనిషి:- (నవ్వుతూ అందుకుంటాడు) అవులిస్తే పేవులు లెక్కపెట్టేట్టున్నారండీ. నా వూహ మీకెట్లా తెలిసిందీ?

నాగ:- దీనికి పెద్ద మేధస్సు కావాలా? మనుషుల మాట తీరు చూసీ కట్టూ-బొట్టూ చూసీ, పర్సనాలిటీ చూసీ, యేకులమో, యే వూరో చెప్పలేమా? మునుపు పండితులు, మనిషి నడక చూసే వాడితత్త్వం చెప్పగలిగేవారట.

పెద్దమనిషి:- నా మటుకు నేను చెప్పలేను సుమండీ. పప్పులో కాలేస్తాను. నేను బ్రాహ్మడని వూహించినవాడు, బిసియో ముస్లిమో అవుతున్నాడు.

నాగ:- మీరు వాడి ఆచార వ్యవహారాలు చూసి అలా అనుకుని వుండాలి.

పెద్దమనిషి:- మీతో సంభాషణ మరీ జటిలమౌతున్నది. చూస్తే యేవూరి వాడోగూడా చెప్పేట్టున్నారు.

నాగ:- యెందుకు చెప్పలేమూ? చాలా తేలిక. మనుషులు వాడే పదాలు, తిట్లు విని గూడా చెప్పచ్చు. రంధ్రము, బెజ్జము, కన్నం, బొక్క యిన్నిరకాలు వాడుతారు.

పెద్దమనిషి:- (నవ్వుతాడు) వస్తా. పనివున్నది. మీ బావగార్ని మా యింటికి పంపుతారుగా?

నాగ:- మా బావకి స్వపర భేదం లేదు. రెక్కల కట్టుకు వాల్తాడు మీ యింట్లో. బావకి తన బిజినెస్‌లో చాలా యిష్టమూ సమర్ధతా వున్నాయి.

(పెద్దమనిషి చెయ్యి వూపి వెళ్లిపోతాడు)

(నాగభూషణం దూరానికి చూసేప్పటికి సత్యవతి వక్కతే వస్తూ కంటబడుతుంది. ఆదుర్దాగా వెళ్లి వెంటబెట్టుకొస్తాడు)

నాగ:- శేఖరమేడీ? వెధవ. ఒక్కతెనూ జనం మధ్య వదిలేశాడా?

సత్యవతి:- వాళ్ల చుట్టాలూ, స్నేహితులూ తారసపడి పిలుస్తే వెళ్లాడు. (తల తిప్పి అటూ యిటూ చూస్తుంది).

నాగ:- పిలుస్తే మాత్రం, ఆడపిల్లనూ సహాధ్యాయినీ కారు దగ్గర దింపి పోఖ్కర్లా? శుంఠ. తప్పిపోతే? (సత్యవతి చేతులో వందుకుంటాడు. కారు దగ్గర కొచ్చేస్తారు). పద. వెనక సీటులో కూచో. (కారు తలుపు తీసి పట్టుకుంటాడు)

(సత్యవతి సరిగా కూచున్నాక ఆ పిల్లపొట్లాలామెకిస్తాడు. అంతలో డ్రైవరొస్తాడు. తలుపు పట్టుకుంటాడు. నాగభూషణం కూడా వెనకసీట్లో కూచుంటాడు) (డ్రైవరు తలుపు మూస్తాడు) (ముందు సీట్లో చక్రం ముందుంటాడు).

డ్రైవర్:- సార్! ఎక్కడికి పోనీయమన్నారు?

నాగ:- (సత్యవతితో) శేఖరం కోసం ఆగాలా? హోటల్‌కి వస్తానన్నాడా?

సత్యవతి:- రానన్నాడు. ఆ వచ్చిన వారిలో అత్తవారివేపు వారున్నారు. మాతో వస్తాడన్నారు.

నాగ:- (విసుగ్గా చూస్తాడు. వెటకారంగా అంటాడు) అదా సంగతీ? ఇంటికి రానీ తప్పుడు వెధవని. నీక్కావాల్సినవన్నీ కొనుక్కున్నావా? ఊరు చేరాము.

సినిమా చూడాలనుందా?

సత్యవతి:- లేదు. హోటల్‌కి పోదాం.

నాగ:- (డ్రైవరుతో) హోటల్‌కి పోనీయవోయ్. న్యూతాజ్‌హోటల్. భోజనం కానిచ్చి స్టేషన్కి పోదాం. (కారు స్టార్ట్ అవుతుంది)

6వ దృశ్యం

(నాగ భూషణం యింటి ముందు కారాగుతుంది. సత్యవతీ నాగభూషణం దిగుతారు. తలుపుకి తాళం కంటబడుతుంది. నాగభూషణం విసుగ్గా చూస్తాడు. సత్యవతి తలెత్తి చూస్తుంది)

నాగ:- ఇదీ వరస. ఊరునించి వచ్చేప్పటికి, యింటి దగ్గరుండమనీ, లైట్లు వేసివుంచమనీ యెన్నిసార్లు చెప్పినా ఖాతరు చేయదు. వీధి దీపంలో నా తాళం చూసేదీ? (వెనక్కు చూస్తాడు) పద. ఆ కారులోనే హోటల్‌కి పోదాం.

సత్యవతి:- అక్కర్లేదు. చెప్పేది వినండి. 'వక్కత్తెనూ వుండలేను. యాత్రకెళ్తానేమో. వస్తే నేనే ముందు రావచ్చు. దీపం వేసి వుంచుతాను. దీపం లేకపోతే నేను రానట్టే. తాళం వేస్తాను. యెందుకైనా మంచిది డూప్లికేట్ నీ దగ్గరుండనీ. నీ చేతి సంచీలో పెట్టుకో. భద్రం' అని మారుతాళం చెవి నాకిచ్చారు అమ్మగారు. నా బాగ్‌లో వున్నది. తాళం తీస్తా. (చేతి సంచీ క్లిప్ నెట్టి అందమైన చిన్నపర్సు తీసి, దానిలోంచి తాళం చెవి తీసి తాళం తీస్తుంది. లోపలికి వెళ్లి లైటు వేస్తుంది. పక్కగది తలుపులు తీసి లైట్లు వేసి అన్నీ దులుపుతుంది. తక్కిన తలుపులు తీస్తూ లైట్లు వేస్తుంది. నాగభూషణం లోపలికి వెళ్లి కూచుని చెప్పులు ఊడదీస్తూ వుంటాడు. ఉత్తరీయం సోఫా మీద పడేస్తాడు. గుండీలు విప్పి షర్టు వూడదీస్తాడు. సత్యవతి వచ్చి వుత్తరీయం, షర్టు తీసి స్టాండు మీద వేసి వస్తుంది. తువాలా అందిస్తుంది. చెప్పులు తీసికెళ్లి చెప్పుల స్టాండు మీదు వుంచి వస్తుంది. నాగభూషణం జుట్టు దిద్దుకుని మొహం తుడుచుకుంటాడు. సత్యవతి ఆశగా అతని వంక చూస్తుంది. అతనది గమనించాడు. ఆలోచిస్తూ బాత్‌రూమ్ వేపు వెళ్తాడు. సత్యవతి అటే చూస్తుంది. డ్రైవర్ సామాను తెచ్చి హాలులో వుంచి

వెళ్తాడు.)

నాగ:- (మొహం తుడుచుకుంటూ వస్తాడు). ఈ బావేమైనట్టూ! ఇంత ఘనవిజయం సంపాయిస్తే, స్టేషన్‌కీ వచ్చినవాడు గాదు. ఇంటి దగ్గరాలేడు. యేం మనిషి?

(సత్యవతి తనను గమనించలేదనీ, తనతో మాటాడలేదని చిన్నబోయిన మొహంతో కుర్చీలు దులుపుతూ వుంటుంది)

(బయట కారు హారన్ వినబడుతుంది. శర్మ చేతి సంచీ, పెట్టెతో లోపలికి వస్తాడు. కారు వెళ్లిపోతున్న చప్పుడు.)

శర్మ:- (లోపలికి కొస్తూ) నాగన్నా! సత్యవతీ!

నాగభూషణం:- (సంతోషంతో యెదురెళ్లి కౌగలించుకుంటాడు)

(చేతులోవి అందుకుని పక్కగా వుంచుతాడు. సోఫాలో కూచోబెడతాడు. సత్యవతి బాత్‌రూమ్ తలుపు మూసి కర్టెన్‌లాగుతుంది. శర్మ సోఫాలో సద్దుక్కూచుని వుత్తరీయం తీస్తాడు.)

నాగ:- బావా! ఘనవిజయం. నువు స్టేషనుకన్నా యేడవలేదని విచారం గలిగింది. నీ చిలక ఫస్టుగా సెలెక్టయింది. కరెక్టుగా యిరవై అయిదు నిమిషాలలో చెప్పిన విధంగా పాడింది. విడిగా అందంగా పాడింది. కమిటీ వారి యెదుట. మనమంటే యేమనుకున్నావ్? ఇంక నీ సంపాదనా, కమీషన్ బందూ. నీ నోట్లో కరక్కాయే. (వీపు చరుస్తూ నవ్వుతాడు).

శర్మ:- (చెప్పులు వదిలేస్తాడు. సత్యవతి వచ్చి చెప్పులూ వుత్తరీయం తీసికెళ్తుంది)

శర్మ:- స్టేషన్కి యేడిచారా బావా. అక్కడి వుద్యోగులు మీరు మధ్యాన్నమే వెళ్లిపోయారని చెప్పారు. రైల్వేస్టేషన్లో రైలు కదిలిపోయింది. అందుకోలేకపోయినా. నా రైలు లేటు. పోనీలే అని జంక్షనులో చూశా. ఈ వూరిలో స్టేషనులోనూ చేశా. ఎక్కడా అందలా మీరు.

నాగ:- (సత్యవతి వంక ఓసారి చూస్తాడు). ఫ్రిజ్‌లో యేమన్నా వుందేమో చూడు. బావకి స్వీట్ తీసుకురా! (వెళ్లిపోతుంది) బావా! నీ మాటలు నమ్ముతాననే.

(దానివంకచూడకుండా నవ్వుతూ వెనక్కు వాలుతాడు నాగభూషణం. సత్యవతి అక్కడ బల్లమీదుంచి వెళ్తుంది. శర్మ తీసుకుంటాడు)

శర్మ:- మొత్తానికి నీ తడాఖా చూపావురా బావా? ఈ పందెం యింత సీరియస్‌గా తీసుకుంటావనుకోలేదు. నేను రేడియో స్టేషన్నించి వచ్చేస్తుంటే భాగవతార్ యెదురుపడ్డాడు. తన స్టూడెంట్స్ నలుగురూ అన్‌ఫిట్ అనుకున్నారని వాపోయాడు. (కప్పుబల్ల మీదుంచి, చెయ్యిజాపి సోఫామీద వాల్తాడు).

నాగ:- (పైకిచూస్తూ అంటాడు) యెందుకు సీరియస్‌గా తీసుకోననుకున్నావూ? పందెమంటే పందెమే రా బావా. బావ యేదీ బ్రహ్మదేముడయేదీ, మాట అంటే మాట నిలబెట్టుకుని గౌరవం దక్కిచ్చుకోవాలి. ఆఖరుసారిగా యెక్కువ కమీషన్ లాగావా లేదా? రెండులక్షల కట్నం స్థిరపరిస్తే యాభైవేలు నీకూ. అంతేనా.

శర్మ:- (నవ్వుతాడు) అంతివ్వరురా బావా. అయిదు వేలిస్తే గొప్ప. అంత కట్నం పోసేవాళ్ళుండద్దూ! వాళ్ళకి వరుడు నచ్చద్దూ (సత్యవతి ఫ్రూట్ సాలడ్ కస్టర్డ్ కలిపి కప్పూ సాసర్లూ వుంచుతుంది. వాళ్ళిద్దరూ ఒకళ్ళకొకళ్ళు అందించుకుంటూ సత్యవతిని గమనించరు. కొంతసేపటికి శర్మ చూస్తాడు)

శర్మ:- నువ్వుగూడా తీసుకో సత్యవతీ. రేడియో స్టేషన్లో నాకు తెలిసిన వాళ్ళంతా నిన్ను పొగడటమే. (నాగభూషణం వేపు చూస్తూ ఆనందంతో అంటాడు) ప్రతీ సంగీత విద్వాంసుడూ యింత పట్టుదలా అభిమానంతో శిష్యులకు నేర్పితే ఆంధ్రలో కూడా తమిళుల తలదన్నే సంగీత పండితులు లెక్కకు మిక్కిలి వుండకపోయారా అన్నారు (సత్యవతి తనను గురించి కాదని మొహం తిప్పేసుకుని వెళ్ళిపోతుంది). సంగీత శాస్త్రం ఆంధ్రుల సొత్తుకాక పోయిందా అన్నారు.

నాగ:- యేడ్చారు. నా ఒళ్లేమీ పొంగదు వాళ పొగడ్తలతో. (అటు తలతిప్పకుండానే పిలుస్తాడు) సత్యవతీ! వాకిలి వద్ద యెవరూ? డ్రైవరేనా? డబ్బు యీయటం మరిచిపోయినానేమో? మనిషి కనబడటం లేదూ. చూడూ నా లాల్చీ జేబులో పర్సుతీసి యిచ్చి పంపేయి. చెప్పాలా? (శర్మవేపు చూస్తూ అంటాడు) అసూయ అనేది ముందు మన మనసులోంచి తీసేస్తే, యెటువంటి ఘనకార్యాలైనా

సాధించవచ్చు. నీ కమీషన్ సంగతి చెప్పవేం? విని సంతోషిస్తా (మరికొంచెం అందుకుంటాడు) (సత్యవతి వీధివేపు వెళ్తుంది).

శర్మ:- బాగానే కొట్టాను. ఇప్పుడదిగాదు సంగతి. సత్యవతినేం చేయదలుచుకున్నావు?

(సత్యవతి లోపలికి వచ్చి గదివేపు వెళ్తుంది)

నాగ:- దానిష్టం. నాకింక దాన్ని గురించి బెడదలేదు. రాత్రి నిద్రబోతున్నా, దీని కోర్సు పూర్తిచేయగలనా? లేనా? అని యికబెంగలేదు. నిద్ర మెళుకువరాగానే, టైమెంత్తైందో, యిది సాధన చెయ్యలేదే, యిన్ని రాగాలు, కీర్తనలు, యెట్లా పర్ఫెక్ట్ అవుతాయి అనే ఆదుర్దాలేదు. నాకింకహాయి (కప్పు బల్లమీద పెట్టేస్తాడు, సోఫా కానుకుని కూచుని తల వెనక్కి వాల్చి, పైకి చూస్తూ హాయిగా నవ్వుతాడు. మళ్లా బావవంక చూసి నవ్వుతాడు) నిన్ను గురించే చింత. ఇంక నీ గతేమిటి. నీకెట్లా పొద్దుబోతుంది! (హాస్యం వెల్లడయేట్టు నవ్వుతాడు) సత్యవతీ! బావ పక్క దులిపి యిస్త్రీ దుప్పటి వేశావా? బావా! తిరిగే కాలూ తిట్టేనోరూ ఆగవని, నీ ప్రయాణాలెలా ఆపుకుంటావో చూడాలి (చెయ్యి గుండ్రగా వుంచి నోటికడ్డం పెట్టి నవ్వుతాడు)

(లోపలికి వెళ్లబోతున్న సత్యవతి ద్వారం పట్టుకునిలబడి, ద్వారం మీద చెయ్యి వుంచి, తల కొద్దిగా వంచి వింటూ నిలబడుతుంది).

శర్మ:- (నవ్వుతూ అంటాడు) నాతో పనివున్నవాళ్లు, నన్ను వదలరు రాబావా. నన్ను వెతుక్కుంటూ యిక్కడికే వస్తారు. నిన్ను గురించేనా భయం బుర్ర సరిగా లేకపోతే, డిస్టర్బు చేస్తున్నారనో, మర్యాదగా మాట్లాడటం రాదనో, ఉచ్చారణ సరిగా లేదనో, అధిక ప్రసంగం చేస్తున్నారనో కోపగించి, ఆ వచ్చినవాళ్ల మీద చెయ్యి చేసుకుంటావేమో, యేంజేతునా అని చూస్తున్నా. 'దుడుకుగల నన్నే దొరకొడుకు బ్రోచురా' (రాగ యుక్తంగా పాడుతాడు. దుడుకుగల నిన్ను అని మళ్లా పాడి నాగభూషణం వేపు చెయ్యిజాపుతాడు. వీపుమీద చరిచి మళ్లా వెనక్కు వాలి నవ్వుతాడు). యే రాగం రా బావా యీ కీర్తనా?

(నాగభూషణం యెదురుగా చూస్తూ నవ్వుతూ పిలుస్తాడు)

నాగ:- సత్యవతీ!

(సత్యవతి విసురుగా వచ్చి యెదురుగా నిలబడి నడుమున చేతులుంచుకుని చురచురా చూస్తుంది)

సత్యవతి:- (కర్కశంగా) యేటి కావాలా?

(శర్మ, నాగభూషణం ఆశ్చర్యపోయి నిటారుగా కూచుని సత్యవతిని చూస్తారు).

నాగభూషణం:- (మెల్లిగా నిదానంగా అంటాడు) కప్పులూ సాసర్లు తీసికెళ్లు.

సత్యవతి:- ( ఎకసెక్కంగా కటువుగా అంటుంది. చెయ్యి తిప్పుతుంది) నువే తీసికెళ్ల కడిగి అల్మర్లో పెట్టుకో.

(శర్మ, నాగభూషణం నవ్వుమొహంతో ఒకర్నొకరు చూసుకుంటారు)

నాగభూషణం:- (సత్యవతిని దిద్దాలని తాపీగా చెపుతాడు) మీరే కడిగి అల్మైరాలో పెట్టుకోండి అనాలి.

సత్యవతి:- (తల యెగరేస్తూ అంటుంది) యెట్లుంటేయేటిప్పుడు?

నాగభూషణం:- 'దుడుకుగల నన్నేదొరకొడుకు బ్రోచురా' అనే కీర్తన యొక్క రాగమేమిటని అడుగుతున్నాడు బావ. చెప్పు యే రాగమో. (శాంతంగా చూస్తాడు)

సత్యవతి:- నువే సెప్పుకో (మూతి విరుస్తుంది)

నాగభూషణం:- యేమన్నా పూనిందా నీకు? లేక మతిచలించిందా? ఎక్సైట్ అయినావా? అది సహజమేలే. చాలా హైరానుపడ్డావీ రెండున్నర సంవత్సరాలూ. (పరాకుగా చూస్తాడు. యేదో గుర్తు వచ్చినట్టు చూస్తాడు. ఆలోచించి మాట్లాడుతాడు). ఐస్‌క్రీమ్ తినమనలేదని కోపమొచ్చిందా? అహం దెబ్బతిన్నదా? గౌరవహాని జరిగిందా? అవమానం కలిగిందా? అంతా మేమే తినేశామనుకున్నావా? ఇంకా చాలా వుంది. ఇంద ( ఐస్ క్రీమ్, ఫ్రూట్ సాలడ్ కలిపి కప్పులో వేసి స్పూన్‌తో కలిపి అందిస్తాడు) కూచో.

సత్యవతి:- (గభీమని లాక్కుని విసిరేస్తుంది. గాజుగిన్నె పగిలిపోతుంది. అంతా

తీవాసీ మీద పడి పాడౌతుంది. గాజు ముక్కలు తివాసీ మీద పడతాయి.)
(శర్మ ఆశ్చర్యపోయి, నోరు వెళ్లబెట్టేస్తాడు)
(సత్యవతి కింద కూలబడి కళ్లు నులుపుకుంటూ యేడుస్తుంది. వెక్కిళ్ల మధ్య మాటలు వినబడతాయి.)
సత్యవతి:- నా గతేం గాను? నన్నెవరాదుకుంటారిప్పుడు? తోడుగా వుండే అత్తను వదిలి వచ్చాను. అది నన్ను మళ్లా రానిస్తుందా? ఆడి దగ్గరకే పో అంటుంది.
నాగభూషణం:- లే. కుర్చీలో స్థిరంగా కూచుని తీరిగ్గా యేడు సినిమానటి లాగా. కన్నీళ్లు రావటం లేదు. గ్లిసరిన్ చుక్కలు కంట్లో వేయమన్నావా? జాలుగా కన్నీళ్లు వస్తాయి. అనవసరంగా, ఖరీదైన చీర నలిగిపోతున్నది. ఎంతో ముచ్చటపడి కొనుక్కున్నావు. పైగా అది బావ సొమ్ము. ఎంత భద్రంగా చూసుకోవాలీ?
(నవ్వుతూ లేవదీయబోతాడు)
సత్యవతి:- (విదిలించి కొడుతుంది) అసలు నేనిక్కడికెందుకొచ్చాను? నన్నెవరు రమ్మన్నారు? ఆ మట్టి కొంపలోనే, పూరిగుడిసెలోనే యెందుకేడవలేక పోయినాను (చేతుల్లో మొహం దాచుకుని యేడుస్తుంది)
(శర్మ నోటమాటరాక, యిద్దర్నీ మార్చి మార్చి, చూస్తూ వుండిపోతాడు)
నాగభూషణం:- (తాపీగా అంటాడు) మతిబోయినట్టున్నది. సంగీతం నేర్చుకుంటానని వచ్చావు. గుర్తు చేసుకో. లేచిరా.
సత్యవతి:- (తలెత్తి యెఱ్ఱబడిన కళ్లతో నాగభూషణం వంకే చూస్తూ అంటుంది). నే మళ్లాపోయి ఆ చుట్టు గుడిశల మధ్య, అలగా జనం మధ్య వుండగలనా? తిరగ్గలనా? పోయి మళ్లా యేదైనా అమ్ముకురాగలనా? యెవరైనా కొంటారా?
నాగ:- ఎవరు తిరగమన్నారూ? (నవ్వుతాడు) ఎప్పుడూ అమ్మకమే గుర్తువస్తుంది నీకు. చూడగా సంగీతాన్ని చౌకగా అమ్మేసేట్టున్నావు.
సత్యవతి:- నువే యిదంతా చేసింది. నేనంటే ప్రేమా గౌరవం లేవు నీకు.
నాగభూషణం:- (విసుగేసినట్టు చూసి, పోయి శర్మ పక్కన సోఫాలో కూచుని, రెండుచేతులూ వెనక తలకింద ఆనించుకుంటాడు) విన్నావురా బావా దీని

సంధిపేలాపన? వెఱ్ఱికుదిరిందీ రోకలి తలకు చుట్టమన్నాడుట దీని తోటివాడు. (చివ్వున లేచి, సత్యవతి మీదికొచ్చి వంగి) ప్రేమా, గౌరవం లేవూ? అహా! హా! ఆ రెండూ లేకపోతే నీకు ఒక్క కీర్తన వచ్చేదా? యాస వదిలేదా? వర్ణాలు దాటేదానివా? సులభ పద్ధతులు యెన్ని నీకోసం కనిబెట్టానో నీకేమైనా తెలుసా? సరలీస్వరాల దగ్గర్నుంచీ ఎంత శ్రద్ధ తీసుకుని చెప్పానూ? 'మా బావ సీనియర్సుకే చెపుతా'డని బావ నీతో అన్నాడు గుర్తు లేదూ? యెవరికైనా కనీసం వర్ణాలన్నా మొదలుబెట్టి నేర్పానూ? ఒక్కడి పేరు చెప్పమను బావను. పిచ్చి మొద్దు. (పోయి కుర్చీలో కూచుంటాడు. తల వెనక చేతులుంచుకుంటాడు)

సత్యవతి:- అభిమానముంటే ఒక్కనాడన్నా నన్నెక్కడి కన్నా తీసికెళ్లారా? ఎపుడూ పెదబాబుగారే వెంటబెట్టుకెళ్లారు. శేఖరానికెప్పుడూ నాతో రావటానికి సంబరమే. నేనంటే యెంతో ప్రేమ. యే కీర్తన పాడినా మెచ్చేవాడు. మీరెప్పుడూ కసిరికొట్టటవే. ఎప్పుడూ తప్పులు పట్టటవే. ఒక్కనాడన్నా బాగా పాడావనలేదు.

నాగభూషణం:- ( ఆ పిల్లమాటలతో వినోదం కలిగినట్టు చూస్తాడు. నవ్వు నాపుకుని, వెటకారంగా అంటాడు). ఓహో! అదా సంగతీ! ఇపుడు బాగా అర్ధమైంది. శేఖరమల్లే నీ తోకబట్టుకు తిరుగుతూ, భట్రాజల్లే నిన్ను పొగడలేదనేనా, నీ అహంకారమంతా, నా యెదుట బైటబెట్టావు? బుద్ధి లేదూ? నీ అంతరాత్మ ఘోషబెట్టదూ? నే పొగడాలా నిన్నూ? యెంత శ్రద్ధ తీసుకోకపోతే అంత బాగా పాడగలిగాననే జ్ఞానమున్నదీ నీకూ? గడ్డి తింటున్నట్టున్నై నీ మాటలు. శేఖరంతో నన్ను పోలుస్తావా? ( ఉరిమి చూస్తాడు).

సత్యవతి:- (గోళ్లు గిల్లుకుంటూ వాటివంక చూసుకుంటూ అంటుంది) ఆ పిల్లనాదిలేసి నన్ను చేసుకుంటానన్నాడు.

శర్మ:- (అర్ధమైనట్టు నవ్వి తల పంకిస్తాడు)

నాగభూషణం:- ఓహో! అందుకా ఆ భ్రష్టుడు, నాగా పెట్టకుండా పాఠానికి హాజరయేవాడూ? నీ కిట్లాంటి వెఱ్ఱి వూహలు పుట్టించాడా? నీ తలలో తొలుస్తున్న

పురుగుయిదా? ఇంకా నీకేవో పెద్ద ఆశయాలున్నాయనుకున్నా.

శర్మ:– (జాలిగా సత్యవతి వంక చూస్తాడు) యేదో వయసొచ్చి, అలా ఆలోచిస్తున్నది నాగన్నా. యే యీడుకా ముచ్చటని, దాని తప్పేమున్నదీ.

సత్యవతి:– నేనతని కళ్లకి రంభల్లే కనబడ్డాట.

నాగభూషణం:– (చిరునవ్వు నవ్వుతాడు) శేఖరానికేనా?

సత్యవతి:– ( ఔనన్నట్టు తలకిందికీ పైకీ వూపుతుంది. నాగభూషణం వంక చూడదు)

నాగభూషణం:– రంభకి పొట్టపొడిస్తే అక్షరం లేదూ, నిగ్రహమసలే లేదూ. కాస్తకీ కూస్తకీ ఉద్రేకపడి తాను నాల్గవ జాతి స్త్రీనని బైటబెట్టుకుంటూ వుంటుంది రంభ (హేళనగా నవ్వుతాడు).

శర్మ:– నువ్వనేదంతా నిజంగాదురా బావా. చదువూ అంత శ్రద్ధగా నేర్పితే, అదీ వచ్చేదే. యేదో నువు చనవు యిచ్చావు. నీ దగ్గరున్న చనువుకొద్దీ బైటపడుతుందంతే. (నవ్వుతూ చూస్తాడు)

సత్యవతి:– పెదబాబుగారెప్పుడూ మర్యాదగా దయగా మాట్లాడుతారు. ఒక్కనాడు గూడా తిట్టలేదు, కసిరికొట్ట లేదు. పెద్దింటి పిల్లను చూసినట్టు చూశారు. (మూతి ముడుచుకుంటుంది).

నాగభూషణం:– ఇంకేం. బావను పెళ్లాడు. బావకేం. శేఖరం కన్నా చాలా మెరుగు. పెళ్లాం లేదు. బోలెడు డబ్బు వెనకేశాడు. అదంతా నీ కోసమే. చూశావుగా యెట్లా విచ్చలవిడిగా నీ కోసం ఖర్చు చేశాడో. బావకి వర్ణభేదం లేదు సరిగదా, జాతి భేదం గూడా లేదు. అన్ని విధాలా తనమీద ఆధారపడేదైతే చాలు కోతిని పెళ్లాడటానిక్కూడా వెనుదీయడు (నవ్వుతాడు. శర్మకీ బాగా నవ్వు వచ్చి నవ్వుతాడు).

సత్యవతి:– (మోకాళ్ల మీద తలవాల్చి, తల ఆడిస్తూ యేడుస్తుంది)

శర్మ:– (నాగభూషణం వీపు మీద చరుస్తూ హాస్యాలాడుతాడు) నేనొద్దుటరా బావా? నువ్వే కావాలిట.

నాగభూషణం:- (ఔనన్నట్టు) కరివేపాకమ్మనే పిల్ల యెప్పుడు తటస్థపడతుందా, అని గదూ, తహ తహలాడుతూ, యిన్నాళ్లూ బ్రహ్మచర్యం గడిపానూ! (సత్యవతితో) ఇంకా యేడుపెందుకూ? నీ మనస్సులో యేమున్నదో బావ చెప్పేశాడు. (శర్మతో) ఏరా బావా! యిన్ని పెళ్లిళ్లు చేశావు గదా, యీ పాటికి నీకు పెళ్లి మంత్రాలూ, తతంగం అంతా తుచ తప్పకుండా వచ్చి వుండాలి. (సత్యవతితో) బావ పెళ్లి మంత్రాలు చదివితే చాలా, లేక, పురోహితుడే కార్యక్రమం నడపాలా? పురోహితుడే కావాలంటే నీ పెళ్లి వాయిదా పడుతుంది.

సత్యవతి:- (హేళన చేస్తున్నాడని అర్థమై చివ్వున లేచినుంచుంటుంది) (కళ్ల నీళ్లు జలజలా రాలుతూ వుంటై. చేతులు తిప్పుతూ అంటుంది) నిన్నెవతె చేసుకుంటుందీ? యెప్పుడెక్కిరిస్తూ వుంటావు. దయా, జాలీ, కరుణా, అనేవి నీకు తెలియవు. మర్యాదగా మాట్లాడటమే రాదు నీకు. బుద్ధున్న వాళ్లెవరూ నిన్ను చేసుకోరు. నిన్నెవరూ ప్రేమించరు. వెక్కిరికొక్కర్లాడుతూ వుంటావు.

(సత్యవతి అలా అంటుంటే నాగభూషణం నవ్వుతూ వినోదిస్తూ వుంటాడు)

నాగభూషణం:- అబ్బో! చాలా తెలివితేటలబ్బినై. చాలా భాష వచ్చింది. ప్రేమంటే యేమిటసలు? ముందది చెప్పు. నన్నెవరూ ప్రేమించరిలా. బావకు నేనంటే యెంతో ప్రేమ. లేకపోతే నా తెలివితేటలకీ సమర్థతకీ పరీక్ష పెడతాడా? ఇన్ని సంవత్సరాలాయె. ఒక్కనాడు గూడా తనను పెళ్లాడమని సూచించలేదు. అదొక గొప్ప నిదర్శనం.

శర్మ:- (నిద్ర వస్తున్నట్టు సూచిస్తూ ఆవలించి చిటిక వేస్తాడు. కళ్లు బరువుగా వుంటాయి) బావా! నేను మీడమీదికి పోతున్నా. మీరిద్దరూ తెల్లవార్లూ వాదించుకోండి. జరమొచ్చిందో యేమో తల పగిలిపోతున్నది. నీ వయస్సులో సగం వయస్సు దానిది. నీ కల్చరు వేరు. దాని పెంపకం వేరు. నువ్వనేది దాని కర్థమౌతుందా? (వుత్తరీయం అందుకుని వెళ్లిపోతాడు).

(సత్యవతి శర్మ వెళ్లిన వేపే చూసి నాగభూషణాన్ని చూస్తుంది)

నాగభూషణం:- నేనూ పోతున్నా. లైటేసుకుని యింటికి కాపలా కాయి

తెల్లవార్లూ.

సత్యవతి:- (తివాసీ మీద పడిపొర్లుతూ యేడుస్తుంది) నాగతేం గాను? నాకెవరున్నారు? నేనెవరికెక్కవాలి?

నాగభూషణం:- (నవ్వుతూ) నాకు జ్యోతిశ్శాస్త్రం రాదు. లేకపోతే ముందు ముందు నీగతేమిటో లెక్కవేసి చెపుదును. అయినా, అర్ధరాత్రి అంకమ్మ శివాలని యీ యేడుపేమిటి? విశ్రాంతి తీసుకో.

సత్యవతి:- (యేడుపు పెద్దది జేస్తుంది)

నాగభూషణం:- (మీదికి వస్తూ) గొంతు పిసికేస్తా పెద్దగా యేడిచావంటే. అఘాయిత్యం చేసి లొంగదీద్దామనా? యేదో ఒకసంబంధం బావ చూస్తాడులే నీకు. బోడిపెళ్లీ నువ్వూ. ప్రోగ్రామ్ కొట్టానని గర్వపడటం పోయి అర్థం లేని యేడుపందుకున్నావు (మెట్లవేపు వెళతాడు. చప్పుడు విని వెనక్కి తిరిగి చూస్తాడు).

సత్యవతి:- పిసికేయండి. పీడ విరగడౌతుంది. (లేచి బల్లమీదున్న పేపర్ వెయిట్ తీసి, గోడకేసి విసురుతుంది. అక్కడున్న ఫొటోకి అది తాకి, ఫొటో ముక్కలై కిందపడుతుంది).

నాగభూషణం:- (సీరియస్‌గా చూస్తాడు) మెంటల్ హాస్పటల్లో చేరుస్తా ఒళ్లు దగ్గర పెట్టుకోకపోతే (గబగబ మెట్లెక్కి వెళ్లిపోతాడు పైకి)

(గడియారం పన్నెండుగంటలు కొడుతుంది. సత్యవతి కొంగు మొఖానికడ్డం పెట్టుకుని యేడుస్తుంది)

7వ దృశ్యం

(తెల్లవారుజామున 5 గంటల వేళ. కారు ఆగిన చప్పుడు. తల్లి కామేశ్వరమ్మ దిగి, డ్రైవరు చెప్పగా బాడుగ చెల్లించి, తన సంచీ, చిన్న పెట్టె తెస్తుంది. ఇంటి తలుపుకి తాళం లేక పోవటం కంటబడుతుంది)

కామేశ్వరమ్మ:- (తలుపు తట్టుతూ) నాగన్నా, సత్యవతీ! శర్మా! యేమర్రా యెవరూ పలకరేం. వచ్చి జాముసేపాయె. మంచుపడుతున్నది.

కారుడ్రైవరు:- అమ్మగారూ అటు వెళ్లి కిటికీలోంచి పిలవనా (దిగివస్తాడు)

కామేశ్వరమ్మ:- వద్దు. అదుగో లైటు వెలిగింది. అబ్బాయి వస్తున్నట్టున్నాడు.

(నాగభూషణం నిద్రకళ్లతో వచ్చి తలుపు తీస్తాడు)

నాగ:- సత్యవతిని పిలవలా? డ్రైవర్ని ఆ గదివేపు వెళ్లి పిలవమనకపోయినా? (డ్రైవరుతో) సామానుడిక్కీలో వున్నదా? తెచ్చి యింట్లో పెట్టు.

కామేశ్వరమ్మ:- పిలిచాను. పలకలేదు. ( ఇంట్లోకి పోతుంది)

నాగ:- నేను మేడమీదికి పోతున్నా. తలుపేసుకో. మేము ముగ్గురము గూడా రాత్రే వచ్చాము. నిద్ర కొరిగేప్పటికి అర్ధ రాత్రయింది. సత్యవతికి మెళుకువ రాలేదేమో. బావకు ఒంట్లో బాగా లేదన్నాడు. (డ్రైవరు సామానుంచి, సెల్యూట్ కొట్టి పోతాడు. కామేశ్వరమ్మ వీధి తలుపుమూసి, లైటు తీసి, యింట్లోకి లైట్లు వేసుకుంటూ పోతుంది).

(అదే టైమ్‌లో 6 గంటల వేళ సత్యవతి మార్కెట్ వేపు సందుగొందులగుండా నడిచి వెళ్తుంది. కూరలు, పువ్వులు, కరివేపాకు, కొత్తి మేర, దొండకాయలు కేకవేస్తూ కూరలమ్మే పిల్లలు వారికేకలూ వినబడతై). పొగమంచు వల్ల మనుషులు ఒకరికొకరు సరిగా కనబడరు. పాత చీరలు, పాత దుప్పట్లు, గోనెలు, బుజాల మీద కప్పుకుని పిల్లలు పరుగెత్తుతూ వుంటారు. సత్యవతి యీడుపిల్లలూ వస్తూ వుంటారు. నెత్తిమీద బుట్ట, దానిలో ఆకు కూరా, పువ్వులూ. సత్యవతి కొంగునెత్తి మీదిగా వేసుకుని దిగులుగా చూస్తూ నడుస్తూ వుంటుంది. చాకలి వాళ్లు బట్టలు పిండుతూ ఆరేస్తూ చూస్తారు.)

1వ పిల్ల:- బంతిపూలు కావాలా సిన్నమ్మా! పోనీ గన్నేరు, మందార, గులాబీ, జూకామల్లె, శివలింగపూవు. (దగ్గరగా వచ్చి పువ్వు అందిస్తూ తలెత్తి సత్యవతి మొహం వంకచూస్తుంది. 'సత్తీ!' అనబోయి ఆగిపోతుంది. దుస్తులూ అలంకారం చూసి వెనక్కు తిరుగుతుంది. మరొకపిల్ల వస్తుంది. ఇద్దరూ సాగిపోతూ గుసగుసలాడుతూ తలలు దగ్గరగా పెట్టనూ, వెనక్కి చూడనూ చేస్తారు. సత్యవతి ఒక యింటి ముందు దీప స్తంభం ఆనుకుని నిలబడిపోతుంది.)

1వ పిల్ల:- సత్తేమోనే. ఇన్నాళ్లేడున్నదో?

2వ పిల్ల:- ఊరుకో. మడుసులు బోలిన మడుసులుంటారు. సత్తి అయితే గురుతించి పలకరించదా? గమ్మునుంటదా? ఎంత సరదాగుండేది. యేం తెచ్చినా మనకి పెట్టంది తినేది గాదు. పోదాం రా.

(సత్యవతి కళ్లు తడి అవుతాయి. వాళ్లని చాలా దూరం వెళ్లనిచ్చి, ముందుకు నడుస్తుంది, సైకిల్ రిషా యెదురుగా వస్తుంది. ''బండెక్కరా?'' అని దీనంగా చూస్తాడు. అర్ధ రూపాయి బిళ్ల పర్స్ నించి తీసి యిస్తుంది. బండి వద్దని తల అడ్డంగా తిప్పుతూ ముందుకెళ్లిపోతుంది. మార్కెట్ రహదారి మీదికొచ్చేప్పటికి ఒకరిద్దరు ముసలివాళ్లు తారసిల్లి యెగాదిగా చూసి తమ పనులమీద వెళ్లిపోతారు. నడిచీ నడిచీ, సూర్యోదయం వేళకి పార్క్ చేరుతుంది. రాతి బల్లమీద కూచుంటుంది. తోటమాలి వచ్చి పూలగుత్తి యిస్తాడు. తీసుకుని వాసన చూస్తుంది. పర్స్ తీసి రూపాయిస్తుంది. ఆశ్చర్యపోతాడు. చిల్లర యివ్వక్కర్లేదన్నట్టు చెయ్యి సుతారంగా అందంగా తిప్పుతుంది).

(అదే రోజు సమయం 7.30 గం॥. నాగభూషణం గోడకున్న అద్దంలో చూసి తలదువ్వుకుంటూ వుంటాడు)

(శర్మ తన పక్క మీద కదులుతాడు. వత్తిగిలి పడుకుంటాడు).

నాగభూషణం:- బావా! బావా! మెళుకువ వచ్చిందా? ఈ దుర్వార్త విన్నావా? సత్యవతి చెక్కేసింది. అమ్మ ఒకటే విధంగా పిలుస్తూనే వున్నది. జవాబు లేదు.

శర్మ:- (ముసుగు తొలగించి, బరువుగా వున్న కనురెప్పలెత్తి చూస్తూ అడుగుతాడు) అత్తయ్య యెప్పుడొచ్చింది? సత్యవతి యెక్కడికెళ్లి వుంటుందంటా?

నాగ:- యేమో. ఇంట్లో వుంటే పలకదూ? ఇంత పొద్దెక్కేదాకా నిద్రబోతూనే వుంటుందా?

శర్మ:- (లేవకుండానే అంటాడు) చచ్చామే. ఇంత పెద్దపట్నంలో, యెక్కడని, యెంతసేపని వెతగ్గలం? చీటీ యేమైనా పెట్టిందా?

నాగ:- (నవ్వుతాడు. మంచం దగ్గర కొస్తాడు) దానికి వేలుముద్ర యెలా వేస్తారో గూడా తెలియదు. చీటీ యెలా పెడ్తుందీ? లే. కాలకృత్యాలు తీర్చుకో.

శర్మ:- లేవలేనురా.

నాగభూషణం:- (శర్మ నుదుటిమీద చెయ్యిపెట్టి చూస్తాడు) టెంపరేచర్ వున్నది బావా. ఏమి జ్వరమో. ఉండు డాక్టరుకి ఫోన్ చేస్తా.

శర్మ:- (వెల్లికలా పడుకుని గుండెలమీద చేతులుంచుకుంటాడు) చచ్చాం పో. ఉట్టి జలుబేమో. డాక్టరెందుకు లేరా.

నాగ:- (విసుగ్గా చూస్తాడు) ఉట్టి జలుబు జ్వరమైతే అంత తీవ్రంగా వుంటుందా? సమయానికీ సత్యవతి వుడాయించిందే. లేకపోతే, చెప్పించుకోకండానే, నిమిషాల మీద పనిచేసి చూపేది. ఈ పాటికి డాక్టర్ని తెచ్చేది. యెక్కడేడుస్తున్నదో. ఫూల్. పోలీస్ స్టేషన్కి ఫోన్ చేస్తా (వెళ్లబోతాడు).

శర్మ:- చచ్చాం. తొందరపడకు. వాళ్లొచ్చి సత్యవతి వొంటి మీద నగలున్నయ్యా? యెవడన్నా బాయ్ ఫ్రెండున్నాడా అని మతిలేని ప్రశ్నలు వేస్తారు బావా.

నాగ:- (నవ్వుతాడు. దగ్గరకొస్తాడు) మరిచావటం మానేసి లేచి, యేం చేయాలో ఆలోచించాలి.

శర్మ:- యేం చేద్దామంటా?

(కామేశ్వరమ్మ పైకి వస్తుంది)

కామేశ్వరమ్మ:- లే శర్మా! కాఫీ చల్లారిపోతున్నది. ఇంకా పడుకునే వున్నావేం? కిందికి వస్తారని చూస్తూ, పనితెమలక నేచస్తుంటే. రాత్రల్లా ప్రయాణం. నిద్రలేదు.

నాగ:- బావకి ఒంట్లో బాగా లేదమ్మా. జ్వరం తాకింది. సత్యవతిని కేకవేశావా? అన్ని గదులూ చూశావా?

కామేశ్వరమ్మ:- చూశాను. లేదు. వెంటయేమీ తీసికెళ్లలేదు. నగలు, బట్టలు అన్నీ పెట్టెలో సర్ది, స్టోర్ రూములో వుంచింది. తలుపులు లోపల గడియలున్నాయి గదా, యిల్లు వదిలి యెలా వెళ్లిందో! మీరిద్దరేమైనా అనలేదు గదా దాన్ని?

నాగభూషణం:- అనేదాకా యెక్కడా? అనేందుకేమున్నదసలు? మతిబోయినట్టు యేడుపులంకించుకున్నది. ఊరికేనే రెచ్చిపోయింది. నువ్వు చేసుకోమని తల విసిరింది. కదురా బావా?

శర్మ:- (లేచి కూచుంటాడు) నే పైకి వెళ్లిపోయింతర్వాత నువేమైనా అన్నావా దాన్ని? కొక్కరించావా?

నాగ:- (విసుగ్గా చూస్తాడు) నన్నే మననిచ్చిందీ? అదే అన్నీ అనేస్తూ, పేపర్ వెయిట్ విసిరింది. చూపిస్తారా.

కామేశ్వరమ్మ:- వేణ్ణీళ్లు పెట్టాను. శర్మా. మొహం కడుక్కొని, ఒళ్లు తుడుచుకుని, యేమైనా తినాలి. నీరసించావు. లేచిరా.

(ముగ్గురూ కిందికి వెళ్లుతారు)

(రెండు రోజుల తర్వాత)

(సన్నని వాన తుంపర ఆపకుండా పడుతూ వుంటుంది. రోడ్లమీద కార్లు వస్తూపోతూ వుంటాయి. శర్మా, నాగభూషణం కారులో వెళ్తూ, స్లోగా పోనిస్తూ పరిశీలనగా చూస్తూ వుంటారు. నాగభూషణం డ్రైవ్ చేస్తూ వుంటాడు. అద్దం తుడిచే యంత్రం పనిచేస్తూ వుంటుంది. నిరాశా, ఆదుర్దా కనబడతై వారి మొహాల మీద. నాగభూషణం పెదిమలు విరుస్తూ చికాకు పడతాడు. ఫుట్‌పాత్ మీదున్న వాళ్లను చూస్తాడు)

నాగభూషణం:- ఎక్కడికి వెళ్లి వుంటుందీ? వాళ్ల యిళ్ల వేపు వెళ్లి వాకబ్ చేస్తే యిటుకేసి రాలేదన్నారు.

శర్మ:- (సీటు వెనక భాగానికి ఆనుకుని చేతులు పైకి వుంచుతాడు) యేమోనబ్బా. కొరివితో తలగోక్కున్నట్టున్నది. పిల్లిని పెంచితే మమకారం పెరుగుతుందిట. ఇది ఆడపిల్లతో వ్యవహారమని ముందే మనవి చేశానీకు.

నాగ:- నేనిదివరకు ఆడవాళ్లకు తర్ఫీదివ్వలేదూ?

శర్మ:- వాళ్లు దిక్కులేనివాళ్లు గాదు. పెద్దల వెనక వుండి, పిచ్చి ఆశలు పెంచుకోకండా నేర్చారు. వాళ్ల ఆశయం ప్రోగ్రామివ్వాలని. ఆ పార్కులోకి పోనీ.

గేటు తీసివున్నది. వాన వెలుస్తుంది. ఇంటికి పోదాం ఇవాల్టికి వెతకటం చాలు. (కారు ఆపి దిగుతారు. వాచ్‌మన్ వచ్చి సెల్యూట్ కొడతాడు)

వా:- యేమైనా కావాలా సార్? దగ్గర్లో కాంటీనుంది. వైను షాపున్నది. సినిమా హాలున్నది. కారుతుడవమన్నారా? ఆ మూల కుర్రాడు బూట్ పాలిష్ చేస్తాడు.

నాగ:- వేడి కాఫీ రెండు కప్పులు పట్టించుకురా. చాలు (డబ్బు తీసి యిస్తాడు) యీ రాతి సోఫా మీద కూచుందామా బావా? నీ తలనెప్పీ జలుబూ తగ్గినాయా?

శర్మ:- (సోఫాకు జారగిలబడి కూచుంటాడు) పూర్తిగా తగ్గలేదు. అదుగో కాఫీ వచ్చేసింది. అందుకో.

నాగ:- (కాఫీ ట్రే అందుకుంటాడు. తెచ్చిన మనిషి వెళ్లిపోతాడు. ఒకటి రెండు అడుగులేసి సోఫా దగ్గరకు వస్తుండగా బూట్ కింద యేదో గట్టిగా తాకుతుంది. ట్రే శర్మ పక్కనుంచేసి, వంగి తీసి యిస్తాడు. అది రాళ్ల గాజు ముదురు నీలం రాళ్లు) బావా యిది సత్యవతిదే అయి వుండాలి. ఇది హైదరాబాదులో కొనుక్కున్నది. అక్కడే చేతులకు యెక్కించుకుని వచ్చింది. మెరుస్తుంటే కంటబడింది గాజు. ఈ గాజు లోపలివైపు గిల్టు యింకా మాసిపోలేదు చూడు. (శర్మకి అందిస్తాడు) (శర్మ పరిశీలనగా చూస్తాడు. గాలికి కదులుతూ రుమాలా, లాన్సు మీద వుండి కంటబడుతుంది) (అటు చూస్తాడు శర్మ. నాగభూషణమూ చూస్తాడు.)

నాగ:- (కర్చీఫ్ అందుకు పరిశీలిస్తాడు) ఇదీ దానిదే యీ పూలూ, బొమ్మ కుట్టిన కర్చీఫ్ పర్స్‌లోంచి తీసింది. దీనికే యింటి తాళం చెవి ముడివేసిపోకుండా చేతి సంచీలో పెట్టుకున్నది. ఈ సెంట్ ఉడుకొలాన్ అదే వాడుతుంది. ఇక్కడికి వచ్చి కూచుని వెళ్లి వుంటుంది (వాచ్‌మన్, కుర్రాడూ వస్తారు).

శర్మ:- (తన కప్పులోని కాఫీ మెల్లిగా పూర్తి చేస్తాడు) రెండు లేక మూడు రోజుల క్రితం ఓ యిరవై యేళ్ల అమ్మాయి యెవరైనా వచ్చి యిదే రాతి సోఫా మీద కూచుని వెళ్లిందా? యేమైనా మాటాడిందా?

నాగ:- నేరాలు చెప్పి యేడిచి తిట్టి హిస్టీరియా బైటబెట్టుకున్నదా? (నవ్వుతాడు)

శర్మ:- నువ్వుండరా బావా నీ హాస్యమూ నువ్వూ. వాళ్లకి పూర్వాపరాలూ తెలియవు. నీ హాస్యం అర్థమై చావద్దూ? యేం నాయనా వచ్చి వెల్లిందా? యెంత సేపున్నది? యేమైనా తిన్నదా? పోనీ తాగిందా? ఇంద యీ ట్రేలో కాఫీ నువ్వు తాగు. యీ డబ్బు తీసుకో. మీరిద్దరూ కాఫీ టిఫిన్ కానీయండి (డబ్బు యిస్తాడు)

(వాచ్‌మన్, కుర్రాడూ డబ్బు అందుకుంటారు. ఒకరి మొహాలొకరు చూసుకుంటారు)

వాచ్‌మన్ లేదా తోటమాలి:- తమ దయ. వచ్చింది బాబు గారూ. ఒకమ్మాయి వచ్చింది. యేమీ మాటాడ లేదు. చూస్తూ కూచున్నది. పూల గుత్తి యిస్తే రూపాయి బిళ్ల యిచ్చింది. యేమీ మాటాడలేదు. అమ్మాయిని యాడో సూసినట్టుండె. కాని యెంతసేపటికి గుర్తు రాలేదు. నా పనిమీద నేను యెల్తిని. యెప్పుడెల్ళి పోనాదో మరి. నేసూడనేదు.

శర్మ:- యెటెల్లింది? బండెక్కిందా?

నాగ:- కారు పిలిచిందా? దానికి కారు అలవాటైందే. బండెక్కుతుందీ? గొప్పదాన్నైనానని అనుకుంటుంది. నేను గదా దాన్ని గొప్పదాన్ని చేసింది.

శర్మ:- కాసేపు గుణ్ణాన్ని కట్టేయరా బావా. చెప్పునాయనా. పోనీ ఆటో రిక్షా ఎక్కిందా?

కుర్రాడు:- లేదు బాబుగారూ నడిచే యెల్లింది. కళ్లు తుడుచుకుంటూ యెల్లింది. ఇంగేమీ తెల్దు. ఎల్లమా?

శర్మ:- వెళ్లండిద్దరూ. చాలు ఇన్‌ఫర్మేషన్. (అయిదు రూపాయల నోటు అందిస్తాడు. వాళ్లు తీసుకుంటారు. దణ్ణం పెట్టి వెళ్తారు.)

శర్మ:- పదరా బావా. ఇంటికెల్లి సాపాటు కానిచ్చి మళ్లా అన్వేషిద్దాం. వూళ్లోనే తిరుగుతూ వుండివుండాలి.

6వ దృశ్యం (3వ అంకం)

(శర్మా, నాగభూషణం యింట్లో కొస్తారు. నిలబడిపోతారు. కామేశ్వరమ్మ

సత్యవతిని వూరడిస్తూ కంటబడుతుంది)

శర్మ:- ( ఆదుర్దాతో అడుగుతాడు) ఎక్కడ కనిపించిందత్తయ్యా! బతికాం పో. పోలీసులదాకా పోలేదు వ్యవహారం. యేమైనా తిన్నదా? తాగిందా? స్నానపానాదులయాయా? (దగ్గరకెళ్లి చూస్తాడు)

(సత్యవతి నేలమీద తివాసీ మీద పడుకుని వున్మాదిల్లా లేచికూచుంటుంది. వడలిపోయి కనిపిస్తుంది. జుట్టు దువ్వక పోవటం వల్ల రేగివుంటుంది. వాడిన పూలదండ వేలాడుతూ వుంటుంది. బట్టలు మాసి వుంటాయి)

నాగ:- (తల్లితో) యెక్కడ కనబడితే పట్టుకొచ్చావీ కూరల సంచీనీ? యెట్లా వచ్చిందసలు నీతో? సిగ్గులేదూ? చెప్పకుండా పారిపోయెగా? బంక మెదడు. బావ తన పెంపుడు చిలక్కోసం యేడుస్తాడని తెలియదూ? ఫూల్. యెంత పెట్రోల్ ఖర్చయిందీ? యెంత శ్రమ, టైమ్ వేస్టు అయిందో వృథాగా (సత్యవతిని వురిమి చూస్తాడు) యెవడెళ్లమన్నాడూ? యెవడు తోలేశాడు? మళ్లా యెందుకొచ్చావూ? యెవడు రమ్మన్నాడిక్కడికీ?

(సత్యవతి లేచి కామేశ్వరమ్మ వెనక్కిపోయి కూచుంటుంది. యేడుపు మొహం పెడుతుంది. కామేశ్వరమ్మ వెనక్కి తిరిగి చూస్తుంది)

కామేశ్వరమ్మ:- (దెప్పుతున్నట్టు చేతులు తిప్పుతుంది) నాగన్నా! ఊరుకుందూ! నీకు యేళ్లు పైబడకొద్దీ బుద్ధీ జ్ఞానం లేకుండా పోతున్నాయి. కుర్రచేష్టలూ. అర్థం పర్థంలేని మాటలు. నీకింక పెద్ద మనిషి తరహా అలవడదేమో! దురుసుగా మాట్లాడితే గొప్పవాడివైనావా? ఔతావా?

శర్మ:- పోనిద్దూ అత్తయ్యా. కనిపించిందిగా. ఎక్కడ కనిపించిందీ? (సత్యవతితో) సత్యవతీ! అలా వెళ్లిపోయావు గదా. వెతుక్కోమూ? పోయి స్నానం చేసి మంచి బట్టలేసుకుని జడేసుకుని, పూలుపెట్టుకురా. (కామేశ్వరమ్మ వంక చూస్తాడు. ఆమె సత్యవతి వంక చూస్తుంది. సత్యవతి లేవదు).

(శర్మా, నాగభూషణం సోఫాల్లో కూచుంటారు. నాగభూషణం కాళ్లు జాపి ఒక కాలుమీద ఒక కాలుంచి ఆడిస్తూ వుంటాడు. చేతులు కలిపి, తల వెనక

పెట్టుకుంటాడు)

కామేశ్వరమ్మ:- మీరిద్దరూ వెళ్లి యెంతకూ రాలేదు. వెంకటేశ్వరుని పూజించి, బంగారు పాదాలు చేయించి అర్పిస్తానని మొక్కుకుని, గుడికి బయలుదేరాను.

నాగ:- చూశావా సత్యవతీ? యెంత డబ్బు వేస్టు అయిందో. ఫూల్. నేను నిన్నేమీ అనందే, వీళ్లిద్దరూ నన్ననుమానించారు. నిన్నేదో చేశానని (నవ్వుతాడు)

శర్మ:- (కామేశ్వరమ్మ వేపే చూస్తాడు)

కామేశ్వరమ్మ:- మెట్లు యెక్కలేకపోయినా. పూజచేయించి రెండవవేపు నించి మెట్లు దిగుతున్నా. నాలుగు మెట్లకింద యిది పడిపోయివున్నది. లేవదీసి, యింత ధారకం పోసి ఆటోలో తెచ్చా. అదేం చెప్పలేదు. మీరొచ్చేశారు. (సత్యవతితో) పో, పోయి, స్నానం చేసి వుతికిన గుడ్డలేసుకుని జడేసుకురా.

నాగ:- దానికి తెలియదూ? మీరిద్దరూ వేడుకోవాలా? సత్యవతీ? నీకీ మర్యాదలన్నీ చేయాలా? నీకు ఫార్మాలిటీస్ యింత యిష్టమని నాకు తెలియదే. నేను గూడా వేడుకోవాలా? బ్రూట్ (నవ్వుతాడు)

సత్యవతి:- (లేచి నుంచుంటుంది) నువేం చెప్పక్కర్లా. ఆల్లనూ నేనడగనేదు. నన్నెవరూ వేడక్కర్లేదు.

నాగ:- (నవ్వుతాడు) నిన్ను పుఠంబెట్టినా ఆ భాష వదలదు. నాకిదో వుద్యోగం నిన్ను దిద్దుతూ వుండాలి.

(సత్యవతి గిరుక్కున తిరిగి వెళ్తుంది. దొడ్లో గిన్నెల చప్పుడు. నీళ్ల చప్పుడు. అన్నీ కడిగి బోర్లించి, స్నానం, జడా కానిచ్చి వస్తుంది. కామేశ్వరమ్మ సోఫాలో కూచుని వుంటుంది. ఆమెకాళ్ల వద్ద, కింద తివాసీ మీద కూచుంటుంది సత్యవతి)

నాగ:- అప్పుడే అన్ని పన్లూ చేశావూ? తిండీ తిప్పలు లేవుగా? యెలా చేశావూ? మళ్లా వుడాయించే ఆలోచనలో వున్నావా? యేమి చేసినా చెప్పి చేయాలని తెలియదూ? ప్రోగ్రామ్‌కి తిలోదకాలిచ్చావా? నా పరువు పోదూ? ఇడియట్.

సత్యవతి:- (కామేశ్వరమ్మ కాలిమీద తలా చేతులూ ఆనిస్తుంది). నువు పొద్దస్తమానం తిట్టి, గేలి చేస్తావుంటే నీ కాళ్లకాడ పడివుండాలా?

నాగభూషణం:- అక్కర్లా. ''కరేపాక్, కరేపాక్'' అమ్మగోరూ యియాల కరేపాకొద్దా'' అంటూ అమ్ముకోటానికి పోవచ్చు. పూలు అమ్ముకోవచ్చు. బేరసారాలే గొప్పవి. లాభాలుంటాయి. ప్రోగ్రామిస్తే యేమి వస్తుందీ? గుండె దడ వస్తుంది.

సత్యవతి:- నువే యిచ్చుకో ప్రోగ్రాము. శేఖరం నన్ను పెళ్లాడి, వాళ్ల వాళ్లను వదిలేసి నాతో వుంటానన్నాడు. సినిమాలో పాటపాడే వుద్యోగం యిప్పిస్తానన్నాడు. నీ కోసం రాలా నేనింటికి.

నాగ:- మళ్లా నీ వెంటబడ్డాడూ శేఖరం? సౌండ్రల్. నా శ్రమంతా వృధా చేస్తాడా? తంతా వెధవని. నా శక్తంతా ధారపోసి నిన్ను పర్ ఫెక్ట్ చేస్తే వాడిని కలుసుకుని వాడి పక్షం మాట్లాడతావా? (లేచి మీదికొస్తాడు) వాడు నిన్ను మభ్యపెడుతున్నాడు. ఎందరి కాళ్లు పట్టుకుంటే (సత్యవతి యేడిచి తల వంచుకుంటుంది. అటు చూడదు. కామేశ్వరమ్మ సత్యవతి తలనిమురుతుంది) ప్లేబాక్ సింగర్‌గా వుద్యోగమొస్తుందో నీకేమైనా తెలుసా? వాడికి తెలుసా? చచ్చు వెధవ. అంత పరపతేడ్సిందీ వెధవకీ?

శర్మ:- కూచోరా బావా. ఒకటే వుద్రేకం. తప్పమ్మా సత్యవతీ! బావే గదూ నీకింత సమర్ధత వచ్చేట్టు శ్రమించిందీ? యేరుదాటి తెప్పతగలేస్తావా?

కామేశ్వరమ్మ:- వూరికేనే అంటుంది శర్మా. నన్నొదిలి యెక్కడికెళ్తుందీ? చేసుకోలేనని దానికి తెలుసు. చూశావా? అప్పుడే అన్నీ కడిగి తుడిచి బోర్లించి, సద్ది వచ్చింది. నేను చెప్పానా? చచ్చానా!

నాగభూషణం:- హింకేం? ఇద్దరు వత్తాసు పలుకుతున్నారు. నీకిద్దరు అంగరక్షకులు కుదిరారు. ఇంకా యేడుపెందుకూ? దొంగ యేడుపూ. లే. లేచి భోజనం కానీయి. తీరిగ్గా లడాయి వేసుకుందువుగాని. నువ్వంటే నువ్వని రేగిపోదువుగాని.

సత్యవతి:- పెదబాబుగార్ని నువ్వంటే నువ్వన్నానా? యేరోజైనా బాబు నన్ను యేడిపించారా? నీకే బుద్ధి లేదు. యెన్ని చేసినా మెచ్చవు. యెంత బాగా పాడినా

ఓనాడూ మెచ్చువు. నీకెప్పుడూ యేడిపించటమే తెలుసు.

శర్మ:– తప్పమ్మా సత్యవతీ! బావే గదూ శ్రద్ధ తీసుకుని హైరానుపడిందీ? నేను నిన్ను గౌరవంగా చూసినా నీకేమి ఒరిగిందీ? అలా నేర్పటం నాకు రాదు గదా. ఉన్నదీ ఖర్చు చేశాను. నీకు శక్తి సామర్ధ్యాలు వచ్చేట్టు చేసింది బావే గదూ.

కామేశ్వరమ్మ:– శర్మా! నేను పోయి వడ్డన చూస్తా. భోజనం వేళైంది. నేనూ గుడ్డలు మార్చుకోవాలి. (లేచి వెళ్తుంది.)

శర్మ:– బావా! నేనూ స్నానం జపం కానీయాలి. ఆకలేస్తున్నది. దాన్ని కవ్వించకు. గెలిచావుగా. ప్రోగ్రామిస్తుంది. వాదులాడి, దాని కర్థంగాకుండా మాట్లాడి దాని ప్రాణం చాలికి తేకు. అది చదువుకుంటుందిట. నే చెప్పిస్తా (ఉత్తరీయం అందుకుని దొడ్డివేపు వెళ్తాడు).

నాగభూషణం:– ప్రాక్టీస్ చేసుకోవూ?

సత్యవతి:– ఇంకెందుకూ? గెలిచావుగా?

నాగ:– నీకు అహం పెరిగిపోతున్నది. ఇంత అహంకారిని పొగడాలా నేను? అవివేకీ. లే. పాడుకుందాం. రా.

సత్యతి:– నువే. పో. పోయి పాడుకో గంటలకొద్దీ.

నాగ:– (నవ్వుతాడు) నేనెందుకు పాడుకోటం? నీకే యింకా నేర్పాలి. ముప్ఫై డెబ్భై కీర్తనలేనా? పన్నెండు రాగాలేనా? సత్యవతీ! పోనీ పొగిడేదా? నీ గొంతు యెంత తీయగా వుంటుందీ? నీ పాట వినాలనున్నది.

సత్యవతి:– రికార్డు పెట్టి వినుకో. నేపాడినవున్నాయి.

నాగ:– (నవ్వుతాడు) కాని సత్యవతీ! రికార్డులో పోట్లాటలేదే. నువ్వంటే నువ్వనదే రికార్డు?

సత్యవతి:– నాకిదే పనా? నీతో వాదులాడలా? నువు లేంది నేను బతకలేననా నీ వుద్దేశం? అమ్మగోరు బతిమలాడితే వచ్చినాను. నీకోసం రాలేదు. ఇలాగే నా యెంటబడి యేడిపించినావంటే యెలిపోతాను. ఇంగరాను. పిలిచినా రాను మొత్తుకున్నారాను. నా చంగతి తెలియదు నీకు. (చివ్వున లేస్తుంది.

పోబోతుంది).

నాగభూషణం:- (పెద్దగా నవ్వుతూ వెళ్లి సత్యవతి రెక్క గట్టిగా పట్టుకుంటాడు) వెళ్లు చూద్దాం (పెద్దగా నవ్వుతాడు)

(శర్మా, కామేశ్వరమ్మా వచ్చి వాళ్లిద్దర్నీ చూసి నవ్వుతూ నిలబడిపోతారు. తెర వాలుతుంది.)